ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 100 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 9 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ తదియ ఉ.11.42
నక్షత్రం: ధనిష్ఠ రా.12.55, వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు

అయోధ్య కేసు విచారణ 10న

ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు

న్యూఢిల్లీ, జనవరి 8: అయోధ్య రామ జన్మభూమి వివాదం కేసును ఈ నెల 10వ తేదీ నుంచి విచారిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ కేసును విచారించేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ ప్రకటించారు. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉన్నారు. ఈ కేసును 10వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు సుప్రీంకోర్టు విచారిస్తుంది. ఆ రోజు ఈ కేసులో వాదనలు ప్రారంభమవుతాయి. ఈ వివరాలను సుప్రీంకోర్టు నోటీసులో ఉంచింది. ఈ నెల 4వ తేదీన సుప్రీంకోర్టు ఈ కేసు విచారణపై ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపిన సంగతి విదితమే. అలహాబాద్ హైకోర్టు ఈ అంశంపై ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాదాపు 14 దావాలు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. అయోధ్య వివాదంలో అలహాబాద్ కోర్టు

- మిగతా 6వ పేజీలో

కర్నూలులో ఏపీ హైకోర్టు బెంచ్

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 8: రాష్ట్ర హైకోర్టు బెంచ్‌ని కర్నూలులో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన, జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం కర్నూలు వచ్చిన ముఖ్యమంత్రి హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. కర్నూలులోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై గతంలోనే సీఎం న్యాయనిపుణుల నుంచి నివేదిక కోరారు. ఆరునెలల క్రితం రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సందర్భంలో సీఎం ఇచ్చిన హామీ ఇప్పుడు నెరవేరే సమయం ఆసన్నమైందని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్ బాషా, శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో రాయలసీమ న్యాయవాదుల ఆకాంక్ష నెరవేరతోందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో రాయలసీమ ప్రజలు అమరావతికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు న్యాయవాదుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఘనగామా





కోటాకు జై

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- అనుకూలం 323.. ప్రతికూలం 3
- నేడు రాజ్యసభ పరిశీలనకు..
- అగ్ర వర్ణ పేదలకు లబ్ధి: గెహ్లాట్
- ఎందుకీ తొందరపాటు: విపక్షాలు
- రాజ్యాంగ సవరణతోనే చట్టం: జైట్లీ


లోక్‌సభలో రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలుపుతున్న పార్లమెంటు సభ్యులు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును దాదాపు నాలుగు గంటల సుదీర్ఘ చర్చ అనంతరం మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా హిందు, సిక్కు, ముస్లిం, బౌద్ధ, జైన మతాలకు చెందిన ఉన్నత వర్గాలలోని పేద ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వం ప్రతిపాదించిన 124 రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 323 ఓట్లు, వ్యతిరేకంగా మూడు ఓట్లు వచ్చాయి. ఈ బిల్లు బుధవారం రాజ్యసభ పరిశీలనకు వెళుతుంది. రాజ్యసభ ఆమోదం లభించగానే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగానే చట్ట రూపం ధరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించిన అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. సవరణ బిల్లుపై వివిధ పార్టీలకు చెందిన ముప్పై మంది సభ్యులు మాట్లాడారు. 'ఇదొక చరిత్రాత్మిక బిల్లు.దేశంలోని కోట్లాది మంది ఉన్నత వర్గాలకు చెందిన పేదలకు ఇదో వరం'అని అభివర్ణించారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించిన మోదీ దేశ చరిత్రలో ధృవ తారగా మిగిలిపోతారని బీజేపీ సభ్యులు ప్రశంసలు కురిపించారు. లోక్‌సభలోని మెజారిటీ పార్టీలు బిల్లును హృదయపూర్వకంగా సమర్థించాయి. అయితే లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్జేడీ, అసదుద్దీన్ నాయకత్వంలోని ఎమ్ఐఎమ్ మాత్రం బిల్లును వ్యతిరేకించాయి. తమిళనాడు ప్రభుత్వం ఇస్తున్న 69 శాతం రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూలులో పెట్టడంపై హామీ ఇవ్వనందుకు అన్నా డిఎంకె సభ్యుడు, డిప్యూటీ స్పీకర్ తంబి దురై వాకౌట్ చేశారు. కులాల వారీగా జనాభా వివరాలు సేకరించి రిజర్వేషన్లు ఇవ్వాలని ఆర్జేడీ సభ్యుడు జయప్రకాశ్‌నారాయణ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని అసదుద్దీన్ ఒవైసీ

- మిగతా 6వ పేజీలో

రాష్ట్రాల విచక్షణకే వదిలేయండి: టీఆర్‌ఎస్


ఎంపీ జితేందర్‌రెడ్డి

అగ్ర కులాల పేదల అభ్యున్నతికోసం ఉద్దేశించిన ఈ పదిశాతం కోటా బిల్లును తాము సమర్థిస్తున్నట్లు టి.ఆర్.ఎస్ పక్ష నాయకుడు జితేందర్ రెడ్డి తెలిపారు. అయితే ఆర్థిక వెనుకబాటును ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. నీటిపారుదల, విద్యుత్తు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించటంలో ఆయా ప్రభుత్వాలు విఫలమైనందుకే ప్రజలు ఆర్థికంగా వెనకబడి పోయారని, పది శాతం రిజర్వేషన్ సరిపోకపోవచ్చునన్నారు. ముస్లింలకు 12 శాతం, ఎస్.టిల రిజర్వేషన్లను 6 నుండి పది శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎవరికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణకు వదిలివేయాలని ఆయన డిమాండ్ చేశారు.


టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన సాయికృష్ణ తల్లిదండ్రులు

సాయికృష్ణను ఆదుకుంటాం

- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభయం
- అమెరికాలో కోలుకుంటున్న మహబూబాబాద్ విద్యార్థి
- మెరుగైన వైద్యం అందించండి: సాయికృష్ణ తల్లిదండ్రులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణకు అండగా ఉంటామని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు హామీ ఇచ్చారు. సాయికృష్ణ తల్లిదండ్రులు మంగళవారం కేటీఆర్‌ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో చికిత్స పొందుతున్న తమ కుమారునికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. ప్రస్తుతం సాయికృష్ణ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని, పలు శస్త్ర చికిత్సలు అవసరం ఉంటాయిని అక్కడి నుంచి తమ కుమారుని స్నేహితులు చెప్పారని తల్లిదండ్రులు కేటీఆర్‌కు వివరించారు. అందుకు కేటీఆర్ స్పందిస్తూ అమెరికా వెళ్ళేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా అవసరమైతే కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకుందామని ఆయన చెప్పారు. మహబూబాబాద్ లోక్‌సభ సభ్యుడు సీతారాం నాయక్ సోమవారం కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్‌తో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్ళేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని

- మిగతా 6వ పేజీలో



మన సంతతి రక్షణ మన బాధ్యత: రాజ్‌నాథ్

పౌరసత్వ చట్టం సవరణ బిల్లుకు ఆమోదం 6


ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసి జ్ఞాపికను అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

19 తర్వాత 'మహా' ప్రణాళిక

- ఢిల్లీలో ప్రకటించిన చంద్రబాబు, శరద్ పవార్
- బీజేపీయేతర పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఈ నెల 19న కోల్‌కతాలో ఏర్పాటు చేసిన ర్యాలీకి హాజరైన అనంతరం తమ భవిష్యత్ రాజకీయ ప్రణాళికను సిద్ధం చేసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ఇరువురు నాయకులు మంగళవారం రాత్రి చర్చలు జరిపిన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు మొదట కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆయన నివాసంలో కలిసి చర్చలు జరిపారు. ఆ తరువాత మరాఠా నాయకుడు శరద్ పవార్, ఎన్సీ అధినాయకుడు ఫరూక్ అబ్దుల్లాతో సమావేశమై మహాకూటమి ఏర్పాటు గురించి సంప్రదింపులు జరిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏపీ భవన్‌కు వచ్చి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ చర్చల అనంతరం చంద్రబాబు, శరద్ పవార్ విలేఖరులతో మాట్లాడారు. కోల్‌కతాలో ఈ నెల 19న టీఎంసీ ఏర్పాటు చేసిన ర్యాలీకి రావలసిందిగా తమను ఆహ్వానించారని వారు తెలిపారు. ఈ ర్యాలీ అనంతరం నాన్ బీజేపీ నాయకులంతా అక్కడే సమావేశమై తమ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేసుకుంటామని చెప్పారు. కోల్‌కతా ర్యాలీకి రాహుల్ గాంధీ హాజరవుతున్నారా అని ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పష్టమైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. రాహుల్‌తో జరిపిన చర్చల వివరాలు వెల్లడించేందుకు కూడా చంద్రబాబు అంగీకరించలేదు. ఉన్నత వర్గాల్లోని పేదవారికి పది శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించాలని సూచించారు. దేశం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు నాన్ బీజేపీ పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు.

సీఎల్పీ పదవికి పోటాపోటీ

- రేసులో భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు
- తమకూ అవకాశం ఇవ్వాలని రాజ్‌గోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డి, గండ్ర, సబితా లాబీయింగ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వం ముహుర్తం ఖరారు చేయడంతో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ శాసనసభా నాయకుడి ఎన్నికపై దృష్టిసారించింది. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల సంఖ్య ప్రతిపక్ష హోదా దక్కించుకోవడాని కంటే ఎక్కువే ఉండటంతో ప్రతిపక్ష నాయకుని పదవి కోసం కాంగ్రెస్‌లో గట్టి పోటీ ఏర్పడింది. ప్రోటోకాల్‌లో సభా నాయకుడు (ముఖ్యమంత్రి) తర్వాతి స్థానం ప్రతిపక్ష నాయకుడిదే కావడంతో కాంగ్రెస్ నుంచి తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మినహా మిగతా పాత కాపులంతా ఈ పదవిపై కన్నేశారు. ప్రతిపక్ష నాయకుడికి కేబినెట్ హోదా ఉండటంతో ఎలాగైనా ఈ పదవిని దక్కించుకోవాలని గతంలో మంత్రులుగా పని చేసిన సీనియర్ ఎమ్మెల్యేలు లాబీయింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో గతంలో మంత్రులుగా పని చేసిన వారిలో ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వనమా వెంకటేశ్వర్‌రావు ఉండగా డిప్యూటీ స్పీకర్‌గా భట్టి విక్రమార్క, ప్రభుత్వ చీఫ్ విప్‌గా గండ్ర వెంకటరమణారెడ్డి, విప్‌గా జగ్గారెడ్డి పని చేశారు. కాగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్నారు. వీరిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే టీపీసీసీ అధ్యక్ష పదవిలో ఉండటంతో సీఎల్పీ నాయకునిగా ఇతరులకు అవకాశం లభించవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో సీఎల్పీ రేస్‌లో మిగతా సీనియర్ ఎమ్మెల్యేలంతా ఉన్నారు. వీరిలో గతంలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన భట్టి విక్రమార్క, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేయడం, విద్యావంతుడు, వాగ్ధాటికి తోడు దళితుడు కావడంతో ఎక్కువ అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఇలా ఉండగా గతంలో హోంమంత్రిగా పని చేసిన సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యా, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పని చేసిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా సీఎల్పీ పదవి ఆశిస్తున్నారు. కాగా సీఎల్పీ నాయకునిగా తమకు కూడా అవకాశం ఇవ్వాలని గండ్ర వెంకటరమణారెడ్డి, జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు. వీరే కాకుండా గతంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన వారిలో పోదెం వీరయ్య, ధనసరి అనసూయ (సీతక్క), సుధీర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఆత్రం సక్కు, రేగా కాంతారావు ఉన్నారు. వీరిలో సుధీర్‌రెడ్డి మినహా మిగతా వారంతా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారే. దళిత, గిరిజనులకు అవకాశం కల్పించే పక్షంలో వీరి పేర్లు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. కాగా మిగతా వారిలో బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, హరిప్రియా నాయక్, ఉపేందర్‌రెడ్డి,

- మిగతా 6వ పేజీలో


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ రజత్‌కుమార్, హాజరైన వివిధ పార్టీల నేతలు

ప్రతి ఒక్కరినీ చేరుస్తాం

ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం అవసరం

పేరు లేదనే ఫిర్యాదు రాకుండా చూస్తాం: సీఈఓ రజత్ కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) డాక్టర్ రజత్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై మంగళవారం ఆయన సచివాలయంలో అఖిలపక్షం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజత్ కుమార్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చాలా మంది తమ పేర్లు ఓటర్ల జాబితా నుండి గల్లంతైనట్టు ఫిర్యాదు చేయడాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ పర్యాయం పకడ్బందీగా సవరణ చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొత్తవారు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, వివిధ కారణాల వల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలిగిపోయిన వారు తిరిగి తమ పేర్లను చేర్పించుకునేందుకు, చనిపోయినవారు ఎవరైనా ఉంటే వారి పేర్లను వారి కుటుంబ సభ్యులు ఓటర్ల జాబితా నుండి తొలగించాలని దరఖాస్తు చేసుకునేందుకు, చిరునామా మారిన వారు కొత్త చిరునామాను చేర్పించేందుకు ప్రస్తుతం అవకాశం ఉందని రజత్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదులు స్వీకరించడం ప్రారంభమైందని, ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

అన్ని రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల కమిషన్‌కు సహకరించాలని రజత్ కుమార్ కోరారు. ఎవరిపేర్లయినా లేవని వారి రాజకీయ పార్టీల దృష్టికి వస్తే వెంటనే వారి పేర్లు చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎవరు కూడా తమ పేరు లేదని ఫిర్యాదు చేయకుండా చూస్తున్నామని, అయితే ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాను పరిశీలించి, ఒక వేళ పేర్లు లేకుంటే వెంటనే నిర్ణీత ఫారంలో దరఖాస్తు చేయాలన్నారు. రాజకీయ పార్టీలన్నీ తమకు సహకరించాలని రజత్‌కుమార్ కోరారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ తరపున మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ తరపున రామచంద్రరావు, టీఆర్‌ఎస్ తరపున శ్రీనివాసరెడ్డి, టీడీపీ తరపున రావుల చంద్రశేఖరరెడ్డి, ఎంఐఎం తరపున జాఫ్రి తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) రాసేందుకు పరీక్ష కేంద్రాల వద్ద బారులు తీరులు అభ్యర్థులు

ప్రశాంతంగా మొదలైన జేఈఈ

జేఈఈ ఆర్కిటెక్చర్ పేపర్ సులభంగా ఉందన్న అభ్యర్థులు • నేటి నుంచి జేఈఈ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ఐఐటీ జేఈఈ తొలి రోజు చాలా ప్రశాంతంగా ముగిసింది. తొలి రోజు జేఈఈ ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్ -2 నిర్వహించింది. బుధవారం నుంచి ఇంజనీరింగ్ స్ట్రీం వారికి పేపర్ -1 నిర్వహించనుంది. తొలి రోజు మాథ్స్, ఆప్టిట్యూడ్, డ్రాయింగ్ ప్రశ్నలు చాలా తేలికగా రావడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మాథ్స్‌లో 30 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్‌లో 50 ప్రశ్నలు రాగా, డ్రాయింగ్‌లో మాత్రం కేవలం మూడు ప్రశ్నలతో వదిలిపెట్టడం విద్యార్థులకు ఒకింత ఆశ్చర్యానికే గురిచేసింది. నగరంలో ఐయాన్ డిజిటల్ జోన్ (టీసీఎస్) ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించారు. గత ఏడాది జరిగిన వివాదాలకు తావు లేకుండా ఈసారి అధికారులు సున్నితంగా వ్యవహరించడం గమనార్హం. గత ఏడాది అమ్మాయిలను నఖశిఖపర్యాంతం పరీక్షించిన అధికారులు ఈసారి కాస్తా ఉదారంగానే అమ్మాయిలను పరీక్షలకు అనుమతించారు. దాంతో విద్యార్థుల్లో టెన్షన్ పోయింది. హైదరాబాద్ జోన్ ఇన్‌ఛార్జిగా నియమితులైన సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునేరి నాగి ప్రత్యేకించి ఇచ్చిన మార్గదర్శకాలతో పరిశీలకులు చాలా మృధువుగా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 22 జాతీయ సంస్థల్లో ఇంజనీరింగ్ యూజీ కోర్సులో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ తొలి సారి నిర్వహిస్తున్న ఐఐటీ జేఈఈ ఆన్‌లైన్ పరీక్ష 8వ తేదీన మొదలైంది. ప్రతి పరీక్ష కేంద్రానికీ ముగ్గురు చొప్పున పరిశీలకులను నియమించింది. వారందరికీ ఆరు, ఏడు తేదీల్లో మాక్ టెస్టు ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఇంజనీరింగ్ పరీక్షకు 9,29,198 మంది దరఖాస్తు చేశారు. అందులో 6.85 లక్షల మంది అబ్బాయిలు, 2.8 లక్షల మంది అమ్మాయిలు, 38 మంది ట్రాన్స్ జండర్లున్నారు. మొత్తం అభ్యర్థుల్లో 4.72 లక్షల మంది జనరల్, 3.67 లక్షల మంది ఓబీసీ, 0.89 లక్షల మంది ఎస్సీలు, 0.36 లక్షల మంది ఎస్టీలున్నారు. కేవలం తెలుగురాష్ట్రాల నుంచే దాదాపు లక్షన్నర మంది పరీక్ష రాస్తున్నారు. ఆంధ్రాలో 19, తెలంగాణలో 7 రీజనల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 258 పట్టణాల్లో 467 కేంద్రాలు ఏర్పాటు చేశారు. విదేశాల్లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

క్యూనెట్ గుట్టు రట్టు

ఛేదించిన సైబరాబాద్ పోలీసులు • రూ.1000 కోట్ల మేర మోసం చేసినట్టు అంచనా • అన్ని రాష్ట్రాల్లో కేసులు

రూ. 2.7 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు • నిరుద్యోగ యువతే లక్ష్యంగా ఘరానా మోసం

గచ్చిబౌలి, జనవరి 8: ఒక్క రూపాయి సొంత డబ్బు లేకుండా కోట్లు సంపాదించవచ్చు.. నీ దగ్గర డబ్బులేక పోతే బ్యాంకులో అప్పు తీసుకుని మా సంస్థలో పెట్టుబడి పెట్టు .. బ్యాంకు రుణం మేమే ఇప్పిస్తాం.. సంవత్సరంలో కోట్లు సంపాదించవచ్చు అంటూ నిరుద్యోగ యువతకు ఆశలురేపి మోసం చేస్తున్న క్యూ నెట్ గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టుచేశారు. ఇరవై ఏళ్లుగా లక్షలాది మందిని మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసం చేస్తున్న సంస్థకు పోలీసులు కళ్లెం వేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో నిందితుల వివరాలను సైబరాబాద్ సీపీ సజ్జనార్ వివరించారు. విజయ్ ఈశ్వర్, జోసెఫ్ బిస్మార్క్‌లు 1998లో హాంగ్‌కాంగ్‌లో క్యూ ఐ గ్రూప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం 2001లో గోల్డ్ క్వెస్ట్‌ను, 2004లో ఐ క్వయిన్ పేరుతో సంస్థలను ఏర్పాటుచేసి మోసాలకు పాల్పడినట్లు చెప్పారు. హాంకాంగ్, మలేషియాలో క్యూ నెట్‌కు అనుమతులున్నప్పటికీ మన దేశంలో ఎలాంటి అనుమతులు లేవన్నారు. 2004లో క్వెస్ట్ కాయిన్ పేరుతో బిజినెస్ మొదలు పెట్టి అరుదైన కాయిన్ ఉంటే అదృష్టం మీ వెంటే అంటూ అమాయకుల్ని బురిడీ కొట్టించడంతోపాటు అనేక రకాల పేర్లతో జనాల్ని మోసగిస్తూనే ఉందని తెలిపారు. 2011లో క్యూనెట్ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో గొలుసుకట్టు వ్యాపారం మొదలైందని ఎలాంటి అనుమతులు లేని ఉత్పత్తులు, వస్తువులను అంటగడుతూ అమాయకుల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. సదరు సంస్థలపై దేశవ్యాప్తంగా కేసులు ఉన్నాయని సీపీ చెప్పారు. కేసు నమోదు అయిన వెంటనే మరో పేరుతో మోసాలు చేస్తున్నట్లు సీపీ వివరించారు. బిజినెస్ ప్లాన్ ఉందని అమాయక నిరుద్యోగ యువకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడున్నారు. ఒక్కొక్కరి దగ్గర లక్ష నుండి ఐదు లక్షల వరకు వసూళ్లు చేశారని చెప్పారు. ఖరీదైన హోటల్స్‌లో నిరుద్యోగ యువకులతో సమావేశాలు ఏర్పాటు చేయడం బిజినెస్ గురించి వివరించే వ్యక్తి సూటు బూటుతో వచ్చి తాను కూడా గత రెండేళ్ల క్రితం ఒక్కపైసా లేకుండా వీధుల్లో తిరిగానని ఇప్పుడు కోట్లు సంపాదించానని చెప్తాడు. తమ సంస్థలో చేరితే విదేశాల్లో విహారయాత్రలు, స్టార్ హోటల్స్‌లో విందులు ఉంటాయని తక్కువ కాలంలో కోట్లు సంపాదించవచ్చని ప్రలోభాలకు గురి చేస్తారు. తను ఏ కంపెనీలో పనిచేస్తున్నది మాత్రం బాధితులకు చెప్పడు. బాధితుడు పెట్టుబడి పెట్టిన తరువాత ఎంతకీ ఎలాంటి డబ్బు రాకపోవడంతో ఎవరి ద్వారా డబ్బులు చెల్లించారో వారిని ప్రశ్నిస్తే మరో ఇద్దర్ని చేర్పించాలని సమాధానం వస్తుందని చెప్పారు. ఐటీ ఉద్యోగులతో పాటు ఉన్నత విద్యావంతులైన యువకులు వీరి బారిన పడి మోసపోతున్నారని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్రలో క్యూనెట్ బాధితులు లక్షలాది మంది ఉన్నారని అన్నారు. సైబరాబాద్‌లో 14 కేసుల్లో 58 మందిని క్యూనెట్ ఏజెంట్లను అరెస్టు చేశామని చెప్పారు. బెంగుళూరులో ఉన్న క్యూనెట్‌కు సంబంధించిన గోడౌన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఏజెంట్లకు సంబంధించిన బ్యాంకు అకౌంట్లను విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రయివేటు లిమిటెడ్ పేరుమీద ఉన్న ఖాతాలో రెండు కోట్ల 7లక్షల రూపాయలను ఫ్రీజ్ చేసినట్లు సీపీ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేసిన నిందితులను అరెస్టు చేసిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్, ఎస్ఓటీ పోలీసులను అభినందించారు. డీసీపీ విజయకుమార్, వెంకటేశ్వరరావు, ఏడీసీపీ ప్రవీణ్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ సురేందర్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



క్యూనెట్ గురించి వివరిస్తున్న సీపీ ఇతర అధికారులు

రిజర్వేషన్ల బిల్లుపై సవరణలకు పార్లమెంటులో పట్టుబట్టండి

ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ఇబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లులో సవరణలు కోరాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు తమ (టీఆర్ఎస్) పార్టీ ఎంపీలను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ముస్లిలలో వెనుకబడిన వారికి 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అదేవిధంగా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ తీర్మానాన్ని ఇదివరకే కేంద్రానికి పంపించడం జరిగిందని, కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్రం రిజర్వేషన్లను పెంచేందుకు ప్రక్రియ ప్రారంభించినందున, ఈ బిల్లులో తెలంగాణలో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేయాలని ఆయన సూచించారు. రిజర్వేషన్ల పెంచే అంశాన్ని కూడా ఈ బిల్లులో చేర్చాలని కేంద్రాన్ని కోరాలని కేసీఆర్ వారిని ఆదేశించారు. బిల్లులో సవరణ తీసుకుని వచ్చి, తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్రాన్ని పట్టుబట్టాలని సీఎం కేసీఆర్ వారికి సూచించారు. అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగావకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ ఖాన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ నరసింహన్ నియమిస్తూ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అసెంబ్లీ కార్యదర్శి వీ. నరసింహాచార్యులు తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో ప్రొటెం స్పీకర్‌గా గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయిస్తారు. ఆ మర్నాడు ప్రొటెం స్పీకర్ ఖాన్ అసెంబ్లీకి ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయిస్తారు. స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ముగిసేంత వరకూ ప్రొటెం స్పీకర్‌గా ఖాన్ ఉంటారు.



అభినందనలు అందుకుంటున్న ఖాన్

కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: అగ్రవర్ణాల నిరుపేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి తెలిపారు. ఏపీసీసీ మేనిఫెస్టో కమిటికి అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరామన్నారు. ఇందిరాభవన్‌లో ఇక్కడ మంగళవారం రఘువీరారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల గడిచాక ఎన్నికల ముందు హడావుడిగా ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామనడంలో నిజాయితీ కనిపించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వేషన్లు కల్పించి ఉంటే చాలా మందికి మేలు కలిగేదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఏర్పడటంతోనే ఈబీసీ రిజర్వేషన్లను తెరపైకి తెచ్చి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తుందని రఘువీరారెడ్డి విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఓబీసీలకు కూడా రిజర్వేషన్లు పెంచాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు.

అగ్రవర్ణ పేదోళ్ళను మభ్యపెట్టేందుకే..

కేంద్ర నిర్ణయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: రానున్న సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున భారతీ జనతా పార్టీ ఓట్లు దండుకోవడానికి అగ్రవర్ణాల్లో పేదేళ్ళకు 10 శాతం రిజర్వేషన్లను తీసుకురావడం ఎన్నికల తంతేనని తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ విపర్శించారు. మంగళవారం ఎన్టీఆర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గత నాలుగేళ్ళల్లో అగ్రవర్ణ పేదేళ్ళ బిజేపీకి గుర్తుకు రాలేదని ఆయన నిలదీశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున బిజేపీ వ్యూహాత్మకంగా ఈబీసీ రిజర్వేషన్లను తీసుకువచ్చిందన్నారు. ఈబీసీ బిల్లును రాష్ట్రాలు తీర్మానం చేయాల్సి ఉంటుందని, అందుకు 2/3 వంతు మెజార్టీ అవసరం అన్నారు. తెలంగాణలో మైనార్టీలకు 12, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రం ఎందుకు పక్కన పెట్టిందని ఆయన నిలదీశారు.

రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలంటే కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని తక్షణం ఎర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు ఏ వర్గంలో ఉన్నా వారికి న్యాయం చేయాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉందని టీడీపీ భావిస్తోందని చెప్పారు.

సార్వత్రిక సమ్మెకు మిశ్రమ స్పందన

వామపక్షాలు, అనుబంధ సంస్థలు ధర్నాలు, రాస్తారోకోలు • బీడీ కార్మికుల మద్దతు

ఆంధ్రనూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: కేంద్రంలో ఉన్న బిజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నందున అందుకు నిరసనగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు తెలంగాణలో మిశ్రమ స్పందన వచ్చింది. తెలంగాణలో అత్యధికంగా ఏడు లక్షల మంది పైగా బీడీ కార్మికులు సమ్మెకు మద్దతు పలకడం గమనార్హం. దీంతో సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యిందని వామపక్షాలు ప్రకటించాయి. రాష్ట్ర వ్యాపితంగా ఇరవై లక్షల మందికి పైగా సంఘటిత, అసంఘటిత కార్మికులు సార్వత్రిక సమ్మెకు బాసటగా నిలిచారు. హైదరాబాద్ బీడీఎల్‌లో పని చేస్తున్న కార్మికులు సమ్మెలో భాగస్వాములు అయ్యారు. కాంట్రాక్టు కార్మికులు భారీగా పాల్గొనడంతో సమ్మెకు ఊపు వచ్చింది. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వామపక్షాల ధర్నాకు మహా స్పందన వచ్చిందని వామపక్షాల కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. ఈ ధర్నాకు వేలాదిగా కార్మికులు తరలివచ్చారు. కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో నడుస్తున్న చిన్నా, పెద్ద పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వామపక్ష జాతీయ పార్టీలైన అనుబంధ సంస్థలకు చెందిన కేడర్ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానికి కృషి చేశాయి.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉన్న సింగరేణి బొగ్గు గనుల్లో పని చేస్తున్న కార్మకులు 45 శాతం సమ్మెలో పాల్గొన్నారు. రామగుండం ఎన్‌టీపీసీలో పని చేస్తున్న కార్మికులు అత్యధికంగా సమ్మెలో పాల్గొనడం విశేషం. తెలంగాణలో పోస్టల్ విభాగంలో పని చేస్తన్న కార్మికుల్లో 80 శాతం, బీఎస్ఎన్ఎల్‌లో 45 శాతం కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తెలంగాణ ఆర్‌టీసీలో 35 శాతం కార్మికులు పాల్గొన్నారు. హైదరాబాద్,సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న పరిశ్రమల్లో అత్యధికంగా సార్వత్రిక సమ్మెకు మద్దత్తుగా సమ్మెలో పాల్గొన్నారు. ధర్నాలో వామపక్షాల కార్మిక సంఘల నేతలు పాల్గొన్నారు. సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి ఎం సాయి బాబు, సీఐటీయు అఖిల భారత ఉపాధ్యక్షుడు ఆర్ సుధాభాస్కర్, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘ నేతలు జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయుసీ రత్నాకర్‌రావు, సీఐటీయు సదానంద్‌గౌడ్, టీఆర్ఎస్‌కేవీ భరత్, ఎఐయుటీయుసీ సూర్యం, ఐఫ్‌కేయు బోస్, టీఎన్‌కేయుసీ ఎం శ్రీనివాస్, ఆర్‌టీసీ అజీజ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బి, వెంకట్, వెంకట్రాములు, రైతు సంఘం నేత పి జంగారెడ్డి, పశ్యపద్మ, మహిళా సంఘం నాయకులు మల్లులక్ష్మీ, సృజన, టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు సమ్మెలో పాల్గొన్నారు.

పంచాయతీలకు భారీగా నామినేషన్లు

సర్పంచ్ స్థానాలకు 8524 ★ వార్డులకు 20,902

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: గ్రామ పంచాయతీ తొలిదశ నామినేషన్ల పర్వం ప్రారంభమైన తర్వాత మంగళవారం రెండోరోజు వరకు సర్పంచ్ స్థానాలకు 8,524 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు సభ్యుల స్థానాలకు 20,902 నామినేషన్లు దాఖలయ్యాయి. సిద్ధిపేట జిల్లాలో 186 గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు అత్యధికంగా 661 నామినేషన్లు దాఖలయ్యాయి. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో అతితక్కువగా 78 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 2366 నామినేషన్లు, వనపర్తి జిల్లాలో అతి తక్కువగా 171 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిదశ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేసేందుకు బుధవారం చివరిరోజు. భారతీయ సాంప్రదాయం ప్రకారం బుధవారం తదియ అవుతుంది. ఈరోజు మంచిరోజుగా భావిస్తారు. అందువల్ల బుధవారం ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

సర్వే వ్యాఖ్యలు సబబు కాదు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారని కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ ఉపాధ్యాక్షుడు మల్లు రవి తప్పుపట్టారు. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో సర్వే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధకరం, సబబు కాదన్నారు. సర్వే సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ, తమ పదవులకు కుంతియా, ఉత్తమ్ రాజీనామా చేయాలని సర్వే డిమాండ్ చేయడంపై ఆయనే సమాధానం చెప్పాలన్నారు. పార్టీ నుంచి సర్వేను సస్పెండ్ చేసిన వ్యవహారాన్ని ఏఐసీసీ చూసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయన్నారు. డబ్బులు, మద్యం పంపిణీ, అధికార దుర్వినియోగం వల్లనే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని మల్లు రవి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని రాజకీయ వర్గాలే కాకుండా మీడియా కూడా భావించిందని మల్లు రవి అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందన్నారు.

ఈబీసీ రిజర్వేన్లు ఎన్నికల స్టంటే

సీపీఐ రాష్ట్ర కార్యదిర్శ చాడ వెంకటరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: వచ్చే లోకసభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్రం ఆదరాబాదరగా ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాల్లోని వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందని రాష్ట్ర సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు.మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత కొన్నేళ్ళగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను ఆకస్మికంగా తెరపైకి తీసుకురావడం ఏమిటని ఆయన నిలదీశారు. రాజ్యాంగంలో ఉన్న 15,16 అధికరణలకు సవరణ చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని బిల్లును ప్రవేశపెట్టి ఉంటే భాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈబీసీలకు రిజర్వేషన్లపై అభ్యంతరాలు లేనప్పటికీ ఇతర వర్గాల్లో ఆందోళన, అభద్రత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.


విత్తన రంగంలో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు

★ జూన్ 26 నుంచి తొమ్మిదిరోజుల పాటు విత్తన సదస్సు

★ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: తెలంగాణ రాష్ట్రానికి విత్తన రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు వస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, విత్తనాభివృద్ధి సంస్థ నేతృత్వంలో ఈ సంవత్సరం జూన్ 26 నుండి జూలై 3 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ విత్తన సదస్సు' (ఇస్తా సీడ్ కాంగ్రెస్-2019) ఏర్పాట్లపై సచివాలయంలో మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే 'ఇస్తా' సదస్సు వివరాలు, సదస్సు జరిగే ప్రదేశంపై చర్చించారు. అలాగే వివిధ దేశాలు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చే ప్రతినిధులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. విత్తన రైతుల సమావేశం, భద్రత, ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతినిధుల విహార యాత్రతదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, ఆసియా ఖండంలోనే మొట్టమొదట తెలంగాణలో 'ఇస్తా' అంతర్జాతీయ విత్తన సదస్సు జరుగుతుండటంతో అంతర్జాతీయంగా తెలంగాణకు గుర్తింపు లభిస్తోందని పేర్కొన్నారు. విత్తనోత్పత్తి, విత్తన ధృవీకరణలో అనేక సంస్కరణలు వచ్చాయని, విదేశాలకు కూడా తెలంగాణ నుండి విత్తనాలు ఎగుమతి అవుతున్నాయని గుర్తు చేశారు. ఇస్తా సమావేశం విజయవంతం కావాలని, ఇందుకోసం సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం వైపు నుండి అవరమైన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.



సదస్సు నిర్వహణపై ఉన్నత స్థాయి సమావేశంలో చర్చిస్తున్న జోషి, పార్థసారథి

దేశ, విదేశాల నుండి దాదాపు 800 మంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతుండటం వల్ల భద్రతా చర్యలు తీసుకోవాలని జోషి పోలీసు ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా సూచించారు. సమావేశాలు జరిగే తొమ్మిది రోజుల పాటు రోజూ ఒక గంటపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఇవి ఉండాలని సూచించారు.

ఇస్తా సమావేశాల గురించి ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి పవర్‌పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. 60 దేశాల నుండి 400 మంది ప్రతినిధులు వస్తున్నారని, దేశంలోని వివిధ రాష్ట్రాలు, వివిధ యూనివర్సిటీలు, వ్యవసాయ సంస్థల నుండి మరో 400 మంది ప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. సమావేశాల సందర్భంగా ఒక రోజు వెయ్యి మంది రైతులతో సీడ్ ఫార్మర్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కాడ్‌బెరీ, సదస్సు నోడల్ ఆఫీసర్ డాక్టర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గనున్న పత్తిధర!

★ కనీస మద్దతు ధర తగ్గకుండా చూడాలి

★ కందుల కొనుగోలుకు అదనపు కేంద్రాలు

★ మార్కెటింగ్ అధికారులకు పార్థసారథి ఆదేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: మార్కెట్‌లో పత్తిధర తగ్గుతోందని, అందువల్ల రైతులకు ఇబ్బంది లేకుండా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించేలా మార్కెటింగ్, సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా), మార్క్‌ఫెడ్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2018-19 సంవత్సరానికి సంబంధించి సీసీఐ ఇప్పటి వరకు 731 కోట్ల రూపాయల విలువ చేసే 1,34,805 టన్నుల పత్తిని 54,512 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్టు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి తెలిపారు. పత్తిధరలు తగ్గుతున్నందు వల్ల జిల్లా కలెక్టర్లు గుర్తించిన 202 జిన్నింగ్ మిల్లులతో పాటు 27 మార్కెట్ యార్డుల నుండి పత్తికొనుగోలును వేగంగా కొనసాగించాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించారు. పత్తికొన్న వెంటనే రైతులకు డబ్బు చెల్లించాలని ఆదేశించారు. గజ్వేల్‌లో పత్తికొనుగోలు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వచ్చిన ఆరోపణతో వెంటనే సదరు అధికారిని మార్చాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో సంబంధిత అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. రైతుల నుండి కందులను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ప్రారంభించిన 19 కేంద్రాలతో పాటు మరో 127 కొనుగోలు కేంద్రాలను బుధవారం నుండే ప్రారంభించాలని లక్ష్మీబాయి ఆదేశించారు. మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి. భాస్కరాచారి, మార్కెటింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో తెలంగాణ భవన్ కోసం విరాళాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: తెలంగాణ రాష్ట్ర సమితి ఢిల్లీలోనూ తెలంగాణ భవన్ నిర్మించాలని ఇటీవల నిర్ణయం తీసుకున్నది. ఈ విషయంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు పట్టుదలతో ఉన్నారు. ఇలాఉండగా ఢిల్లీలో నిర్మించబోయే తెలంగాణ భవన్ కోసం మంగళవారం రంగారెడ్డి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తన వంతు విరాళంగా రూ.5 లక్షలు ప్రకటించారు. ఈ మేరకు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావును కలిసి చెక్కును అందజేశారు.

బలవంతంగా ఏకగ్రీవం చేస్తే చర్యలు

పరిశీలకుల అనుమతి తర్వాతే ఏకగ్రీవాలు • ఎన్నికల కమిషన్ ఆదేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: గ్రామ పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికల జరిగితే మంచిదేనని, అయితే బలవంతంగా, బెదిరించి ఏకగ్రీవ ఎన్నికలు చేయకూడదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. ఈ విషయంలో కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టరేట్లలో ఎన్నికలకోసం ఫిర్యాదుల విభాగం ప్రారంభించాలని, వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లకు ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏవైనా గ్రామాల నుంచి సర్పంచ్ స్థానాలకు, వార్డుసభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలైతే సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి నేరుగా ఏకగ్రీవ ఎన్నిక అయినట్టు హడావుడిగా ప్రకటించకూడదని, సంబంధిత ఎన్నికల పరిశీలకుడికి వివరాలు తెలియచేసి, ఆయన అభిప్రాయం తీసుకోవాలన్నారు.

ఇలాంటి సందర్భాలలో ఎన్నికల పరిశీలకులు సంబంధిత గ్రామాన్ని సందర్శించి, స్వతంత్రంగా, స్వేచ్ఛగా, కూలంకషంగా విచారణ చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు స్వేచ్ఛగా, ప్రజలందరి సమ్మతితోనే ఏకగ్రీవ ఎన్నిక జరుగుతున్నట్టు ధృవీకరించుకున్న తర్వాతనే ఎన్నికల పరిశీలకులు అనుమతి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ కార్యదర్శి సూచించారు.

హైదరాబాద్- తిరుపతి మధ్య సంక్రాంతికి ప్రత్యేక రైళ్ళు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8:రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైదరాబాద్- సికింద్రాబాద్- తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్ళను నడపడానకి ఏర్పాటు చేశారు. ఈ రైళ్ళ ఈనెల 12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7గంటలకు తిరుపతికి చేరుకుంటుంది, 13వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం హైదరాబాద్ 6.45 గంటలకు చేరుకుంటుంది. తిరుపతికు వెళ్ళే రైలు 02764,తిరుపతి నుంచి వచ్చే రైలు 02763 నెంబర్‌కు ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవచ్చునని రైల్వే శాఖ ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ -తిరుపతి మధ్య నడిచే రైల్ళు వరంగల్- ఖమ్మం, విజయవాడ, ఒంగోల్, నెల్లూరు. రేణిగుంట మీదుగా తిరుపతి చేరుటుంటుంది. తిరుగు ప్రయాణంలో అదే మార్గంలో నడుస్తాయని సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు.

కాగా రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా రైల్వే చాంపియన్ సిప్ ఆఫ్ ట్రాక్ సేక్లింగ్ ఈవెంట్‌ను రైల్వే సీనియర్ అధికారి మధుసూదనరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకి చెందిన జీత్‌రాంమ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా, సౌత్ వెస్టర్న్ రైల్వేకి చెందిన రాజుబాటికి బంగారు పతకం దక్కింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అడ్వాజరీ, చీఫ్ అకౌంట్ అధికారి ఈవీ కృష్ణారెడ్డి, డివిజన్ సెక్యూరిటీ అధికారి సెంతీ పాల్గొన్నారు.

రబీ పండాలంటే కర్నాటక కరుణించాల్సిందే

కృష్ణాబేసిన్ పైనున్న ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటిమట్టం

- ప్రస్తుతం ఆల్మట్టిలో 57 టీఎంసీలు.
- నారాయణపూర్‌లో 18 టీఎంసీల నీటి నిల్వ
- డెడ్‌స్టోరేజీకి చేరుకుంటున్న జూరాల ప్రాజెక్టు
- శ్రీశైలం జలాశయంలో సైతం 59 టీఎంసీలు మాత్రమే
- ఆయకట్టు రైతుల్లో కలవరం.. శ్రీశైలంలో రోజురోజుకూ తగ్గుముఖం

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 8: తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా బేసిన్ పరిధిలోని ఆయకట్టు రైతులు రబీ పంటలు పండించుకోవాలంటే కన్నడ రాష్ట్రం కరుణించాల్సిందే. రాష్ట్రంలోని కృష్ణానదిపై గల సాగునీటి ప్రాజెక్టులలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతుంది. దీంతో సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి రాబోతుంది. ఇప్పటికే రబీ పంటల సాగుపై ప్రశ్నార్థకంగా మారింది. అయా ప్రాజెక్టుల కింద ఆయకట్టును సాగు చేసుకోవాలంటే ప్రాజెక్టులలో నీటి నిల్వ ఉండాల్సిందే. కానీ రాష్ట్రంలోని కృష్ణా బేసిన్ పరిధిలో గల ప్రాజెక్టులలో నీటి మట్టం తగ్గిపోతుంది. వేసవి కాలం రాకముందే జూరాల ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి రావడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారానే పలు తాగునీటి పథకాలు ఉన్నాయి. మంగళవారం నాటికి అయా ప్రాజెక్టుల అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో కేవలం 4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. 9.66 టీఎంసీల కెపాసిటీకి గల ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజీలోకి వస్తుంది. ప్రస్తుతం 4 టీఎంసీలు అని చెప్పుకుంటున్న జూరాలలో పుడిక ఉండడంతో అది మూడు టీఎంసీలే ఉండొచ్చని రైతులు, అధికారులు అంచనా వేసుకుంటున్నారు. ఇకపోతే శ్రీశైలం జలాశయంలో సైతం రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు కెపాసిటీ 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 59 టీఎంసీల నీరు మాత్రమై ప్రాజెక్టులో ఉంది. అయితే ఈ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల మోటార్లు ఆన్‌లో ఉండడంతో రోజురోజుకు నీటి మట్టం పడిపోతోంది. ఇక్కడి అవసరాలకు అనుగుణంగా ఇక్కడి రెండు ప్రభుత్వాలు నీటిని వాడుకుంటుండంతో వేసవి నాటికి తాగునీటి అవసరాలకు సైతం ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు మాత్రం దాపురించి ఉన్నాయి. ఈ పరిస్థితుల నుండి గట్టెక్కాలంటే కర్నాటక కరుణించాల్సి ఉంది. అయితే కర్ణాటకలోని కృష్ణానదిపై గల అల్మట్టి ప్రాజెక్టులో 129 టీఎంసీలకు గాను ప్రస్తుతం 58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదే విధంగా కర్నాటకలోని మరో ప్రాజెక్టు నారాయణపూర్‌లో 37 టీఎంసీలకు గాను దాదాపు 19 టీఎంసీల నీటిమట్టం ఆ ప్రాజెక్టులో ఉంది. కర్నాటక నుండి జూరాల ప్రాజెక్టుకు రెండు టీఎంసీల నీటి వదిలితే ప్రస్తుతం జూరాల ఆయకట్టు రైతులు సాగు చేసుకుంటున్న ఆరుతడి పంటలు బయటపడే అవకాశం ఉంటుంది. మార్చి నెలలో మరో ఒకటి రెండు టీఎంసీల నీటిని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుండి విడుదల చేస్తే తాగునీటి అవసరాలు సైతం గట్టెక్కే పరిస్థితులు ఉంటాయి.



జూరాల ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

కాగా జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో కలవరం మొదలైంది. ప్రాజెక్టు మొదటి ఆయకట్టు రైతులు ప్రతి రోజు ప్రాజెక్టు దగ్గర కాపలా కాస్తూ నీటిని ఎక్కువగా చివరి ఆయకట్టుకు వదలకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో రైతుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించాలంటే ప్రభుత్వం తక్షణమే కేంద్ర జలవనరుల శాఖను సంప్రదించాలి. లేకపోతే కృష్ణా ట్రిబ్యునల్‌నైనా ఆశ్రయించాల్సిందే.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రైతుల్లో ఆత్మస్థైర్యం నింపిన రైతుబంధు

రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరకొండ, జనవరి 8: వ్యవసాయం కలిసి రాక అప్పుల పాలై ఆత్మహత్యలే శరణ్యంగా భావించిన రైతుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు చెక్కులు ఆత్మస్థైర్యం నింపాయని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బీమా, రైతుబంధు పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల వల్లే రైతుల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్ట్‌లకు కేంద్రం ఒక్క రూపాయి కూడా గ్రాంట్ ఇవ్వలేదని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణం జరుగుతోందని ఆయన చెప్పారు.

రైతు కళ్ళలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వడ్త్యా దేవేందర్‌నాయక్, జడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహా, గోపి, కృష్ణ పాల్గొన్నారు.

సర్వే సస్పెన్షన్ సరికాదు

మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు

కల్వకుర్తి, జనవరి 8: గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడితే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ సమావేశాలకు రాష్ట్రంలోని సీనియర్ నాయకులను అందరినీ పిలవాలని, అందరి సలహాలు, సూచనలు తీసుకొని పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన నాయకులకే తిరిగి ఇన్‌చార్జిలుగా కొనసాగించడం దారుణమని, ఎన్నికల్లో ఓటమిపై సమీక్షించక పోవడం దారుణమని మాజీ మంత్రి అరోపించారు. ఎన్నికలకు అభ్యర్థులను అలస్యంగా ప్రకటించారనడం అసత్య అరోపణ అని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు మినహా ఇతర అభ్యర్థులను బస్సు యాత్రంలోనే ప్రకటించారని గాంధీ భవన్ చుట్టు కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు మాత్రమే తిరిగారని ఆయన గుర్తు చేశారు. గతంలో అనేక మంది కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా, పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై పలు మార్లు విరుచుపడ్డిన సంఘటనలు ఉన్నాయని, పార్టీ సమీక్ష సమావేశంలో వాస్తవాలు చెప్పితే సస్పెండ్ చేయడం దారుణమని ఆయన అన్నారు. కేవలం దళితుడు అనే కారణం చేతనే మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణను సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

సిరిసిల్ల, జనవరి 8: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాల్‌రావుపల్లె గ్రామంలో అప్పుల బాధతో పంకరి మల్లయ్య (62) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ శ్మశానవాటికలోని షెడ్డులో మల్లయ్య ఉరి వేసుకుని మృతి చెందగా, మంగళవారం ఉదయం ఆయన మృతదేహంను కనుగొన్నారు. సోమవారం రాత్రి ఇంటిలో అందరు నిద్రించాక, మల్లయ్య ఇంటి బయట ప్రధాన ద్వారంకు గడియ పెట్టి వెళ్ళిపోయాడు. రాత్రి రెండు గంటల తర్వాత ఆయన భార్యకు మెలుకవ రావడంతో పక్కన మల్లయ్య కనిపించలేదు. మంగళవారం వేకువజామున శ్మశానవాటిక వద్ద ఉరి వేసుకుని కనిపించాడు. తంగళ్ళపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవి తల్లిపై గొడ్డలి వేటు

ఆగని కలప స్మగ్లర్ల ఆగడాలు

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 8: సమస్త మానవాళికి వరప్రసాదమైన వృక్షసంపద నేడు స్మగ్లర్ల పాలిట బంగారు పంటగా మారింది. నిత్యం కోట్లాది విలువ చేసే కలప పశ్చిమ అడవుల నుంచి గోదావరి నది తీరం మీదుగా నగరాలకు తరలిపోతుంది. అడవి తల్లి ఎదపై గొడ్డలి వేటు పడకుండా కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని స్వయంగా సీఎం కేసీఆర్ సోమవారం అధికారులను ఆదేశించారు. సీఎం సమీక్ష జరపడంతో ముందుముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని పెద్ద ఎత్తున మంగళవారం ఉదయం నుంచే గోదావరి నది తీరం మీదుగా నగరాలకు అటవీ సంపదను తరలించేందుకు స్లగ్లర్లు సమాయత్తమయ్యారని సమాచారం. అడవి తల్లి ఎదపై స్లగ్లర్ల గొడ్డలి వేటుకు పశ్చిమ అడవులు మైదానాలుగా మారుతున్నాయి. కీకారణ్యాల నుంచి అనునిత్యం లక్షలాది విలువైన కలప కరీంనగర్ మీదుగా హైదరాబాద్ నగరానికి చేరుకొని అక్కడి నుంచి నగరాలకు తరలిపోతున్నట్లు సమాచారం. అటవీశాఖలోని కొందరు అవినీతి అధికారుల సహకారంతోనే గత కొన్నేళ్ళుగా కలప స్మగ్లింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. అభయారణ్యాల్లోని మహావృక్షాలను నేల కూల్చి ఎవరి కంట పడకుండా తరలించేందుకు కంచే చేను మేసినట్లు అటవీ శాఖలో కొందరు అధికారులు స్మగ్లర్లకు సహకరిస్తున్నట్లు సమాచారం. అడవులపై స్మగ్లర్ల కన్నుపడటంతో దట్టమైన అడవులు అంతరించిపోతున్నాయి. కాగా కంచే చేనుమేస్తే కాచేదెవరని, అటవీ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతోనే కొన్నేళ్ళుగా కలప వ్యాపారం కొనసాగుతుందని పలువురు పేర్కొంటుండటం గమనార్హం.



ద్విచక్ర వాహనాలపై తరలిపోతున్న అటవీ సంపద

రైలు ఢీకొని తల్లీ కొడుకుల దుర్మరణం

నవీపేట, జనవరి 8: తన ప్రాణానికి ప్రమాదం అని తెలిసినా, మానసిక వికలాంగుడైన కుమారుడిని ఎలాగైనా కాపాడుకోవాలని ఓ తల్లి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పదేళ్ల కుమారుడితో పాటు ఆ తల్లి కూడా రైలు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ ప్రణయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఫకీరాబాద్ గ్రామానికి చెందిన వడ్డె గంగామణి (50), మానసిక వికలాంగుడైన ఆమె కుమారుడు గంగాప్రసాద్ (10)లు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రామ సమీపంలోని రైల్వే గేటు ప్రాంతం వద్దకు వచ్చారు. మహారాష్ట్ర నుండి సికిందరాబాద్‌కు వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండడంతో గేటు వేశారు. దీంతో గంగామణి, ఆమె కుమారుడు అక్కడే కొద్దిసేపు ఆగారు. అంతలోనే మానసిక వికలాంగుడైన గంగాప్రసాద్ గేటు కింద నుండి దూరి పట్టాల పైకి వెళ్లగా, అదే సమయంలో రైలు చేరువగా వచ్చేసింది. ప్రమాదాన్ని గమనించిన గంగామణి తన కుమారుడిని వెనక్కి లాగేందుకు ఆమె కూడా పరుగుపరుగున పట్టాల వద్దకు వెళ్లగా, వీరిరువురిని అతివేగంగా దూసుకొచ్చిన దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగామణి శరీర భాగం రెండుగా విడిపోగా, గంగాప్రసాద్ పేగులు బయటకు వచ్చి సంఘటనా స్థలం భీతావహ దృశ్యంగా మారింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రైల్వే ఎస్ఐ ప్రణయ్‌కుమార్ తెలిపారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
బుధవారం, 9 జనవరి 2019

చారిత్రక న్యాయం..

మానవత్వం కంటె రాజకీయం అధికతర ప్రాధాన్యం సంతరించుకొనడం నడచిపోతున్న ప్రజాస్వామ్య వైపరీత్యం. కేంద్ర ప్రభుత్వం 2016లో రూపొందించిన 'పౌరసత్వ సవరణ విధేయక'- సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్-ను కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండడం ఇందుకు సరికొత్త సాక్ష్యం. ప్రతిపక్షాలు మాత్రమే కాదు, అధికార భారతీయ జనతాపార్టీకి మిత్రపక్షాలుగా కొనసాగుతున్న శివసేన, ఐక్య జనతాదళ్ వంటి రాజకీయ సంస్థలు సైతం ఈ 'విధేయక'ను వ్యతిరేకించడం విచిత్రమైన వ్యవహారం. ఈ 'బిల్లు'వల్ల అస్సాంలోని స్థానిక ప్రజలకు కలుగబోని నష్టం ''కలుగనున్నట్టు'' ప్రచారం చేస్తున్న 'అస్సాం గణపరిషత్'- అగప- భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని ''జాతీయ ప్రజాస్వామ్య సంఘటన''- నేషనల్ డెమొక్రాటిక్ అలియన్స్- ఎన్‌డిఏ-నుంచి వైదొలగిపోవడం మరో విపరిణామం. అఫ్ఘానిస్థాన్ నుంచి పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ నుంచి తరిమివేతకు గురి అయిన అల్పసంఖ్య మతస్థులకు మన దేశపు పౌరసత్వాన్ని కల్పించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ సవరణను ప్రతిపాదించింది. ఈ మూడు దేశాలలోను ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. అందువల్ల ఈ దేశాలలో ఇస్లామేతర మతస్థులు అల్పసంఖ్యాకులు. ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యలో ఉన్న దేశాలలో అత్యధిక శాతం 'ఇస్లాం మత రాజ్యాంగ' వ్యవస్థలు ఏర్పడి ఉన్నాయి. ఇలా 'ఏకమత రాజ్యాంగ వ్యవస్థ' ఏర్పడడం సర్వమత సమభావ- సెక్యులర్- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అయినప్పటికీ 'ఇస్లాం మత రాజ్యాంగ వ్యవస్థ'లు అనేక దేశాలలో ఏర్పడి ఉండడం వర్తమాన వాస్తవం! ఇలాంటి దేశాలన్నింటిలోను 'జిహాదీ'లు ప్రబలి ఇస్లామేతర మతస్థులను నిర్మూలించడానికి యత్నిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోను, అఫ్ఘానిస్థాన్‌లోను, పాకిస్తాన్‌లోను ఇలా అల్పసంఖ్య మతస్థులను నిర్మూలించే కార్యక్రమం దశాబ్దుల తరబడి కొనసాగుతోంది. అందువల్ల ఈ దేశాలలోని అనాది మతాలవారు- హిందువులు- ఈ దేశాల నుంచి మన దేశానికి తరలి రావలసిన దుస్థితి ఏర్పడి ఉంది. విదేశాల నుంచి వ్యాపించిన యూదు, పారశీక, క్రైస్తవ మతాలకు చెందిన వారిపై కూడ ఈ దేశాలలో దాడులు జరుగుతున్నాయి. అందువల్ల ఈ మతాలవారు కూడ అఫ్ఘానిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి పారిపోతున్నారు. వీరిలో అత్యధికులు మన దేశానికి వచ్చి స్థిరపడి ఉన్నారు. ఇలా ఈ మూడు దేశాల నుంచి నిర్వాసితులైన, బలవంతంగా గెంటివేతకు గురి అయిన ఈ 'అల్పసంఖ్య మతాల'వారికి మన దేశంలో ఆశ్రయం కల్పించడం, పౌరసత్వం కల్పించడం ప్రభుత్వం నిర్వహించవలసిన మానవీయ విధి. ఈ విధిని కేంద్ర ప్రభుత్వం నిర్వర్తిస్తోంది! అందువల్ల రాజకీయ సంకుచిత ప్రయోజన ప్రాతిపదికగా ఈ 'బిల్లు'ను వ్యతిరేకించడం అమానవీయ చర్య!

పాకిస్తాన్ నుంచి 2011 నుంచి దాదాపు ముప్పయివేల మంది అనాది మతాలకు- వేద మతాలకు- చెందిన హిందువులు మన దేశానికి వచ్చేశారు. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా దాడులు పెరగడం వల్ల పాకిస్తాన్‌లోకి చొరబడిన 'తాలిబన్' 'అల్‌ఖాయిదా' జిహాదీలు హిందువులపై దాడులు చేస్తున్నారు. వాస్తవానికి పాకిస్తాన్‌లో క్రీస్తుశకం 1947 ఆగస్టు నుంచి కూడ 'జిహాదీ'లు హిందువులను నిర్మూలించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు- ఫలితంగా 1947లో మొత్తం పాకిస్తాన్ జనాభాలో ఇరవై నాలుగు శాతం ఉండిన హిందువుల సంఖ్య ఈ శతాబ్ది ఆరంభంనాటికి ఒకటిన్నర శాతానికి పడిపోయింది. ఈ అవశేష హిందువులను సైతం నిశ్శేషం చేయడానికి పాకిస్తానీ, అఫ్ఘానీ 'జిహాదీ'లు కలసికట్టుగా బీభత్సకాండను కొనసాగిస్తున్నారు. అందువల్ల పాకిస్తాన్ నుంచి మన దేశంలోని 'అవశేష హిందువుల' వెల్లువ కొనసాగుతూనే ఉంది. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ జిల్లాలో 1947లో హిందూ వనవాసీ ప్రజల సంఖ్య తొంబయి శాతం. కానీ జిహాదీల దాడుల ఫలితంగా ఈ 'చక్మా'ల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. రెండు లక్షల మందికి పైగా 'చక్మా'లు ఈశాన్య ప్రాంతంలోకి వచ్చేశారు. వీరిలో నలబయి ఏడు వేల మంది భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తులు పెట్టి ఉన్నారు. వీరందరికీ భారతీయ పౌరసత్వం లభించినప్పటికీ అందరూ అస్సాంలో స్థిరపడబోరు, ఈశాన్యంలో స్థిరపడబోరు, దేశమంతటా వీరు విస్తరిస్తారు. దాదాపు రెండుకోట్ల మంది అక్రమ ప్రవేశకులు దేశమంతటా ఉన్నారు. అస్సాంలోనే నలబయి లక్షల మంది బంగ్లాదేశీయ అక్రమ ప్రవేశకులు తిష్టవేసి ఉన్నట్టు గత ఏడాది వెలువడిన 'జాతీయ పౌర సూచిక'- నేషనల్ రిజిష్టర్ ఫర్ సిటిజెన్స్- ఎన్‌ఆర్‌సి- ద్వారా ధ్రువపడింది.

అక్రమ ప్రవేశకులను దేశం నుండి వెళ్లగొట్టడానికి ప్రభుత్వం ప్రారంభించిన చర్యలను వ్యతిరేకిస్తున్న కొన్ని ప్రతిపక్షాల వారు శరణార్థులైె మూడు దేశాల నుంచి మన దేశానికి వచ్చిన సక్రమ ప్రవేశకులకు పౌరసత్వాన్ని కల్పించడాన్ని కూడ వ్యతిరేకిస్తున్నారు. అక్రమ ప్రవేశకులను వెళ్లగొట్టడం వల్ల అంతరంగిక భద్రత పెరుగుతుంది. సక్రమ ప్రవేశకులకు ఆశ్రయం ఇవ్వడంవల్ల, వారికి పౌరసత్వం కల్పించడం వల్ల అఖండ భారత విభజన వల్ల వారికి జరిగిన అన్యాయానికి విరుగుడు లభించినట్టు కాగలదు. అందువల్ల మంగళవారం లోక్‌సభ ఈ 'పౌరసత్వ సవరణ' బిల్లును ఆమోదించడం 1947 నాటి దేశ విభజన బాధితులకు జరిగిన చారిత్రక న్యాయం. క్రీస్తుశకం 712నుంచి అఖండ భారత్ పై జరిగిన 'జిహాదీ'ల దాడులు శతాబ్దుల పాటు కొనసాగిన కారణంగా అఫ్ఘానిస్థాన్ అఖండ భారత్ నుంచి విడిపోయింది. 712నాటికి 'గాంధార', 'యోన', 'ఉత్తర జ్యోతిష', 'రామఠ,' 'హార'వంటి రాజ్యాలతో కూడి ఉండిన నేటి అఫ్ఘాన్ ప్రాంతం ఆనాటికి భారత్‌లో భాగం. 712నుంచి జిహాదీలు దాడిచేసి భారతీయ మతాల వారిని ఇస్లాంలోకి బలవంతంగా మార్చడం వల్ల అఫ్ఘానిస్థాన్ భారత్ నుంచి విడిపోయింది. బ్రిటన్ దురాక్రమణదారులు ఈ విభజనను శాశ్వతం చేశారు. నేటి పాకిస్తాన్ ప్రాంతంలోను, బంగ్లాదేశ్ ప్రాంతంలోను కూడ 712నాటి మొత్తం జనాభా అనాది హైందవ మతాలకు చెందినవారే! ఇస్లామేతర మతాలను నిర్మూలించి ప్రపంచమంతటా 'ఇస్లాం'ను ఏకైక మతంగా ప్రతిష్ఠించాలన్న లక్ష్యంతో జిహాదీలు జరిపిన బీభత్సకాండ ఫలితంగానే నేటి పాకిస్తాన్ ప్రాంతంలోను బంగ్లాదేశ్ ప్రాంతంలోను అనాది మతాలకు చెందిన స్వజాతీయ హిందువులు 1947 నాటికి అల్పసంఖ్యాకులుగా మారారు, ఇస్లాం జనబాహుళ్యం ఏర్పడింది. ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలను అఖండ భారత్ నుంచి విడగొట్టి 1947లో పాకిస్తాన్‌గా ఏర్పాటు చేయడం 'సర్వమత సమభావ వ్యవస్థ'-సెక్యులర్ ఆర్డర్-కు జరిగిన చారిత్రక విద్రోహం! అనాదిగా సర్వమత సమభావ వ్యవస్థ కొనసాగిన భారత ప్రాంతాలలో, ఆ ప్రాంతాలు పాకిస్తాన్‌గా ఏర్పడిన తరువాత 'సర్వమత సమభావం' హత్యకు గురి అయింది, ఏకమత రాజ్యాంగ వ్యవస్థ ఏర్పడింది!

ఇలా ఈ మూడు దేశాల నుంచి హిందువులు శరణార్థులై మన దేశంలోకి- అవశేష భారత్‌లోకి- తరలిరావడం అఖండ భారత విభజనతో ముడివడి ఉన్న చారిత్రక వైపరీత్యం. అఖండ భారత్ విభజన జరుగకపోయి ఉండినట్టయితే, దేశం 1947 నాటికి పూర్వం వలెనే కొనసాగి ఉండినట్టయితే ఇప్పటి పాకిస్తాన్‌లోను బంగ్లాదేశ్‌లోను కూడ 'సర్వమత సమభావ' వ్యవస్థ యథాపూర్వం వలె ఏర్పడి ఉండేది. అన్ని మతాలవారు సమానంగా హాయిగా జీవించి ఉండేవారు! దేశ విభజన జరిగినందువల్లనే అప్పటినుంచీ ఇప్పటివరకూ పాకిస్తాన్ నుంచి, బంగ్లాదేశ్ నుంచి అల్పసంఖ్యాకులైన హిందువులు శరణార్థులై మన దేశానికి వస్తున్నారు. మన దేశంలో అనాదిగా నెలకొన్న సర్వమత సమభావ వ్యవస్థ 1947 తరువాత కూడ కొనసాగుతోంది! అందువల్ల ఇక్కడ అన్ని మతాలవారు సమానంగా జీవించగలుగుతున్నారు.. ఏ మతం వారు కూడ వేధింపులకు గురై దేశం నుండి పారిపోవడం లేదు!! 'బిల్లు'ను వ్యతిరేకించినవారు గ్రహించవలసిన భారత జాతీయ జీవన వాస్తవం ఇది...

విలక్షణ తీర్పులు.. విస్తృత చర్చలు..

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వానికి ఇరకాటం కలిగించే అంశమే. అలోక్ వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. గత ఏడాది కాలంలో సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పులు దేశవ్యాప్తంగా సంచలనాలను రేకెత్తించడమేగాక, వివిధ వేదికలపై చర్చనీయాంశాలుగా మారాయి. చివరికి సీబీఐ డైరెక్టర్ తొలగింపు అంశంపై తీర్పు కూడా మరింత కాక రేపింది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని అనుమతించడం , ఆధార్ చట్టంలో సెక్షన్ -57ను తొలగించడం, సెక్షన్ -377 సెక్షన్‌ను తొలగించి 'ఎల్‌జీబీటీక్యూ'ల హక్కులను కాపాడటం , సెక్షన్ 497ను కొట్టివేసి సహజీవనం నేరం కాదని తేల్చి చెప్పడం, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను కొనసాగించడం సరికాదని పేర్కొనడం, రామజన్మ భూమి కేసులో పిటిషన్లను కొట్టివేయడం, భీమా కోరెగాన్ కేసులో అరెస్టులపై 'స్టే' ఉత్తర్వులు జారీ చేసి పౌర హక్కుల నేతలకు రక్షణగా నిలవడం, రాజకీయ నాయకుల నేరచరిత్రపై కఠినంగా వ్యవహరించాలని సూచించడం, త్రిపుల్ తలాక్, హదియా- సఫియన్ జోహాన్‌ల వివాహాన్ని చట్టబద్ధం చేయడం, వ్యక్తిగత గోప్యతను హక్కుగా నిర్ధారించడం వంటి తీర్పులు దేశంలో కొత్త చరిత్రకు నాందీ ప్రస్తావన చేశాయనే చెప్పాలి.

సుప్రీం తీర్పులపై చర్చ ఆగిపోలేదు, మరికొంత కాలం గడిచిన తర్వాత అవి మరింత చర్చనీయాంశాలే అవుతాయనడం నిస్సందేహం. సరిహద్దులు లేని ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని పరిమితమైన రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి సర్వోన్నత న్యాయస్థానం ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే తీర్పులు ఇస్తున్నాయనేది నిపుణుల వాదన. సమాజం గతిశీలకంగా వేగంగా ముందుకు సాగుతున్నపుడు సంస్కృతి కట్టుబాట్ల పరిధిలోనే సుప్రీం కోర్టు ఆధునిక సమాజంవైపు అడుగులు వేసేందుకు మార్గాన్ని సుగమం చేస్తోందన్నది సుస్పష్టం. ఒక వ్యక్తికి నచ్చనంత మాత్రాన సర్వోన్నత న్యాయస్థానం తీర్పులను తప్పుపట్టలేం. తాజాగా సీబీఐపై వచ్చిన తీర్పును మాత్రం జాతి స్వాగతిస్తోంది. ఒక తీర్పును కాదని, మరో తీర్పును స్వాగతించే మనస్తత్వం ప్రజలకు ఉన్నా, సుప్రీం కోర్టు మాత్రం ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా తన పని తాను చేసుకుంటూ పోతోంది.

కేంద్రానికి చుక్కెదురు...

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మకు అధికారాలు లేకుండా చేసి, ఆయనను సెలవుపై కేంద్రం సాగనంపడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఆయనను అలా సెలవుపై పంపడం కుదరదని, వెంటనే ఆయనకు బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై ప్రధాని అధ్యక్షతన ఉన్న అత్యున్నత ఎంపిక కమిటీ వారంలో నిర్ణయం తీసుకోవాలని కూడా పేర్కొంది. ఈ సమయంలో అలోక్ వర్మ విధానపరమైన ప్రధాన నిర్ణయాలు తీసుకోవద్దని కూడా సూచించింది. అలాగే, సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని కూడా సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. కేంద్ర ప్రభుత్వం తనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని సవాలు చేస్తూ అలోక్ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు తీర్పు వెలువరించింది. సీబీఐ కేసులో కేంద్రం వ్యవహరించిన తీరును సుప్రీం కోర్టు తూర్పారపట్టింది. ఈ వ్యవహారంలో సీవీసీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. అలోక్‌వర్మపై చర్యలు తీసుకోవడానికి ముందు కేంద్రం సెలక్ట్ కమిటీని సంప్రదించి ఉండాల్సిందనే భావనను న్యాయమూర్తులు వ్యక్తం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ సెలవులో ఉండటంతో తీర్పును మరో న్యాయమూర్తి జస్టిస్ కౌల్ చదివి వినిపించారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ పదవీకాలం ఈనెల 31తో ముగుస్తుంది. ఆ తర్వాత ఎలాగూ కొత్త డైరెక్టర్‌ను నియమించాల్సిందే. కానీ, చట్ట ప్రకారమేనంటూ ప్రభుత్వం వ్యవహరించిన తీరును సాంకేతికంగా సుప్రీం తప్పుపట్టింది.



'నిర్భయ' కేసుకు సంబంధించి ఇచ్చిన 430 పేజీల సుదీర్ఘ తీర్పులో- 'ఇంతటి తీవ్రమైన కేసుల్లో నిందితులను క్షమించలేమ'ని స్పష్టం చేసింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్‌లు నిందితులకు మరణశిక్షను ఖరారు చేశారు. ఇంకో తీర్పులో సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదులుగా గుర్తించేందుకు మార్గదర్శకాలను జారీ చేసింది.

భారతీయులకు బాసటగా..

భారతీయులందరికీ బాసటగా నిలిచేలా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమే అని చెప్పాలి. భారతీయుల గోప్యతను రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద కాపాడాల్సిందేనని పేర్కొంది. 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఎంపీ శర్మ -ఖరక్ సింగ్ కేసులో స్పష్టంగా తీర్పు ఇచ్చింది. వ్యక్తి స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికి భంగం కలగని రీతిలో గోప్యతను కాపాడాల్సిందేనని నిర్వచించింది. మరో సంచలన నిర్ణయంలో త్రిపుల్ తలాక్ చెల్లుబాటు కాదని, ఇందుకు సంబంధించి ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కూడా కేంద్రాన్ని ఆదేశించింది. జస్టిస్ నారీమన్, జస్టిస్ లలిత్‌లు త్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. జస్టిస్ జోసఫ్ అందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కృష్ణ కుమార్ సింగ్ వెర్సస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో శాసనసభను కాదని ఆర్డినెన్స్ జారీ చేయడం సరికాదని, ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది.

మైనర్ భార్యతో శృంగారాన్ని అత్యాచారంగానే పరిగణించాల్సిందేనని మరో సంచలన తీర్పును సుప్రీం కోర్టు ఇచ్చింది. ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న భార్యతో శృంగారం సైతం అత్యాచారంగానే పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ తీర్పును వ్యక్తిగత స్వేచ్ఛ ఉల్లంఘనగా హక్కుల సంఘాల నాయకులు పరిగణించినా, వాస్తవానికి ఇది బాల్య వివాహాలను అడ్డుకునేందుకు బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. సెక్షన్ 198(6) ఐపీసీలో నిబంధనలను ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రస్తావించింది. మైనర్ అంటే 15 ఏళ్లలోపు బాలికలు కాదని, 18 లోపువారంతా మైనర్లేనని ఈ తరహా కేసులకు ఇదే వర్తిస్తుందని కూడా కోర్టు స్పష్టం చేసింది. కులం, మతం ప్రాతిపదికగా ఓట్లు కోరడం, తదనుగుణంగా భేటీలు, సమావేశాలు ఏర్పాటు చేయడం నేరం కింద పరిగణించాలని ఆనాటి న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(3)ను ప్రస్తావించిన రాజ్యాంగ ధర్మాసనం ఇలాంటి నేతలపై కేసులు పెట్టాల్సిందేనని సూచించింది.

'నిర్భయ' కేసుకు సంబంధించి ఇచ్చిన 430 పేజీల సుదీర్ఘ తీర్పులో- 'ఇంతటి తీవ్రమైన కేసుల్లో నిందితులను క్షమించలేమ'ని స్పష్టం చేసింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్‌లు నిందితులకు మరణశిక్షను ఖరారు చేశారు. ఇంకో తీర్పులో సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదులుగా గుర్తించేందుకు మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో సుప్రీం కోర్టు న్యాయవాదులకు సంబంధించి పెను వివాదం పరిష్కారమైంది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి కూడా సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ఇచ్చింది. జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మార్గదర్శకాలను ఇచ్చింది.


సెక్షన్ -498 ఏను దుర్వినియోగం చేయడాన్ని కూడా సుప్రీం కోర్టు సహించలేదు. పొరుగువారికి ఇబ్బంది లేనంత కాలం సహజీవనం తప్పుకాదని తేల్చి చెప్పింది. అన్నింటికీ 'ఆధార్'ను కోరడం సరికాదని, 'ఆధార్'ను దుర్వినియోగం చేసే వారిపై కఠినమైన జరిమానా విధించాలని కూడా కేంద్రానికి సూచించింది. కొన్ని సంక్షేమ కార్యక్రమాలకు మినహా మిగిలిన వాటికి ఆధార్‌ను నిర్బంధం చేయవద్దని పేర్కొంది. అయితే అంతకు ముందు ఆదాయపు పన్ను శాఖకు సంబంధించి సెక్షన్ 139ఏఏ అమలులో మాత్రం 'ఆధార్'ను కోరడం తప్పులేదని కోర్టు సూచించింది. ఐటీ రిటర్నులను ఆధార్‌తో అనుసంధానం చేయడం తప్పేమీ కాదని జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అంధులకు- వారి కదలికలకు అనుగుణంగా బహిరంగ ప్రదేశాల్లో అనువైన వాతావరణాన్ని కల్పించాలని మరో పిటిషన్‌లో సూచించింది. బెయిల్ పిటిషన్లను తొందరగా పరిష్కరించడం ద్వారా వ్యక్తుల స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని, చెక్ బౌన్స్ కేసుల్లో బాధితులకు సరిపడా చెల్లింపులు జరిగినపుడు ఆ కేసులను మూసివేయాలని కూడా పేర్కొంది. మహిళలకు తమ ప్రేమకు, తిరస్కారానికి ఉన్న స్వేచ్ఛను ఎవరూ ప్రశ్నించజాలరని జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ ఎం ఖాన్ విల్కర్, జస్టిస్ ఎం మోహన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఇంకో కేసులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్ విల్కర్, డాక్టర్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్వేచ్ఛగా వ్యక్తం చేసే అభిప్రాయాలను చట్టం పేరుతో అడ్డుకోవడం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని పేర్కొంది. 'సామాజిక స్మగ్లర్లు కోమటోల్లు' పేరుతో ప్రొఫెసర్ కంచె ఐలయ్య రాసిన పుస్తకాన్ని నిషేధించాలన్న పిటీషన్‌ను తిరస్కరిస్తూ డివిజన్ బెంచ్ ఈ తీర్పును ఇచ్చింది. వీటిన్నింటి నేపథ్యం వ్యక్తి స్వేచ్ఛను కాపాడటం, మరింత విశాల దృక్పథాన్ని అలవరచుకోవడం తమ మార్గంగా సుప్రీం కోర్టు చెప్పకనే చెప్పింది.

-బీవీ ప్రసాద్ 98499 98090

'చుక్కల' చిక్కులకు పరిష్కారం..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రాష్ట్రంలో 'చుక్కల భూముల' సమస్య ఇకపై పరిష్కారం కానుంది. దాదాపు 64 సంవత్సరాల నుంచి రైతులు, వారి కుటుంబాలు తమ భూములకు సంబంధించి ఈ 'చుక్కల' చిక్కులతో అల్లాడుతున్నారు. వాస్తవానికి ఈ 'చుక్కల' వెనక పెద్ద కథే ఉంది. బ్రిటీష్ పాలకుల హయాంలో 1906లో దేశవ్యాప్తంగా భూములపై సర్వే జరిగింది. ఆ తర్వాత 1954లో రీ సర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ భూములపై సమగ్ర సర్వే గానీ, రీ సర్వే గానీ మళ్లీ జరగలేదు. అందువల్ల భూమి హక్కులకు సంబంధించి 1954 నాటి రెవెన్యూ రికార్డులే ఇప్పటికీ ప్రామాణికంగా ఉన్నాయి. 1954లో రీ సర్వే జరిగినప్పుడు రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్ వారీగా భూమి హక్కుదారుల పేర్లు, సర్వే నెంబర్లు, వాటి విస్తీర్ణం వంటి వివరాలను నమోదు చేశారు.

అయితే, ఎవరూ యాజమాన్య హక్కు కోరని భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో చుక్కలు (డాట్స్) పెట్టారు. అప్పటి నుంచి ఈ భూములను చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్స్)గా పిలుస్తున్నారు. 1954 తరువాత ఆ భూములను సాగుచేసుకునే వారికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. ఆ తరువాత భూముల రీ సర్వే చేయకపోవడం వల్ల ఈ సమస్య కొనసాగుతోంది. వాటిని వారసత్వంగా బదిలీ చేయడానికి గానీ, అమ్ముకోవడానికి గానీ అవకాశం లేదు. అప్పటి నుంచి రైతులను 'చుక్కల చిక్కులు' వెంటాడుతున్నాయి. ఆ తరహా భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. తాత ముత్తాతల కాలం నుంచి దశాబ్దాలుగా ఆ భూములను సాగుచేసుకుంటున్న వారికి కూడా యాజమాన్య హక్కులు లేకపోవడంతో అనేకమంది కోర్టులను ఆశ్రయించారు. ఈ కేసులను విచారించిన ధర్మాసనం- హక్కు పత్రాలున్న వారికి న్యాయం చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఈ చుక్కల భూములు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల ఎకరాలకు పైగా చుక్కల భూములు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు అంచనా. వీటిలో 17.7 లక్షల ఎకరాలను ప్రభుత్వం కొంతమందికి అసైన్ చేసింది. లక్షా 80 ఎకరాలను రైతులు సాగుచేసుకుంటున్నట్లుగా రికార్డుల వల్ల తెలుస్తోంది. ముఖ్యంగా వారు ఆ భూములపై తమకు హక్కులు కావాలని డిమాండ్ చేస్తున్నారు.



రెవెన్యూ సంస్కరణలలో భాగంగా రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని 22-ఏ1లో నిషేధిత ఆస్తుల జాబితా నుంచి చుక్కల భూములను 2017 జూలై 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం రైతుల ఆధీనంలో సాగులోఉన్న చుక్కల భూములను మాత్రం ఆ తేదీనుంచి ప్రైవేటు పట్టా భూములుగా పరిగణించవలసి ఉంది. అయితే, వివిధ కారణాల వల్ల ఆ ఆదేశాలు అమలు కాలేదు. ఈ సమస్యపై మళ్లీ వేల సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని తీవ్రంగా పరిగణించి జనవరి 4న ఈ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాల ప్రకారం నూతన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్లు పంపుతారు. ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) చట్టం ప్రకారం- 1బి రిజిస్టర్ 2వ కాలమ్‌లో నమోదైన పట్టాదారు పేరును సరిచూసుకొని తదనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్‌లో కొనుగోలు లేదా వారసత్వం లేదా వంశపారంపర్యం అని నమోదుచేసిన వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో ఏమీ రాయకపోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో 1954కు ముందు ఇచ్చిన డి-పట్టా, డికెటి పట్టా, అసైన్‌మెంట్ భూములు అని నమోదు చేసినట్లైతే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 1954 త రువాత ప్రభుత్వం ఇచ్చి న భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి.

చుక్కల భూములను స్వాధీనంలో ఉంచుకున్నవారు, వాటిని అనాదిగా సాగుచేసుకుంటున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన పత్రాలలో ఏదోఒకటి చూపిస్తే ఆ భూమి వారికి సంబంధించినదిగా భావించి రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. రిజిస్ట్రేషన్, లింకు డాక్యుమెంట్ పత్రాలు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రికార్డు ఆఫ్ హోల్డింగ్సు నమోదు చేసిన పత్రాలు, ఎన్‌క్యూంబరెన్స్ పత్రం, 10(1) అకౌంట్, భూమి శిస్తు రశీదులు, రెవెన్యూశాఖ జారీచేసిన ఆర్‌వోఆర్ రికార్డు, న్యాయస్థానాలు, సంబంధిత అధీకృత అధికారి జారీచేసిన ఉత్తర్వు ప్రతులు తదితరాలను రిజిస్టర్ కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. 2017 జూలై 14వ తేదీకి ముందు 12 ఏళ్లు ఆధీనంలో ఉన్నట్లు ఏవైనా ఆధారాలు చూపినా రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. చుక్కల భూములకు సంబంధించి రైతులు ఫిర్యాదు చేసిన, రెవెన్యూశాఖ వద్ద, తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలనలో ఉన్నవాటిని కూడా రెవెన్యూ సిబ్బంది తమంతటతాముగా పరిశీలిస్తారు. వాటికికూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి.

చుక్కల భూములపై పరిశీలన పూర్తి అయిన తరువాత తుది జాబితాని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెడతారు. ఎవరైనా అభ్యంతరాలు తెలియజేస్తే రెవెన్యూశాఖ వాటిని పరిశీలిస్తుంది. అభ్యంతరాల పరిశీలన తరువాత సవరించిన తుది జాబితాను ప్రకటిస్తారు. నిషేధిత భూముల నుంచి చుక్కల భూములతో పాటు ఇతర భూములను తొలగించి సెక్షన్ 22-ఏ1 (ఏ)టు (డి) కొత్త జాబితాని నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపుతారు. సెక్షన్ 22-ఏ1(ఇ) జాబితాలను ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం దానిని గెజిట్‌లో ప్రచురిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలు సక్రమంగా అమలు జరిగితే లక్షమందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. జనవరి 24వ తేదీ లోపల ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందువల్ల చుక్కల భూములు ఎక్కువగా ఉన్న జిల్లాలకు అదనంగా అధికారులను పంపించే అవకాశం కూడా ఉంది.

-శిరందాసు నాగార్జున
94402 22914


బాల్యాన్ని మావోలు బుగ్గిపాల్జేస్తే ఎలా?

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదానికి బాల్యం బలవుతోందని తరచూ వార్తలు వెలువడుతున్నాయి. 14-15 సంవత్సరాల పిల్లలను మతోన్మాద ఉగ్రవాదులు ఆకర్షిస్తూ వారిని పావులుగా వాడుకుంటున్నారు. భద్రతా బలగాలతో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో దారితప్పిన ఈ పిల్లలు సైతం మరణించడం పెద్ద చర్చనీయాంశమవుతోంది. ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

జెనీవా ఒప్పందం ప్రకారం 15 ఏళ్ల లోపువయసు పిల్లల్ని సాయుధ కార్యక్రమాల వైపు ఉసిగొల్పరాదు. సాయుధ ముఠాల్లో, గ్రూపుల్లో, దళాల్లో నియమించకుండా ఆ ఒప్పందం నిషేధం విధించింది. 1989 సంవత్సరంలో బాలల హక్కుల కోసం రూపొందించిన ఈ ఒప్పంద పత్రానికి ప్రపంచంలోని అన్ని దేశాలూ మద్దతు ప్రకటించాయి. జెనీవా ఒప్పంద పత్రానికి అటు కశ్మీర్ ఉగ్రవాదులు, ఇటు ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులు మాత్రం యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నారు. పసిప్రాయంలోనే పిల్లలకు ఆయుధ భాష నేర్పించి వారి జీవితాలతో ఆడుకోవడం పూర్తిగా అన్యాయం. కశ్మీర్ స్వయం నిర్ణయాధికారం పేర ఉగ్రవాదులు జరుపుతున్న పోరు, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని భారతదేశంలో విజయవంతం చేస్తామన్న పేర మావోయిస్టులు 14-15 ఏళ్ళ లోపు వయసు పిల్లల్ని పెద్దఎత్తున తమ సాయుధ దళాల్లోకి ఆకర్షిస్తున్నారు.

ఉగ్రవాదులకు ఎలాంటి నిర్దిష్టమైన సిద్ధాంతాలు లేవు, శాస్త్రీయ అవగాహన లేదు. తాము సిద్ధాంతాల ప్రాతిపదికన ప్రయాణం చేస్తున్నామని చెప్పుకునే మావోయిస్టుల చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా భిన్నమని ఎలా చెప్పగలం? ఉగ్రవాదులు అనుసరిస్తున్న వ్యూహం ఎత్తుగడలు, పద్ధతులను మావోయిస్టులు మరింత కఠినంగా అమలు జరుపుతున్న 'దృశ్యం' స్పష్టంగా నేడు కనిపిస్తున్నది. ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లోని ఆదివాసీ పిల్లల్ని పాఠశాలల నుంచి బలవంతంగా లాక్కెళ్లి ఆయుధ శిక్షణ శిబిరాల్లో మావోయిస్టులు చేర్చుతున్న సంఘటనలు కోకొల్లలు. మాయమాటలు చెప్పి ఆదివాసీల గుడిసెల నుంచి అమాయక బాలలను తరలిస్తున్న సందర్భాలు అనేకం. ఇదంతా 'నూతన సమాజం' పేర జరగడం శోచనీయం.

జెనీవా ఒప్పందం, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లాంటివి ఏమి చెబుతున్నాయో తెలిసినా ఈ రకమైన కార్యక్రమాలకు మావోయిస్టులు పాల్పడటం ఏ మేరకు ఆమోదనీయం? దేశంలో కోట్లాది మంది బాలలు మెరుగైన విద్య- విజ్ఞానంతో తమ జీవితాలను తీర్చిదిద్దుకునే క్రమంలో పసితనాన్ని ఆస్వాదిస్తూ



మావోయిస్టులు బాలల బాల్యాన్ని బుగ్గిచేస్తే ఎలా ఆహ్వానించగలం? అతి సున్నితమైన ఈ అంశాన్ని సైనిక బూటు కాళ్ల కింద తొక్కిపెట్టి ఎన్ని ఆదర్శాలు వల్లిస్తే మాత్రం ఏమిటి ప్రయోజనం? బాలలకు 'చందమామ' అంటే ఎంతో ఇష్టం. ఎంతో కుతూహలంతో తిలకిస్తారు. పలు ప్రశ్నలు ఆ బుర్రలో ఉత్పన్నమవుతూ ఉంటాయి. అలాంటి చందమామపై పరిశోధనలు జరుగుతున్న సందర్భమిది. తాజాగా చైనా చంద్రుడి ఆవలి వైపున వ్యోమనౌకను దింపి ఎవరూ నిర్వహించని పరిశోధనలు నిర్వహిస్తోంది.

అడుగులు వేస్తుంటే- అటు కశ్మీర్ ఉగ్రవాదుల, ఇటు మావోయిస్టుల చెరలోని పిల్లలు మాత్రం ఆయుధ భాష నేర్చుకుని తుపాకుల మోత మధ్య గడపడం భావ్యమా? ఉగ్రవాదుల కన్నా తాము ఎంతో ఆలోచనాపరులమని చెప్పుకునే మావోల 'చెర'లోనూ బాలలుండటం విషాదం గాక ఏమవుతుంది?

ప్రపంచంలో మార్క్సిస్టు సిద్ధాంతం సర్వోత్కృష్టమైనదని, గొప్ప మానవతా విలువలకు ప్రతీక అని, అత్యున్నత ప్రమాణాలకు అది ప్రాతిపదిక అని పదే పదే చెప్పే మావోయిస్టులు ఇలా బాలల బాల్యాన్ని బుగ్గిచేస్తే ఎలా ఆహ్వానించగలం? అతి సున్నితమైన ఈ అంశాన్ని సైనిక బూటు కాళ్ళ కింద తొక్కిపెట్టి ఎన్ని ఆదర్శాలు వల్లిస్తే మాత్రం ఏమిటి ప్రయోజనం? బాలలకు 'చందమామ' అంటే ఎంతో ఇష్టం. ఎంతో కుతూహలంతో తిలకిస్తారు. పలు ప్రశ్నలు ఆ బుర్రలో ఉత్పన్నమవుతూ ఉంటాయి. అలాంటి చందమామపై పరిశోధనలు జరుగుతున్న సందర్భమిది. తాజాగా చైనా చంద్రుడి ఆవలి వైపున వ్యోమనౌకను దింపి ఎవరూ నిర్వహించని పరిశోధనలు నిర్వహిస్తోంది. రష్యా, అమెరికా దేశాల కన్నాఒక అడుగు ముందుకేసి ఈ పరిశోధనలు కొనసాగడం విశేషం. చందమామపైకి పట్టుపురుగులను, విత్తనాలను, బంగాళా దుంపలను తీసుకెళ్ళారు. అక్కడ అవి ఎదగడం- పెరగడంపై పరిశోధనలు నిర్వహిస్తున్నారు.

ఇలాంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశోధనల- ప్రయోగాల వెనుకగల కొత్తతరం ఆలోచనలకు ఈ ఉగ్రవాదుల- మావోయిస్టుల విశ్వాసాలు, ఆలోచనలకు మధ్యగల అగాథం ఎలాంటిదో ఇట్టే ఊహించవచ్చు. వాస్తవ ప్రపంచం సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో ఎలా దూసుకుపోతున్నదో గమనిస్తూ ఆ జ్ఞానం- పరిజ్ఞానంతో బతుకుల్ని బాగుపరిచి ప్రజలకు మెరుగైన జీవితం అందించేందుకు కృషిచేయాల్సిన వారు, అందుకు తమవంతు సాయం అందించాల్సిన వారు ఇలా బాల్యాన్ని బందూకులకు బలి ఇస్తే అదెలా భావ్యమనిపించుకుంటుంది?

ఇదిలా ఉండగా ఇటీవల సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ పార్టీకి చెందిన దళ కమాండర్, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సింగర్ బోయిన వీరభద్రం అలియాస్ రామును పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. ఓ వైపు మావోయిస్టు పార్టీ, మరోవైపు జనశక్తి, న్యూ డెమొక్రసీ లాంటి ఇతర గ్రూపులు ఇలా దళాలను ఏర్పాటుచేసి చందాలు వసూలుచేస్తూ, యువతను బాలలను ఆకర్షిస్తూ అడవుల్లో తిరగడం వల్ల ఒరిగిన ప్రయోజనమేమిటి? జరుగుతున్న ఉపయోగమేమిటి?

ఇటీవల తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయాయి. మార్క్సిస్టు పార్టీ అయితే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పేర పోరులో దిగినా డిపాజిట్లు సైతం దక్కలేదు. దీంతో వామపక్ష భావజాలం పట్ల ప్రజలకు ఏమేరకు గౌరవం ఉందో అర్థమవుతోంది. వామపక్ష తీవ్రవాద పార్టీలు, గ్రూపులుగాని వామపక్ష పార్టీ (ఎన్నికల్లో పాల్గొనేవి)లు ప్రజల సంక్షేమం- అభివృద్ధి కోసం, వారికి మార్గదర్శనం చేసేందుకు పనిచేయాలి, త్యాగాలు చేయాలి తప్ప ప్రజలను గందరగోళంలో ముంచెత్తరాదు కదా? వర్తమానంలో ఈ శక్తులన్నీ చేస్తున్నదే అది. ప్రపంచం ఓ కొత్త కక్ష్యలో ప్రయాణిస్తుంటే, కొత్త మార్గం అనుసరిస్తూ దూసుకుపోతుంటే దాన్ని తిలకించకుండా ఊహాత్మక పద్ధతిలో 'సోషలిజం' పేర కాలం చెల్లిన ఆలోచనలు చేస్తే, వాటిని ఆచరణలో పెట్టేందుకు ప్రజల్ని ఉసిగొలిపితే నష్టపోతున్నది ప్రజలేనన్న ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా?

70 సంవత్సరాలకు పైగా సోషలిజం గూర్చి కలవరిస్తున్నా కాలం అందుకు అనువుగా లేదని, ఆ భావన ప్రపంచం నుంచి నిష్క్రమించిందని తెలిసినా, ఆ ఊహాత్మక భావనలకు సాంకేతిక పరిజ్ఞానం కళ్ళెం వేసిందని స్పష్టంగా అవగతమైనా ఇంకా- ఇలా బాలలను, అమాయకులను ఆ సిద్ధాంతాలకు 'బలి' ఇచ్చే కార్యక్రమాల్లో తలమునకలైపోవడం ఏ మేరకు ఆహ్వానించదగ్గ అంశమవుతుంది? అలా చేయడం 'దగా'. 'ధ్యాస' ఉండాలి కదా? జర్మనీకి చెందిన రెండు వందల ఏళ్ల క్రితపుకారల్ మార్క్స్ ఊహలకు ఇక్కడ భారతదేశంలో ఊపిరి పోస్తామని చెబుతూ, ఇలా కొత్తతరాల బాల్యాన్ని 'బలి' తీసుకుంటే ఎలా కొత్త భావాలు- ఆలోచనలు మెరుస్తాయి? అతి సాధారణమైన ఈ విషయాన్ని విస్మరించి ఎవరు బాల్యాన్ని చిదిమేసినా అది నేరమే! ప్రపంచ జ్ఞానం తమ సొంతమని భావించే మావోలు ఇలా సమాజం ముందు నేరస్తులుగా నిలవరాదు కదా? కాంబోడియాలో ఇలాంటి అపరాధం చేసినవారిప్పుడు బోనులో నిల్చున్న సంగతి తెలిసినప్పటికీ అదే పొరపాటుకు పాల్పడటమంటే వారిలో ఏమేరకు విజ్ఞత దాగ ఉందో తేటతెల్లమవుతోంది.

-వుప్పల నరసింహం 99857 81799

అలోక్‌వర్మే సీబీఐ డైరెక్టర్

❇ పునర్నియమించిన సుప్రీంకోర్టు ❇ అధికారాలకు కత్తెర ❇ సెలవుపై పంపడాన్ని తప్పుబట్టిన న్యాయస్థానం
❇ వారం రోజుల్లోగా ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ❇ అధికారాలు ఇవ్వడంపై నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 8: కేంద్రం ఆదేశంపై సెలవుపై వెళ్లిన సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవిలో మళ్లీ నియమిస్తూ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం సంచలన తీర్పు ఇచ్చింది. కాని అలోక్‌వర్మ పరిపాలనా పరంగా ఎటువంటి అధికారాలను చలాయించేందుకు వీలు లేదని షరతును విధించింది.

సీబీఐ డైరెక్టర్‌ను నియమించేందుకు చట్టబద్ధంగా ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ సమావేశమై అధికారాలను ఇవ్వడంపై నిర్ణయం తీసుకునే వరకు ఎటువంటి విధాన నిర్ణయాలను అలోక్‌వర్మ అమలు చేసేందుకు వీలు లేదని కోర్టు స్పష్టం చేసింది. అలోక్‌వర్మ రెండేళ్ల పదవీ కాలం ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఉన్నత స్థాయి కమిటీ తీర్పు వెలువడినప్పటి నుంచి వారం రోజుల లోపు సమావేశమై నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఎస్‌కేకౌల్, జస్టిస్ కేం జోసెఫ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం వెలువరించింది. తనను బలవంతంగా సెలవుపై కేంద్రం పంపడాన్ని సవాలు చేస్తూ అలోక్‌వర్మ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన తర్వాత కోర్టు పై తీర్పును వెలువరించింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ అలోక్‌వర్మపై వచ్చిన ఆరోపణలను విచారిస్తున్నందు వల్ల అధికారాలను అలోక్‌వర్మ ఇవ్వడంపై ఉన్నత స్థాయి కమిటీ తీసుకుంటుందని కోర్టు పేర్కొంది. ఈ కమిటీలో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు సభ్యులుగా ఉంటారు.



సీబీఐ డైరెక్టర్‌ను ఉన్నతస్థాయి కమిటీ నియమించినందు వల్ల కేంద్రం తనకు తానుగా సెలవుపై పంపడం, పదవి నుంచి తప్పించడం చేయడం సరికాదని, కమిటీ ద్వారానే అన్ని విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని కోర్టు తీర్పులో పేర్కొంది. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ కేసుపై కోర్టు తీర్పును సమతౌల్యంగా ఇచ్చింది. సీబీఐ డైరెక్టర్‌ను గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన రాత్రికి రాత్రి సెలవుపై కేంద్రం బలవంతంగా పంపిన విషయం విదితమే. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ, జాయింట్ డైరెక్టర్ ఆస్థానా మధ్య తలెత్తిన విబేధాల నేపథ్యంలో సీబీఐలో అనూహ్యపరిణామాలు చోటు చేసుకున్న సంగతి విదితమే. ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. కాగా ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ ఈ విషయంలో కోర్టు తీర్పును అమలు చేస్తామన్నారు. సీబీఐ సమగ్రతను కాపాడేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించినట్లుగా కోర్టు తీర్పు ఉందన్నారు. కేంద్రం న్యాయపరిధికి లోబడి నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతిపక్షనేత మల్లికార్జునఖార్గే మాట్లాడుతూ కోర్టు తీర్పు కేంద్రానికి చెంపపెట్టు అన్నారు. రాఫెల్ స్కాంలో సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తారనే భయంతో కేంద్రం అలోక్‌వర్మను బదిలీ చేసిందన్నారు.

మోదీని ఎవరూ రక్షించ లేరు: రాహుల్

న్యూఢిల్లీ: రాఫెల్ కుంభకోణం నుంచి ప్రధాని నరేంద్రమోదీని ఎవరూ కాపాడలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు.

సీబీఐ చీఫ్‌గా అలోక్‌వర్మను పునర్ నియమించమని సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాఫెల్ కుంభకోణంపై అలోక్‌వర్మ దర్యాప్తు చేపట్టనున్న నేపథ్యంలో అర్థరాత్రి ఆయనను తొలగించారని గుర్తు చేసిన రాహుల్ సుప్రీం కోర్టు తీర్పు ఆయనకు కొంతమేర న్యాయం చేసిందని అన్నారు.



ద్వైపాక్షిక చర్చల అనంతరం మంగళవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సంయుక్తంగా మీడియా ముందు మాట్లాడుతున్న భారత ప్రధాని మోదీ, నార్వే ప్రధాని ఎర్నా సోల్‌బెర్గ్

కలిసి పనిచేద్దాం

❇ ద్వైపాక్షిక వాణిజ్య బంధాల బలోపేతం
❇ నార్వే-భారత ప్రధానుల మధ్య ఒడంబడిక

న్యూఢిల్లీ, జనవరి 8: సముద్ర జలాల ద్వారా జరిగే వాణిజ్యంపై ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు, తద్వారా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు భారత్-నార్వే దేశాల మధ్య మంగళవారం ఒడంబడిక కుదిరింది. ఈ దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నార్వే ప్రధాని ఎర్నా సోల్బెర్గ్‌తో చర్చలు జరిపారు. ఈ ఇద్దరు ప్రధాన మంత్రుల మధ్య జరిగిన ప్రాతినిధ్య పరమైన మంతనాల్లో 'ద్వైపాక్షిక బంధం బలోపేతానికి కొత్త శక్తి'నిచ్చే విషయంపై ప్రధాన దృష్టి కేంద్రీకృతమైంది. అంతేకాకుండా సముద్ర జలాల ద్వారా జరిగే వాణిజ్యంపై చర్చలు జరిపేందుకు సంబంధించిన ఒప్పందాలపై ఇద్దరు ప్రధానులూ సంతకాలు చేశారు. కాగా నార్వే ప్రధాని సోల్బెర్గ్ సోమవారం ఉదయం ఇక్కడికి తన భారత పర్యటనను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్ వద్ద ఆమెకు సాదర స్వాగతం లభించింది. అనంతరం ప్రధాని మోదీతో ఆమె భేటీ అయ్యారు. 'నార్వే నుంచి అన్ని రకాల తోడ్పాటును అందుకున్నాం. అలాగే ఇరు దేశాల సంబంధాలకు సరికొత్త శక్తిని, మార్గదర్శనాన్ని ఇచ్చాం' అని చర్చల అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నార్వే ప్రధానితో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్-నార్వేల నడుమ అనేక అంశాలపై పరస్పర సహకారం ఉంది. ప్రత్యేకించి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణల విషయంలో, బహుళార్థ ఎగుమతుల నియంత్రణ, ఉగ్రవాదంపై పరస్పర సహకారం ఉందని మోదీ గుర్తు చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి ప్రస్తావిస్తూ అవి భారత అభివృద్ధి లక్ష్యాలపైనే ఆధారపడి కొనసాగుతాయని ప్రధాని తెలిపారు. ఐక్యరాజ్య సమితి నిర్ధేశించిన ప్రధానమైన 17 అంతర్జాతీయ లక్ష్యాలపై సుస్థిర అభివృద్ధి (ఎస్‌డీజీ)పై చర్చలు జరిగాయన్నారు. అందులో వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు, పరిశోధన, స్థిరమైన వినిమయం, శాంతి, న్యాయం తదితర అంశాలున్నాయని మోదీ వివరించారు. ప్రధానంగా మన దేశంలో మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో నార్వే భాగస్వామ్యం ఉందని దీన్ని మరింతగా పటిష్టవంతం చేయాలని నిర్ణయించామన్నారు. తాను 2017లో నార్వే పర్యటనకు వెళ్లినపుడు ఆ దేశ ప్రధాని తనకో ఫుట్‌బాల్ బహుమతిగా ఇచ్చిన విషయాన్ని మోదీ గుర్తు చేసుకుంటూ ఇది అంతర్జాతీయ సుస్థిర అభివృద్ధి సంకేతమని అన్నారు.

ఇది రాజ్యాంగ విరుద్ధం

కోటాపై న్యాయనిపుణులు

న్యూఢిల్లీ, జనవరి 8: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని కోర్టుల్లో గట్టిగా సవాల్ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కేటాయించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై అనేకమంది న్యాయనిపుణులు స్పందించారు. రాజ్యాంగ 124 సవరణ బిల్లుపై న్యాయవాదులు రాకేష్ ద్వివేది, రాజీవ్ ధావన్, అజిత్‌సిన్హా ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఎన్నికల గిమ్మిక్కేనని ద్వివేది పేర్కొంటే, ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని రాజీవ్ ధావన్ అన్నారు.

రాజ్యాంగంలోని 15వ అధికరణకు సవరణ చేయాల్సి ఉంటుందని సిన్హా తెలిపారు. ఈ విషయంలో ఇందిరా సాహ్నీ కేసులో ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వానికి గుదిబండగా మారుతుందని అన్నారు.

అసలీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల నిరుద్యోగ సమస్య ఎంతమేరకు తీరుతుందన్నది అనుమానమేనని ద్వివేది పేర్కొన్నారు.

ఇది ఎన్నికల సమయం కాబట్టి ప్రజలను ఆకట్టుకునేందుకే ఈ రకమైన నిర్ణయాలు తీసుకుంటారని వ్యాఖ్యానించారు.

టీడీపీతో కలిసి పోటీచేద్దాం

❇ రాహుల్‌కు పనబాక, కిల్లి విజ్ఞప్తి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని కేంద్ర మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, కిల్లి కృపారాణి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు. పనబాక లక్ష్మి, కిల్లి కృపారాణి మంగళవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్ గాంధీని కలిసి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి వివరించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకోసం తెలుగు దేశం పార్టీతో పొత్తు పెట్టుకోవటం వలన కాంగ్రెస్‌కు కలిసి వస్తుందని ఇరువురు నాయకులు అభిప్రాయపడినట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది.. కార్యకర్తలు కూడా పార్టీ వైపు వస్తున్నారు.. ఈ నేపథ్యంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవటం ఎంతో అవసరమని వారు అభిప్రాయపడినట్లు తెలిసింది.

నవతరం అంబేద్కర్!

❇ మోదీని పొగడ్తలతో ముంచెత్తిన ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్



డెహ్రాడూన్, జనవరి 8: అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్, మోదీని ఏకంగా 'నవతరం అంబేద్కర్'తో పోల్చారు. ఈ నిర్ణయం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదాన్ని సాకారం చేస్తుందని అన్నారు. దేశంలో అన్ని వర్గాల పేదల అభ్యున్నతికోసం ప్రధాని మోదీ ఆలోచిస్తున్నారని, ఆయన '21వ శతాబ్దపు అంబేద్కర్' అంటూ కొనియాడారు. అగ్రవర్ణాల్లోని పేదలకూ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఎంతో కాలంగా ఉన్నదని, ఇప్పుడు అది సాకారం అవుతోందని అన్నారు. ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్లు కొనసాగుతుండగా, ఈ నిర్ణయంతో అది 60 శాతానికి చేరుకుంటున్న విషయం తెలిసిందే.

ప్రైవేట్ రేడియో చానల్స్‌లో ఆకాశవాణి

❇ హిందీ, ఇంగ్లీషు వార్తల ప్రసారం
❇ అనుమతి ఇచ్చిన కేంద్రం
❇ మే 31వ తేదీ వరకు ఉచితంగా, ప్రయోగాత్మకంగా సేవలు

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రైవేట్ ఎఫ్‌ఎం రేడియో చానల్స్ ఆకాశవాణి ఇంగ్లీషు, హిందీ వార్తలను ప్రసారం చేసేందుకు అనుమతిస్తూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ కార్యక్రమాన్ని కేంద్రం మంగళవారం ప్రారంభించింది. ఈ ఏడాది మే 31వ తేదీ వరకు ఆకాశవాణి హిందీ, ఇంగ్లీషు వార్తలు ఎఫ్‌ఎంల ద్వారా ప్రసారమవుతాయి. కాని ఈ వార్తలను ఎడిట్ లేదా మార్పు చేసేందుకు వీలులేదు. ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, సరిహద్దుల ప్రాంతాల్లో ఈ వార్తలను ఎఫ్‌ఎం రేడియోలు ప్రసారం చేయకపోయినా ఫర్వాలేదు. ఈ వివరాలను కేంద్ర మంత్రి రాజ్‌వర్ధన్ సింగ్ రాథోర్ చెప్పారు. ఈ విధానం ప్రజాస్వామ్యం పటిష్టం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ ప్రజలకు వార్తలు చేరవేయడమే లక్ష్యమని, ఆదాయం కాదని ఆయన చెప్పారు. ఉచితంగానే ఎఫ్‌ఎం రేడియోగాలకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. కాగా ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రసారభారతి చైర్మన్ ఏ సూర్యప్రకాశ్, అసోసియేషన్ ఆఫ్ రేడియో ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు అనురాధ ప్రసాద్ స్వాగతించారు.



రాజ్యసభలో మంగళవారం విపక్ష సభ్యులు ఆందోళనకు దిగిన దృశ్యం

ఎస్పీ సభ్యుల ఆందోళన

❇ రాజ్యసభ నేటికి వాయిదా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య మంగళవారం కూడా రాజ్యసభ ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా పడింది. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను ఇసుక అక్రమాల్లో సీబీఐ ప్రశ్నిస్తుందన్న వార్తలతో ఇదే అంశంపై వరుసగా రెండో రోజు కూడా రాజ్యసభ కొనసాగలేదు. కేంద్ర ప్రభుత్వం సీబీఐని దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ రాజ్యసభలో సమాజ్‌వాది (ఎస్పీ) సభ్యులు ఆందోళనలు చేయడంతో సభ స్తంభించిపోయింది. ఉదయం సభ ప్రారంభం కాగానే చైర్మన్ వెంకయ్య నాయుడు వివిధ మంత్రిత్వ శాఖలు, కమిటీలకు చెందిన పత్రాలను సభకు సమర్పింపజేశారు. తరువాత ఎస్పీ సభ్యులు తమ స్థానాల్లో నిలబడి నిరసన వ్యక్తం చేయడంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత ఎస్పీ, బీఎస్పీ, తృణమూల్, తెలుగుదేశం, ఆర్జేడీ, కాంగ్రెస్ సభ్యులు వివిధ అంశాలపై పోడియం వద్దకు వచ్చి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లును కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రవేశపెట్టారు. కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్సులను చట్టం చేసేందుకు విపక్ష సభ్యులు సహరించాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. విపక్ష సభ్యులు ఈ విజ్ఞప్తి పట్టించుకోకుండా కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగించారు. ఈ నిరసనల మధ్య సభను బుధవారానికి వాయిదా వేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మంగళవారంతో ముగియాల్సివుండగా, కేంద్రం బుధవారం వరకు పొగించింది.

ఏపీకి న్యాయం చేయండి

కొనసాగిన టీడీపీ ఎంపీల నిరసన

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్లమెంటరీ సభ్యులు చేస్తున్న ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. లోక్‌సభ నుంచి సస్పెండైన తెలుగుదేశం సభ్యులు, ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబట్టి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. చిత్తూరు లోక్‌సభ సభ్యుడు శివప్రసాద్ మంగళవారం చాణిక్యుడి వేషధారణలో నిరసన తెలియజేశారు.

హలో మోదీజీ.. హౌ ఆర్ యూ?

❇ భారత ప్రధానితో టెలిఫోన్‌లో సంభాషించిన డొనాల్డ్ ట్రంప్
❇ వాణిజ్య, రక్షణ తదితర అంశాల ప్రస్తావన



న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 8: భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం సాయంత్రం టెలిఫోన్‌లో సంభాషించుకున్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, రక్షణ అంశా లు, ఉగ్రవాద నిర్మూలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించుకున్నా రు. తొలుత నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్న ఇద్దరూ భారత్-అమెరికా మధ్య గత ఏడాది వ్యూహాత్మక భాగస్వామ్యం మెరుగుపడటం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. భారత్‌తో యూఎస్ వాణిజ్యలోటును పూడ్చడానికి 2019లో వ్యూహాత్మక భాగస్వామన్ని మరింత పటిష్టం చేసుకోవాలని ఇరుదేశాలు అంగీకరించాయి. ప్రస్తుతం భారత్‌తో గూడ్స్, సర్వీస్ వాణిజ్యం 2017లో 126.2 బిలియన్ల డాలర్లుగా నమోదైంది. వీటిలో ఎగుమతులు 49.4 బిలియన్లు కాగా, దిగుమతులు 76.7 బిలియన్ డాలర్లు. భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు 2017లో 27.3 బిలియన్ డాలర్లు. ఈ నేపథ్యంలో 2019లో ఇరుదేశాల మధ్య వాణిజ్య వ్యవహారాలు మరింత పటిష్టం కావాలని ఇరుదేశాల నేతలు ఆకాంక్షించారు. అలాగే ఇండో పసిఫిక్ ప్రాంతంలో రక్షణ చర్యలను మరింత విస్తృతం చేయాలని, అఫ్గానిస్థాన్‌తో సహకారం పెంచుకోవాలని ఇరుదేశాల నేతలు నిర్ణయానికి వచ్చినట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. అలాగే గత ఏడాది భారత్‌లో జరిగిన 2 ప్లస్ 2 శిఖరాగ్ర చర్చలతో జపాన్ సహా, భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టానికి దోహదం చేశాయని ఇద్దరూ సంతృప్తిని వ్యక్తం చేసినట్టు భారత ప్రధాని కార్యాలయం వెల్లడించింది. అలాగే భారత్-అమెరికా దేశాల మధ్య రక్షణ, ఉగ్రవాద నిర్మూలన, ఎనర్జీ తదితర అంశాలతో పాటు పలు సమస్యలు ప్రస్తావనకు వచ్చాయని తెలిపింది. అర్జెంటీనాలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన జి-20 శిఖరాగ్ర సమావేశం అనంతరం మోదీ, ట్రంప్ కలుసుకున్న తర్వాత ఇరువురు నేతలు ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. కాగా, ప్రధాని మోదీ ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై సోమవారం రష్యా ప్రధాని పుతిన్‌తో సైతం టెలిఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇరుదేశాలు పరస్పరం సహకరించుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నట్టు ప్రధాని కార్యాలయం అధికారులు తెలిపారు.

కుంభమేళాకు చురుగ్గా ఏర్పాట్లు

❇ 16న ప్రధాని నరేంద్రమోదీ రాక

లక్నో, జనవరి 8: ప్రయాగరాజ్ (అలహాబాద్)లో గంగానది తీరంలో ఈ నెలలో జరగనున్న కుంభమేళాకు హాజరయ్యే లక్షలాది మంది ప్రజలకు భద్రత కల్పించడం, నియంత్రించడంలో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 15వతేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు కుంభ మేళా జరుగుతుంది. తొలిసారిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అమలు చేస్తున్నట్లు యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అవనీష్ అవస్థీ తెలిపారు. దాదాపు వెయ్యి సీసీటీవీ కెమెరాలను అమర్చుతున్నరు. సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్ పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. లక్షలాది మంది ప్రజలు తరలివస్తున్న నేపథ్యంలో అనుమానంగా సంచరించే వారిని, నిందితులను సులువుగా పట్టుకోవచ్చు కంప్యూటర్, కంప్యూటర్ నియంత్రణ రోబో, సాఫ్ట్‌వేర్ ఇంటెలిజెంట్లీ అనుసంధానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16వ తేదీన ప్రయాగరాజ్‌ను సందర్శిస్తారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, అధికారులు, పారామిలిటరీ బలగాలు, పోలీసుల మధ్య సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గంగా, యమునా, సరస్వతి సంగమం ప్రయాగరాజ్‌లో కుంభమేళాకు భారీ సంఖ్యలో ప్రజలు 48 రోజుల పాటు తరలివచ్చి పవిత్ర స్నానం ఆచరిస్తారు. జనవరి 15, 21, ఫిబ్రవరి 4, 10, 19, మార్చి 5వ తేదీన పవిత్ర స్నానాలు ఆచరించేందుకు పర్వదినాలుగా ప్రకటించారు. దాదాపు 40వేల లెడ్ లైట్స్‌తో కుంభమేళా ప్రాంతాన్ని విద్యుద్దీకరణ చేస్తారు.

మోదీ పదవి నుంచి తప్పుకోవాలి

❇ సీపీఐ (ఎం) డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 8: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను కేంద్ర ప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపడం కుదరదని, ఆయనను వెంటనే తిరిగి ఆ పదవిలో నియమించాలని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు చెప్పిన నేపథ్యంలో ప్రధాని మోదీ దానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకోవాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. తాము చేసిన అవినీతి, బంధుప్రీతి, అక్రమాలు ఎక్కడ బయటపడతాయో అన్న భయంతోనే మోదీ భారత చరిత్రలో ఏ ప్రధానీ చేయని విధంగా స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలను నాశనం చేయడానికి ప్రయత్నించారని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. అలోక్‌వర్మను తిరిగి నియమించాలని సుప్రీం ఆదేశాలు జారీ చేసిందంటే అది ప్రధాని మోదీ, అతని కార్యాలయాన్ని నేరుగా తప్పుబట్టినట్టేనని ఆయన పేర్కొన్నారు. తన అక్రమ చర్యలకు బాధ్యత వహిస్తూ ఆయన పదవి నుంచి తప్పుకుంటారా అని ఏచూరి ప్రశ్నించారు. అతనికి ఏమాత్రం నైతికత ఉన్నా వెంటనే పదవి నుంచి వైదొలగాలన్నారు.

1977 ఫలితాలు పునరావృతం

❇ రానున్న సార్వత్రిక ఎన్నికలపై చరిత్రాకారుడు జ్ఞాన్ ప్రకాశ్
❇ ఎమర్జన్సీ లేకపోయినా సర్వాధికారాలను చెలాయిస్తున్న మోదీ
❇ ఇందిరకు, మోదీకి తేడాలేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 8: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 1977 నాటి రాజకీయ చిత్ర పటం దేశంలో ఆవిష్కృతమయ్యే అవకాశాలుకనపడుతున్నాయని చరిత్రా కారుడు జ్ఞాన్ ప్రకాశ్ చెప్పారు. 1977 ఎన్నికల్లో ప్రతిపక్షాలు సంఘటితంగా ఒకవేదికపైకి వచ్చి పోరాడడం వల్ల కాంగ్రెస్ పార్టీ 1977 ఎన్నికల్లో ఓటమి చెందిందన్నారు. ఆ నాటి ప్రధాని ఇందిరాగాంధీ మాదిరిగానే ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ వ్యవహరిస్తున్నారన్నారు. ప్రిన్సిటన్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ జ్ఞాన్ ప్రకాశ్ ఎమర్జన్సీ క్రానికల్ అనే పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకంలో ఆయన పై విషయాలను ప్రస్తావించారు. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించారని, ఇప్పుడు మోదీ కూడా ఇంచుమించు అదే పరిస్థితులను సృష్టించారన్నారు.

దేశంలో రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగ రంగం కుదేలైందన్నారు. మోదీలో ఇందిరాగాంధీ లక్షణాలు కనపడుతున్నాయన్నారు. మోదీ మాటలు, నినాదాలు, ఫోటోగ్రాఫ్‌లను చూస్తుంటే నియంత కనపడుతున్నారన్నారు. ఈ రోజు మోదీ ఎక్కువ అధికారాలను అనుభవిస్తున్నారని, ఈ అధికారాలకు ఎమర్జన్సీ అక్కర్లేదన్నారు. అలహాబాద్ కోర్టు తీర్పు ఇవ్వని పక్షంలో ఇందిరాగాంధీ ఎమర్జన్సీని విధించి ఉండేవారు కారని ఆయన చెప్పారు. 1975లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం విదితమే. దేశంలో హిందూ జాతీయవాదం విజృంభిస్తోందని చరిత్రాకారుడు జ్ఞాన్ ప్రకాశ్ చెప్పారు.

పంచాయతీ ఎన్నికల నుంచే ఈబీసీ రిజర్వేషన్లు

• అమలు చేయాలని బీజేపీ డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ఈబీసీ రిజర్వేషన్లు ఎన్నికల స్టంట్ అని ఆరోపిస్తున్న రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ నిలదీశారు. మంగళవారం నాడు ఆయన పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే కేంద్రం ఆమోదించే పది శాతం రిజర్వేషన్లను పంచాయతీ ఎన్నికల నుండే అమలుచేయాలని డిమాండ్ చేశారు. తగ్గించిన బీసీ రిజర్వేషన్లను సైతం రాష్ట్రప్రభుత్వం పెంచాలని ఆయన అన్నారు. పార్టీలు రాజకీయాలను పక్కన పెట్టి పార్లమెంటులో బిల్లు ఆమోదానికి మద్దతు ఇవ్వాలని హితవు పలికారు. ఆర్థిక వెసులుబాటు ఆధారంగా మోదీ ప్రభుత్వం చేపట్టిన రిజర్వేషన్లు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. 8 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న అగ్రవర్ణ పేదలకూ రిజర్వేషన్లు కల్పించేందుకు సాహసోపేత నిర్ణయాన్ని తీసుకున్నారని అన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్ల కోసం వాజపేయి ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, యూపీఏ ప్రభుత్వం కమిషన్ నివేదికను బుట్టదాఖలు చేసిందని గుర్తుచేశారు. గతంలో పీవీ ప్రభుత్వం సైతం ఇదే తరహా ప్రయత్నం చేసిందని అన్నారు. ఓసీలు ప్రభుత్వ ఉద్యోగాల్లో చాలా తక్కువగా ఉన్నారని నిరూపిస్తే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని సుప్రీంకోర్టు చెప్పడం జరిగిందని అన్నారు. మతపరమైన రిజర్వేషన్లు నాలుగు నుండి 12 శాతానికి పెంచాలని పెంచాలంటున్న అసదుద్దీన్ ఓవైసీ ఓసీల రిజర్వేషన్లను వ్యతిరేకించడం అర్థరహితమని అన్నారు. కోర్టు తీర్పుతో ఇబ్బందులు రాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ఆధారంగా బిల్లును ఆమోదించాలని కేంద్రం చూస్తోందని అన్నారు. బీసీల్లో వర్గీకరణకు అంకురార్పణ చేసింది నరేంద్రమోదీ ప్రభుత్వమేనని చెప్పారు. ఇవన్నీ విస్మరించి రాజకీయ పార్టీలు తమ ఇష్టానుసారం మాట్లాడుతున్నాయని, పేదల సంక్షేమం ముఖ్యమనుకుంటే బిల్లు ఆమోదానికి అంతా సంపూర్ణ సహకారాన్ని అందించాలని పేర్కొన్నారు.

రాజాసింగ్‌ను అనర్హునిగా ప్రకటించండి

• ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ప్రొటెం స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. రాజాసింగ్‌పై 43 కేసులున్నా ఆయనపై చర్య ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ, రాజాసింగ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి పోటీ పడుతున్నారని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో శ్రవణ్ విమర్శించారు. మైనార్టీ వర్గానికి చెందిన ప్రొటెం స్పీకర్ ముందు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలు యావత్తు మైనార్టీ సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. ఒక వర్గంపై ద్వేషభావాన్ని రాజాసింగ్ వ్యాఖ్యలు బహిర్గతం చేశాయన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు, లౌకిక విధానాలకు విరుద్ధమన్నారు. గతంలో ఏ తప్పు చేయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలను రద్దు చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం, మరి రాజాసింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శ్రవణ్ ప్రశ్నించారు.

ఉపాధ్యాయ ఏకగ్రీవ అభ్యర్థిగా మోహన్‌రెడ్డి

• మద్దతు తెలిపిన హెచ్‌ఎంలు, ఎయిడెడ్ టీచర్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయుల ప్రతినిధిగా బి. మోహనరెడ్డిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరీంనగర్ నుంచి రంగంలోకి దించుతున్నారు. దాదాపు అన్ని సంఘాలూ కలిసి ఆయన అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భిన్నమైన ఉపాధ్యాయ సంఘాలు సైతం మోహన్‌రెడ్డికి మద్దతు చెబుతున్నాయి. మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ వర్గానికి వివిధ హోదాల్లో విశిష్టసేవలు అందించిన మాజీ ఎమ్మెల్సీ మోహనరెడ్డి అనుభవం ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన, వారి పరిష్కారానికి ఆయన చూపించే చొరవ , గతంలో ఉపాధ్యాయులకు ఎన్నో సౌకర్యాలు తీసుకువచ్చిన దృష్ట్యా ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం , ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఘం ప్రకటించాయి. ఆ సంఘాల నాయకులు పాత్రికేయులతో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మోహనరెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మోహనరెడ్డి మాట్లాడుతూ మార్చి 2019లో శాసనమండలికి జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా తనకు మ్యాండేట్ ఇచ్చినందుకు వివిధ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు కారు చీకట్లు.. నేడు కాంతి రేఖలు

• పవర్‌హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ • 1998లోనే విద్యుత్‌రంగ సంస్కరణలకు నాంది
• 2014కు ముందు అంధకారం • నాలుగున్నరేళ్లలో మిగులు విద్యుత్ రాష్ట్రం
• పొదుపులోనూ ముందంజ.. జాతీయ స్థాయిలో అవార్డులనేకం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 8: విద్యుత్ సమృద్ధిగా ఉన్నప్పుడే ఓ ప్రాంత అభివృద్ధి రూపురేఖలు మారతాయి. నేడు విద్యుదుత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ పడిలేచిన కెరటాన్ని తలపిస్తోంది. కోతల స్థాయిని అధిగమించి అతి తక్కువ వ్యవధిలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. రాష్ట్ర విభజన నాటికి ఏపీలో రోజుకు 22 మిలియన్ యూనిట్ల కొరత ఉండటంతో విద్యుత్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా దేశంలోనే మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. అంతేకాదు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడే స్థాయికి ఎదిగింది. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకూ విద్యుత్‌ను అందిస్తున్న రాష్ట్రంగా రికార్డుకెక్కింది. గృహాలకు, పరిశ్రమలకు, వాణిజ్య అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. వ్యవసాయానికి రానున్న రోజుల్లో 9 గంటల ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో చీకటి రోజులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగం పరిస్థితి దారుణంగా ఉండేది. సరఫరాలో తరచు అంతరాయాలు, ఓల్టేజీ సమస్యలు విపరీతంగా ఉండేవి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే వాటిని మార్చటానికి వారాల తరబడి జాప్యం జరిగేది. వేసవిలో పల్లె ప్రాంతాల్లో రోజుకు ఎనిమిది గంటలు, పట్టణాల్లో నాలుగు గంటలకు పైబడి విద్యుత్ కోతలు అమలులో ఉండేవి. విద్యుత్ లోటుతో పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు నిత్యకృత్యాలయ్యాయి. విద్యుత్ సంస్థ ఉద్యోగులకు జీతబత్యాలు కూడా ఇవ్వలేని దుస్థితి. విద్యుత్ రంగం అభివృద్ధిలో ముందుచూపు లేకపోవటమే ఈ దైన్య స్థితికి కారణం. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అతి ముఖ్యమైన విద్యుత్ రంగం కూలబడటంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యుత్‌రంగ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1995-96లో విద్యుదుత్పాదక శక్తి 6163 మెగావాట్లు ఉండగా, అది తొమ్మిదేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 11797 మెగావాట్లకు పెరిగింది. దేశం మొత్తం మీద మన విద్యుత్ కేంద్రాలు అత్యంత సమర్థతతో పనిచేసే, గణనీయమైన విజయాలను సాధించాయి. రాష్ట్రంలో ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలు పీఎల్ఎఫ్ 78 శాతం నుంచి 95.96 శాతానికి పెంచగలిగింది. దాంతో దేశంలోకెల్లా మన రాష్ట్ర విద్యుత్ సంస్థ థర్మల్ రంగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర విద్యుత్ ప్రాజెక్టుల పనితీరు మెరుగై రికార్డు స్థాయిలో ఉత్పాదన జరిగింది. వ్యవసాయ రంగంలో ప్రత్యేకంగా విద్యుత్ ఫీడర్లను ప్రవేశపెట్టింది. ఆయన హయాంలోనే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టి మిగిలిన రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఒక రోల్‌మోడల్‌గా నిలిచింది.

నవ్యాంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ హయాంలో నిర్వీర్యమైపోయిన ఇంధన వ్యవస్థను తిరిగి పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడుం బిగించారు. ప్రస్తుతం నూతన రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టుల పనితీరు మెరుగుపరచడం, కొత్త ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేయడం, విద్యుత్ నష్టాలను తగ్గించడం, విద్యుత్ ఆదాకు ప్రయత్నించడం అన్నింటికీ మించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకోవటం తదితర అంశాలతో ప్రణాళిక రూపొందించారు. విద్యుత్ రంగంలో సంస్కరణల కోసం నూతనంగా ఎలక్ట్రికల్ మొబిలిటీ పాలసీని తీసుకొచ్చారు. అలాగే తలసరి విద్యుత్ వినియోగం ఏకంగా 1174 యూనిట్లకు చేరింది. ప్రస్తుతం ఏపీలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 19080 మెగావాట్లకు చేరుకుంది.

జాతీయ స్థాయిలో అవార్డుల పంట

పునరుత్పాదక ఇంధనంపై ఏపీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సోలార్, పవన విద్యుత్, హైబ్రిడ్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర విభజన తరువాత విద్యుత్ రంగంలో మిగులు ఫలితాలను సాధించిన ఏపీ ట్రాన్స్‌కో ప్రపంచ మార్కెట్‌తో పోటీపడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. విద్యుదుత్పాదన, పంపిణీ, పునరుత్పాదక ఇంధన వనరులు, నాణ్యత, పంపిణీ, నష్టాల నియంత్రణ, సరఫరా తదితర అంశాలకు సంబంధించి ఇప్పటికే ఏపీ ట్రాన్స్‌కో అనేక విజయాలు సాధించింది. జాతీయ స్థాయిలో అవార్డులనేకం అందుకుంది. 2014 నుంచి ఇప్పటి వరకు 137 అవార్డులను సొంతం చేసుకుంది.

ప్రస్తుతం ఏపీలో తలసరి విద్యుత్ వాడకం 957 యూనిట్ల నుంచి 1174 యూనిట్లకు పెరిగింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంతో అదనంగా 6100 మెగావాట్ల విద్యుత్‌ను పెంచుకోగలిగింది. 2014 జూన్ తరువాత 3.25 లక్షల మంది వ్యవసాయదార్లకు కొత్త కరెంటు కనెక్షన్లు మంజూరయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో నిర్వహించే బిడ్డింగ్ ప్రక్రియలతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఇంధన వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఏపీ విద్యుత్ కార్యాచరణ రూపొందించుకుంది.

2014కు ముందు పరిస్థితి

పదేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రమంతా అంధకారమయం. విద్యుత్ కొరత..కోతలు.. పవర్ హాలీడేలు. విద్యుత్ ఉత్పాదన కేవలం 6500 మెగావాట్లే. నెలకు 15 రోజులు పరిశ్రమలు మూతపడే దుస్థితి. 2014 నాటికి 17.6 శాతానికి విద్యుత్ కొరత ఉండేది

నాలుగున్నరేళ్లలో విజయాలు

విద్యుత్ రంగం పటిష్టతపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించారు. కేవలం నెలరోజుల్లోనే 22 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరతను అధిగమించారు. 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతోంది. రైతులకు 7 గంటల ఉచిత విద్యుత్. విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 167 శాతానికి పెరుగుదల కనిపించింది. 6,43,305 గ్రామీణ గృహాలకు విద్యుద్దీకరణ చేపట్టారు. నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్క్‌లు ఏర్పాటవుతున్నాయి. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు రాష్ట్రం సాధించిన ప్రగతికి నిదర్శనాలు.

మాజీ మంత్రి తుమ్మలతో టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 8: టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తెలుగుదేశం పార్టీకి చెందిన అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు మెచ్చా నాగేశ్వరరావు భేటీ కావటం ఖమ్మంలో కలకలం రేపింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రెండు స్థానాలను గెలుచుకోగా ఆ రెండు కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట కావడం విశేషం. అయితే వారిద్దరూ టీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తుమ్మలతో మెచ్చా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కొద్దిరోజుల క్రితం సత్తుపల్లి శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య టీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం జరగడం, దీనికి సంబంధించి మెచ్చా నాగేశ్వరరావుతో సమావేశం కావడంతో పాటు టీఆర్ఎస్‌లో చేరే అంశాన్ని ప్రస్తావించినట్లు మెచ్చానే బహిర్గతం చేయడం తెలిసిందే. అయితే ఆ తరువాత పరిణామాల్లో సండ్ర స్తబ్దుగా ఉండగా ఆయన టీఆర్ఎస్‌లో చేరుతారనే సానుకూల సంకేతాలు మాత్రం ఉన్నాయి. టీఆర్ఎస్‌లో చేరికను గతంలో ఖండించిన మెచ్చా నాగేశ్వరరావు ఇందుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను కూడా విడుదల చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు శాసన సభ్యులను టీఆర్ఎస్‌లో చేర్పించడం, తద్వారా రాష్ట్రంలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా చేసే బాధ్యతను ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు సన్నిహితుడైన తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగించినట్లు తెలిసింది. అందులో భాగంగానే తుమ్మల నాగేశ్వరరావు స్వగృహంలో మంగళవారం మెచ్చా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. టీఆర్ఎస్ నేతలు మాత్రం టీడీపీ ఎమ్మెల్యేలిద్దరిని ఒకేసారి పార్టీలో చేర్పించేందుకు కసరత్తు జరుగుతున్నదని, ఈ భేటీ అందులో భాగమేనని వెల్లడించారు. మంత్రివర్గ విస్తరణలోగా ఈ చేరికలు ఉంటాయని ప్రచారం కూడా జరుగుతున్నది. అయితే టీఆర్ఎస్‌లో చేరే అంశంపైన కానీ, తుమ్మలతో భేటీపై కానీ మెచ్చా నాగేశ్వరరావు స్పందించకపోవడం గమనార్హం.

మన సంతతి రక్షణ మన బాధ్యత

• లోక్‌సభలో హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్
• పౌరసత్వ చట్టం సవరణ బిల్లుకు ఆమోదం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లోని భారత సంతతికి చెందిన హిందు, సిక్కు, బౌద్ధ, జైన, క్రైస్తవ మతాలకు చెందిన వారికి భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ చట్టం సవరణ బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును మరోసారి స్టాండింగ్ కమిటీకి పంపించాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌ను ఆమోదించనందుకు నిరసనగా ఈ సభ్యులు సభనుండి వాకౌట్ చేశారు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. మతం ఆధారంగా దేశ విభజన జరగకుండా అఖండ భారత్ ఉంటే చాలా బాగుండేది కానీ మతం ఆధారంగా విభజన జరిగిందని ఈ సందర్భగా హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. దేశ విభజన అనంతరం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లోని హిందూ, సిక్కు, క్రైస్తవులకు భద్రత లేకుండా పోయింది. అందుకే వీరు భారతదేశంలో తలదాచుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారికి పౌరసత్వం కల్పించటం మన బాధ్యత అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లోని ప్రస్తుత ప్రభుత్వం అక్కడి మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నా కొన్ని శక్తులు, సంస్థలు మైనారిటీలపై దాడులు కొనసాగిస్తున్నాయని హోం శాఖ మంత్రి తెలిపారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన హిందూ, సిక్కు, క్రైస్తవ, బౌద్ధ, జైన మతస్థులకు భారత పౌరసత్వం ఇవ్వటంతో అస్సాంపై తీవ్రమైన భారం పడుతుందనేది అపోహ మాత్రమేనన్నారు. వీరు దేశంలో ఎక్కడైనా స్థిరపడవచ్చు.. నివసించవచ్చునని స్పష్టం చేశారు. అస్సాం సభ్యత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని రాజ్‌నాథ్ ప్రకటించారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమంటూ ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, బదరుద్దీన్ చేసిన ఆరోపణలను రాజ్‌నాథ్ ఖండించారు. వీరి ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. బీజేపీ సభ్యురాలు మీనాక్షి లేఖి మాట్లాడుతూ దేశ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్‌లో 18శాతం హిందువులుంటే ఇప్పుడు వారి సంఖ్య కేవలం ఒక శాతానికి పడిపోయింది. బంగ్లాలోనూ హిందువులు, ఇతర మైనారిటీల జనాభా ఎమినిది శాతానికి పడిపోయింది. అల్పసంఖ్యాక వర్గాలపై ఆ దేశంలో జరుగుతున్న అత్యాచారాల మూలంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆరోపించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లోని హిందు, సిక్కు, బౌద్ధ, జైన, క్రైస్తవులపై జరుగుతున్న అత్యాచారాల గురించి మన సభ్యులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

1వ పేజీ తరువాయి

కోటాకు జై

ఆరోపించారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లోట్ మంగళవారం సాయంత్రం 124వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపాదించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే ఉన్నత వర్గాల బీదవారికి రిజర్వేషన్లు కల్పిస్తోందని బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఆలోపించాయి. బిల్లును ఇంత అకస్మాత్తుగా ప్రతిపాదించవలసిన అవసరం ఏమిటి, ఎందుకీ తొందరపాటు అంటూ ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రభుత్వం వ్యవహరించిన తీరు మూలంగా తాము బిల్లుకు సవరణలు ప్రతిపాదించలేకపోయామని తెలిపాయి. న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని కొందరు మంత్రులు, అధికార, ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. తమకు అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన చెందుతున్న ఉన్నత వర్గాల వారి కోప తాపాలు ఇక మీదట హరించిపోతాయని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు.

అందరి అభ్యున్నతే లక్ష్యం

నరేంద్ర మోదీ సబ్‌కా సాథ్ సబ్ కా వికాస్ (అందరితో అందరి అభివృద్ధి) నినాదాన్ని అమలు చేసే కార్యక్రమంలో భాగంగా ఉన్నత వర్గాలలోని బీద ప్రజలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని గెహ్లోట్ ప్రకటించారు. బీసీ,ఎస్‌సి,ఎస్‌టిలకు ఇస్తున్న యాభై శాతం రిజర్వేషన్ల పరిధిలోకి రానివారంతా ఈ పది శాతం పరిధిలోకి వస్తారని, ఉన్నత వర్గాలకు చెందిన పేదలను గుర్తించే బాధ్యతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వెనుకబడిన కులాలు,ఎస్‌సీ,ఎస్‌టీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ఉన్నత వర్గాలలోని బీదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గెహ్లోట్ తెలిపారు. ఈ బిల్లును సుప్రీం కోర్టు కొట్టివేయకుండా చూసేందుకు రాజ్యాంగంలోని 15,16 అధికరణలను సవరిస్తున్నామని అన్నారు. గతంలో ఉన్నత వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించినా దీనికి రాజ్యాంగపరమైన ఆమోదం లేదంటూ తిరస్కరించడం జరిగిందని, అయితే ఇప్పుడలాంటి పరిస్థితి రాకుండా చూసేందుకే రాజ్యాంగంలోని 15,16 ఆర్టికల్స్‌ను సవరిస్తున్నామని ఆయన చెప్పారు.

బీసీ,ఎస్‌టి,ఎస్‌సీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లకు అదనంగా పది శాతం రిజర్వేషన్లను ఉన్నత వర్గాలకు చెందిన బీద ప్రజలకు కల్పిస్తున్నామని తెలిపారు. దీని వల్ల వీరికి ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. పది శాతం రిజర్వేషన్ల వలన ప్రయోజనాల గురించి అతి తక్కువ వివరణ ఉన్నా ఉన్నత వర్గాలలోని బీద ప్రజలకు కలిగే ప్రయోజనాలు మాత్రం ఎంతో అధికమని ఆయన తెలిపారు. వివిధ మతాలోని అన్ని ఉన్నత వర్గాలు, కులాలకు దీని వలన ప్రయోజనం కలుగుతందన్నారు.

ఇది ఎన్నికల జిమిక్కు:కాంగ్రెస్

ఉన్నత వర్గాలకు చెందిన పేదలకు పదిశాతం రిజర్వేషన్ కల్పన ఎన్‌డిఏ ప్రభుత్వ ఎన్నికల జిమ్మిక్కు అని కాంగ్రెస్ సభ్యుడు కె.వి.థామస్ విమర్శించారు. ఈ రిజర్వేషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేస్తుందని ఆయన చెప్పారు. ఎయిడెడ్ విద్యా సంస్థలతో పాటు అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఈ రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ దీనికి వివరణ ఇస్తూ గతంలో మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు ఒక నోటిఫికేషన్ ద్వారా ఉన్నత వర్గాల బీద వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర చట్టం ద్వారా ఈ పని చేయగా సుప్రీం కోర్టు కొట్టివేసిందని, అందుకు కారణం రాజ్యాంగ పరమైన సవరణ చేయకపోవటమేనని తెలిపారు. బీసీ, ఎస్.సి,ఎస్.టి రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగంలోని 15,16 ఆర్టికల్ వీలు కల్పిస్తున్నాయని, వీటిని సవరించకుండా ఉన్నత వర్గాలలోని బీద వారికి రిజర్వేషన్లు కల్పిస్తే కోర్టు కొట్టివేస్తుంది కాబట్టే ఆర్టికల్ 15,16ను సవరిస్తున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ తదితర అన్ని రాజకీయ పార్టీలు కూడా 201 ఎన్నికల ప్రణాళికలో ఉన్నత వర్గాలకు చెందిన బీద వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చాయనేది మరిచిపోరాదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా పది శాతం రిజర్వేషన్లకు హృదయపూర్వకంగా మద్దతు ఇవ్వాలని జైట్లీ సూచించారు. ఎస్‌సి,ఎస్‌టి,బీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయనందుకే ఈ వర్గాలకు చెందిన వారిప్పుడు కూడా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నా డి.ఎం.కె నాయకుడు, డిప్యూటీ స్పీకర్ తంబిదురై చెప్పారు. తమిళనాడు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డిఏకు ఇది ఎన్నికల్లో ప్రయోజనం కలిగించవచ్చు కానీ సుప్రీం కోర్టు మాత్రం తప్పకుండా కొట్టివేస్తుందని తంబిదురై చెప్పారు. బి.సి, ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లను 50 నుండి 69 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ పక్షం నాయకుడు సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు సంబంధించిన బిల్లును ఆమోదించడం గురించి ప్రభుత్వం ఎందుకు ఆలోచించటం లేదని ప్రశ్నించారు. దేశంలోని ఉపాధి అవకాశాలపై ఒక శ్వేత పత్రాన్నిప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లుకు మద్దతు ఇస్తున్నామని సుదీప్ బందోపాధ్యాయ ప్రకటించారు. శివసేన కూడా ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించింది.

కేంద్ర మంత్రి, ఎల్.జె.పి అధ్యక్షుడు రాంవిలాస్ పాశ్వాన్ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. మొత్తం అరవై శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూలులో పొందుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలా చేయటం వలన కోర్టు కొట్టివేసే ప్రమాదం తొలగిపోతుందని రాంవిలాస్ పాశ్వాన్ సూచించారు. భారత న్యాయ సర్వీసు వ్యవస్థను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహారాష్ట్రకు చెందిన దన్‌గర్ కులాన్ని ఎస్.టిలో చేర్చాలని ఎన్.సి.పి సభ్యురాలు సుప్రియా సూలే డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలోని ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారి వివరాలు ఎవరి వద్ద ఉన్నాయని ఒవైసీ ప్రశ్నించారు. ఈ బిల్లు ఒక ఫ్రాడ్ అని ఆయన ఆరోపించారు.

సాయికృష్ణను ఆదుకుంటాం

అందించాల్సిందిగా కేటీఆర్ సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్ళేందుకు అవసరమైన అత్యవసర వీసాలను జారీ చేయాల్సిందిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హెడ్డాను ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. కాగా, కేటీఆర్ వెంటనే స్పందించి సహాయం చేసినందుకు సాయికృష్ణ కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని అన్నారు. ఇలాఉండగా సాయికృష్ణకు వైద్య సహాయం అందించాలని ఎంపీ సీతారాంనాయక్ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్‌ను కోరినప్పుడు ఆమె వెంటనే అమెరికాలోని భారత రాయభార కార్యాలయ అధికారులతో మాట్లాడారు.

అయోధ్య కేసు విచారణ 10న

2.77 ఎకరాల వివాదస్పద భూమిని నిర్మోహి అఖారా, రాం లల్లా, సున్నీ వక్ఫ్ బోర్డుకు కేటాయించిన విషయం విదితమే. వాస్తవానికి ఈ కేసు విచారణ గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన ప్రారంభమవుతుందని అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రకటించారు. ఆ తర్వాత అనేక మలుపులు తిరిగి ఈ కేసు విచారణ వాయిదా పడుతూ ఈ నెల 10వ తేదీన ప్రారంభమవుతోంది.

సీఎల్పీ పదవికి పోటాపోటీ

జాజుల సురేందర్ మొదటిసారి ఎమ్మెల్యేలు కావడంతో వీరు మినహా మిగతా సీనియర్లంతా సీఎల్పీ పదవి ఆశిస్తున్నారు. సీఎల్పీ నాయకునిగా ఎవరుండాలన్నది కాంగ్రెస్ అధిష్టానమే నిర్ణయిస్తుందని టీపీసీసీ వర్గాల సమాచారం. కాంగ్రెస్ అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో రెండు, మూడు రోజుల్లో తేలుతుందని టీపీసీసీ వర్గాలు భావిస్తున్నాయి.

కాంట్రాక్టు లెక్చరర్ల వెతలు తీరేదెన్నడు?

నెలల తరబడి రాని వేతనాలు ★ రాష్ట్రం ఏర్పడి నాలుగేళ్లయినా తప్పని కష్టాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ప్రభుత్వ ఉద్యోగం వస్తే కుటుంబమంతా సంతోషమే అంటారు..వీరికి నెలనెలా ఒకటవ తారీఖునే వేతనాలు వస్తాయంటారు...కానీ ఏళ్ల తరబడి ఉద్యోగాన్ని నమ్ముకుని ప్రభుత్వ కళాశాలలను కాపాడుతున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. సర్కారు కళాశాలల్లో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఈ అధ్యాపకులు పండుగలొస్తే పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి ఇదేరకమైన కష్టంతో కాలం వెళ్లదీస్తున్న వీరు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కష్టాలు కడతీరుతాయని భావించినా, పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. స్వరాష్ట్రం వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా అవే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వీరి కష్టాలపై కనికరించిన తెలంగాణ సర్కారు గత రెండేళ్ల క్రితం వేతనాలు పెంచినా ఈ వేతనాలను ప్రతి నెలా ఇచ్చే చర్యలు మాత్రం చేపట్టలేదు. ఒకవైపు వేతనాలు నెలనెలా రాక మరోవైపు ఉద్యోగ భద్రత ఆశలు నెరవేరక వారు కష్టాలతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 402 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3686 కాంట్రాక్టు లెక్చరర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత అక్టోబర్ మాసం నుండి వేతనాలు రావాల్సి ఉన్నాయి. దీపావళి, క్రిస్మస్ పండుగలను వేతనాలు లేకుండానే గడిపిన ఈ అధ్యాపకులు సంక్రాంతి పండుగ వస్తుండటంతో అప్పుల కోసం తంటాలు పడుతున్నారు. వీరికి ప్రతి నెలా 37100 రూపాయల వేతనాన్ని చెల్లిస్తున్న సర్కారు నాలుగు మాసాల నుండి వేతనాల బడ్జెట్ విడుదల చేయకపోవడంతో అధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోయారు. సర్కారు ఉద్యోగం చేస్తున్నా కనీసం నెలనెలా వేతనాలు అందుకోలేని దుస్థితిలో ఉన్నామని వారు గొల్లుమంటున్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా తమకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు వ్యవస్థకు మంగళం పాడుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నంబర్ 16ను కూడా జారీ చేశారు. కానీ కొందరు విద్యార్థులు కోర్టుకు వెళ్లగా అందరిని ఎలా చేస్తారని కోర్టు ప్రశ్నించడంతో సర్కారు క్రమబద్ధీకరణ చర్యలు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రభుత్వ కళాశాలలను కాపాడటంలో కాంట్రాక్టు లెక్చరర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్న విషయం జగమెరిగిన సత్యమని ముఖ్యమంత్రి నుండి స్థానిక ప్రజాప్రతినిధులందరికి తెలిసినా కనీసం వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు సర్కారు ముందడుగు వేయక పోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ భద్రత లేని కారణంగా రెగ్యులర్ అధ్యాపకులు బదిలీలు, నాన్‌టీచింగ్ ఉద్యోగుల పదోన్నతులపై రావడం వలన ఉన్నటువంటి ఉద్యోగం ఊడిపోతోందని కాంట్రాక్టు లెక్చరర్లు తరుచూ వాపోతున్నారు. వేతనాలు నెల నెలా ఇచ్చేలా చర్యలు తీసుకుని ఉద్యోగ భద్రత కల్పిస్తేతమ కుటుంబాలలో సంతోషం ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇందుకోసం వారం రోజుల నుండి లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు అనేక మంది ప్రభుత్వ పెద్దలను కలుస్తూ తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. నాలుగేళ్ల పాటు అనేక రకాల పోరాటాలు చేసిన కాంట్రాక్టు లెక్చరర్లు కేసీఆర్ సర్కారు హయాంలో పన్నెండు నెలల వేతనాల జీవోను సాధించినా ఉద్యోగ భద్రత మాత్రం సాధించుకోలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ మినిమమ్ టైంస్కేలును అమలు చేస్తోందని కావున తెలంగాణ సర్కారు కరుణించి తమకు కూడా బేసిక్ పేతో పాటు డిఏ చెల్లించి ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగికి సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు సైతం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తలుచుకుంటే కోర్టు కేసులు ఏ మాత్రం అడ్డుకావని, మానవీయ కోణంలో తమను తక్షణమే రెగ్యులరైజ్ చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కాంట్రాక్టు లెక్చరర్లు కోరుతున్నారు.

ఏపీలో యూనిట్‌కు లైట్ ఆటో ఎంఓయూ

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 8: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పం దం కుదుర్చుకుంది. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా సమక్షంలో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, సంస్థ ఎండీ బాలానంద్ జాలాది ఒప్పంద అవగాహనా పత్రాలపై సంతకాలు చేశారు. వాహనాల విడిభాగాల తయారీలో రూ. 300 కోట్ల పెట్టుబడికి లైట్ ఆటో సంస్థ ముందుకొచ్చింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించి పరిశ్రమ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మొదటి దశలో 100 కోట్లు, రెండో దశలో మరో 200 కోట్లు పెట్టుబడికి సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనివల్ల 250 మందికి ప్రత్యక్షంగా, మరో 350 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

క్రీడాభూమి

రాస్ టేలర్ సూపర్ సెంచరీ



సెంచరీతో జట్టును గెలిపించిన రాస్ టేలర్

- మూడో వన్డేలో శ్రీలంకపై న్యూజిలాండ్ ఘన విజయం
- 3-0తో సిరీస్ ఓడిన లంకేయులు

నెల్సాన్ (న్యూజిలాండ్), జనవరి 8: వెటరన్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్, హెన్రీ నికోలస్ సెంచరీలతో చెలరేగిన మ్యాచ్‌లో శ్రీలంక 115 పరుగులతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0 తేడాతో న్యూజిలాండ్ గెలుచుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్ నిర్ణిత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 364 పరుగుల భారీ స్కోరు చేసింది. న్యూజిలాండ్ ఆటగాళ్లలో కెప్టెన్ కెన్ విలియమ్స్ (55) అర్థ సెంచరీతో రాణించగా, సీనియర్ ఆటగాడు రాస్ టేలర్ (137), హెన్రీ నికోలస్ (124 నాటౌట్) రాణించారు. ఆది నుంచే దూకుడుగా ఆడిన న్యూజిలాండ్ జట్టు 16 పరుగుల వద్ద మలింగ వేసిన అద్భుత బంతికి మార్టిన్ గుప్టిల్ (2) తక్కువ స్కోరుకే అవుటవ్వగా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ కెన్ విలియమ్స్‌తో కలిసి కోలిన్ మున్రో స్కోరు బోర్డును పరుగులెత్తించారు. అయితే మున్రో (21)ను మలింగ్ బౌల్డ్ చేశాడు.

ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన రాస్ టేలర్ చేలరేగి ఆడాడు. వీరిద్దరూ కలిసి 116 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. 27వ ఓవర్‌లో సందకన్ బౌలింగ్ విలియమ్సన్ అవుట్ అయ్యాడు. హెన్రీ నికోలస్ క్రీజ్‌లోకి వచ్చి రావడంతో లంక బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ 154 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో రాస్ టేలర్ తన కెరీర్‌లో 20వ సెంచరీ నమోదు చేశాడు. ఆ తర్వాత మలింగ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. జెమ్స్ నిషామ్‌తో కలిసి నికోలస్ జట్టు పరుగులను 364 పరుగులకు చేర్చారు. హెన్రీ నికోలస్ కెరీర్‌లో ఆరో సెంచరీ సాధించాడు. శ్రీలంక బౌలర్లలో కెప్టెన్ లసిత్ మలింగకు 3, లక్షన్ సందకన్‌కు ఒక వికెట్ లభించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన లంక 41.4 ఓవర్లలోనే 249 పరుగులు చేసి ఆలౌటైంది. సీనియర్ బ్యాట్స్‌మన్ తిషారా పెరీరా(80), నిరోషాన్ డిక్వెల్లా (46), కుశల్ పెరీరా (43), ధనుంజయ్ డిసిల్వా (36), దిన్షుక గుణతిలక (31) మాత్రమే చెప్పుకునే విధంగా రాణించినా లంకకు ఓటమి తప్పలేదు. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్‌కి 4, ఇష్ సోది 3, టిమ్ సౌథీ, జెమ్స్ నిషామ్‌కి తలో వికెట్ లభించింది. అద్భుతంగా ఆడి కెరీర్‌లో 20 శతకం సాధించిన సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్‌కి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ అవార్డు దక్కింది.

బూమ్రాకు విశ్రాంతి అవసరం

- ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు మహ్మద్ సిరాజ్
- న్యూజిలాండ్ పర్యటనకు సిద్ధార్థ్ కౌల్‌కు అవకాశం: బీసీసీఐ



సిడ్నీ, జనవరి 8: ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో రాణించిన టీమిండియా పేసర్ జస్ప్రీత్ బూమ్రాకు విశ్రాంతి కల్పించనున్నట్లు బీసీసీఐ మంగళవారం పేర్కొంది. దీంతో బూమ్రా ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్, రానున్న న్యూజిలాండ్ పర్యటనకు దూరం కానున్నాడు. బూమ్రా స్థానంలో హైదరాబాద్ ఆటగాడు మహ్మద్ సిరాజ్‌కు చోటు కల్పించినట్లు బీసీసీఐ తెలిపింది. బూమ్రా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్ అత్యధికంగా 21 వికెట్లు పడగొట్టిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రిల సూచనతో బూమ్రాకు విశ్రాంతినిచ్చేందుకు సెలక్టర్లు అంగీకరించారు. ఇప్పటివరకు అంతర్జాతీయ టీ20లు మాత్రమే ఆడిన సిరాజ్ ఆసీస్‌తో వన్డే ఫార్మట్‌లో ఆరంగేట్రం చేయనున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్‌కు అవకాశం కల్పించారు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ తర్వాత విరాట్ సేన న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. కివీస్‌తో 5 వన్డేల సిరీస్‌తో పాటు మూడు టీ20ల సిరీస్‌లో పాల్గొననుంది.

కోహ్లీ నెం.1, పుజారా 3

- ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానం నిలబెట్టుకున్న టీమిండియా కెప్టెన్ విరాట్
- ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ విజయంతో మెరుగుపడిన ఆటగాళ్ల ర్యాంకులు


విరాట్ కోహ్లీ



చటేశ్వర్ పుజారా


రిషబ్ పంత్

దుబాయి, జనవరి 8: ఐసీసీ టెస్టు బ్యాట్స్‌మెన్స్ ర్యాకింగ్‌లో కోహ్లీ తన నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా, ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుతంగా రాణించిన చటేశ్వర్ పుజారాకు మూడో స్థానం దక్కింది. తాజాగా ఐసీసీ ర్యాంకులో వీరద్దరితో పాటు వికెట్ కీపర్ రిషబ్ పంత్ 21వ ర్యాంకింగ్ నుంచి 17వ ర్యాంకుకు చేరుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరసీలో పుజారా నాలుగు టెస్టుల్లో 3 సెంచరీలతో 521 పరుగులు చేశాడు. అంతేకాకుండా మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, సిరీస్‌లను దక్కించుకోవడంతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇక కీపర్ రిషబ్ పంత్ మొదటిసారిగా 17వ ర్యాంకు సాధించాడు. లెజెండరీ టీమిండియా వికెట్ కీపర్ మహీంద్రా సింగ్ ధోని ఇప్పటి వరకు టెస్టుల్లో 19 వ ర్యాంకులోనే కొనసాగగా, పంత్ భారత వికెట్ కీపర్లలో 17వ ర్యాంకు సాధించాడు. పంత్ 2016లో జరిగిన ఐసీసీ అండర్ 19 క్రికెట్ వరల్డ్ కప్‌లో నేపాల్‌పై 18 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. కేవలం 9 అంతర్జాతీయ టెస్టులాడిన పంత్ ఆస్ట్రేలియాతో జరిగిన చివరి టెస్టులో 159 పరుగులు సాధించి టాప్ 20లో స్థానం సంపాదించుకోవడం గమనార్హం. ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌తో రాణించి పంత్, 20 క్యాచ్‌లు అందుకున్నాడు. వీరితో పాటు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆరు స్థానాలు ఎగబాకి 57వ స్థానంలో, మయాంక్ అగర్వాల్ 62వ ర్యాంకింగ్‌లో కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకొని కెరీర్‌లో 45వ ర్యాంక్ సాధించాడు.

మహమ్మద్ షమీ 22, జస్ప్రీత్ బూమ్రా 16, రవీంద్ర జడేజా 5వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇక దక్షిణాఫ్రికా ఆటగాడు మార్క్రాం 10వ ర్యాంకింగ్‌లో కొనసాగుతుండగా, బవుమా మొదటిసారి టాప్ 30లో చోటు సంపాదించుకున్నాడు. దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ 16వ స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ విండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

కోహ్లీ సేనకు బీసీసీఐ నజరానా

న్యూఢిల్లీ, జనవరి 8: ఆస్ట్రేలియాపై 71ఏళ్ల చరిత్రలో 2-1తో టెస్టు సిరీస్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ నగదు అవార్డులు ప్రకటిస్తున్నట్లు మంగళవారం పేర్కొంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ, జట్టు సభ్యులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపింది. మ్యాచ్‌కు 7.5 లక్షల చొప్పున బోనస్ కలిపి ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చెల్లించనుంది. రిజర్వ్ ఆటగాళ్లకు కూడా ఈ నిబంధన వర్తించనుందని స్పష్టం చేసింది. అలాగే కోచ్‌కు రూ.25లక్షలు, సపోర్టింగ్ స్టాఫ్ సైతం బోనస్ అందుకుంటారంది.

భారత్‌కు పాక్ ప్రధాని ఇమ్రాన్ శుభాకాంక్షలు

ఇస్లామాబాద్, జనవరి 8: ఆస్ట్రేలియా గడ్డపై మొదటిసారి టెస్టు సిరీస్ సాధించిన విరాట్ కోహ్లీతో పాటు భారత జట్టును పాక్ ప్రధాని, మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 71 ఏళ్ల చరిత్రలో ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఆసియా ఖండంలోని జట్లలో భారత్ మాత్రమే ఆస్ట్రేలియా 2-1తో ఓడించిన విషయం తెలిసిందే.

భారత్‌లోనే ఐపీఎల్

- మార్చి 23 నుంచి ప్రారంభం
- స్పష్టం చేసిన సీఓఏ



న్యూఢిల్లీ, జనవరి 8: జనరల్ ఎలక్షన్ దృష్ట్యా ఎలాంటి ఇబ్బంది లేకుండా భారత్‌లోనే ఐపీఎల్ నిర్వహిస్తామని సీఓఏ (కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్) స్పష్టం చేసింది. వీలైనంత త్వరగా మార్చి 23 నుంచే ఐపీఎల్ ప్రారంభిస్తామని మంగళవారం పేర్కొంది. దీనిపై సీఓఏ సభ్యులైన కంప్రైసింగ్ చైర్మన్ వినోద్ రాయ్, మహిళా జట్టు మాజీ క్రీడాకారిణి డైనా ఎ డుల్జి చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల అధికారులతో చర్చించిన తర్వాత ఐపీఎల్ 12వ ఎడిషన్‌ను భారత్‌లోనే నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రకటనపై బీసీసీఐ నిర్ణయం తర్వాత పూర్తి షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు.

ఆగని సూచీల పరుగు

- మూడో రోజూ 130 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- బ్యాంకింగ్ షేర్లకూ ఊతం



ముంబయి, జనవరి 8: ఈక్విటీలు వరుసగా మూడోరోజూ లాభాల బాట పట్టాయి. బ్యాంకింగ్ రంగంలో మంగళవారం చివరి గంటల్లో పెద్ద యెత్తున వాటాల కొనుగోళ్లు జరగడంతోబాటు, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూలత నేపథ్యంలో సరికొత్త విదేశీ పెట్టుబడుల వెల్లువ కొనసాగింది. ఈ క్రమంలో బీఎస్ఈ సెన్సెక్స్ 130 పాయింట్లు ఎగబాకి 35,980 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 30.35 పాయింట్లు లాభపడి 10,802.15 వద్ద ముగిసింది. ఐతే రోజులో చాలాభాగం రెండు సూచీలూ వ్యతిరేకత వాతావరణంలోనే సాగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతోబాటు, అమెరికన్ డాలర్‌తో రూపాయి విలువ బలహీన పడటం, అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడంతో తొలుత భారత మార్కెట్లపై ఈ ప్రభావం పడింది. దీంతో నష్టాలను చవిచూసిన సూచీలు ఆ తర్వాత కోలుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 36,037.35 అత్యధిక పాయింట్ల మార్కును అందుకుంది. తర్వాత 0.36 శాతం లాభాలతో 35,980.93 వద్ద స్థిరపడింది. కాగా గత రెండు నేరు సెషన్లలో సూచీలు పరుగులు పెట్టి 336.45 పాయింట్లు లాభపడ్డాయి. యాభై షేర్ల నిఫ్టీ సైతం 0.28 శాతం లాభాలను సంతరించుకుంది. ఇంట్రాడేలో 10,733.25కు తగ్గినప్పటికీ తర్వాత కోలుకుని 10,818.45 వద్ద లాభాలతోనే ముగిసింది. ఇలావుండగా బ్యాంకింగ్ రంగం పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆర్బీఐ గవర్నర్ సోమవారం చేసిన వ్యాఖ్యలు మార్కెట్లో బ్యాంకింగ్ వాటాలకు ఊతమిచ్చాయని బీఎన్‌పీ ప్రభాస్ నేతృత్వంలోని షరేఖాన్ సంస్థ సలహా విభాగం అధిపతి హేమాంగ్ జానీ విశ్లేషించారు. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు తగ్గించేందుకు నిర్ధిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు ఆర్బీఐ గవర్నర్ ప్రకటించడం సైతం సానుకూలతలకు దోహదం చేసిందని ఆయన చెప్పారు. బాండ్లకు సంబంధించిన రాబడులపై సైతం సంస్కరణలు చేపట్టడం బ్యాంకు మూల నిధికి ఊతం ఇచ్చేదిగా ఉందన్నారు. మూలధన నిల్వలు పెరిగేలా నిధులు సమకూర్చే చర్యలు, నిరర్థక ఆస్తులపై నిర్ధిష్టమైన చర్యలు తదితర అంశాలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు సానుకూల అంశాలుగా మారాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం అధిపతి వినోద్ నాయర్ తెలిపారు. ఐతే ప్రస్తుతం చైనా- అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్యపరమైన చర్చలు, కార్పొరేట్ రంగంలో లాభాల నేపథ్యంలో మదుపర్లు కొంత ఆచితూచి అడుగులు వేస్తున్నారని ఆయన చెప్పారు. ఇలావుండగా గడచిన త్రైమాసికంలో బ్లూచిప్ కంపెనీల నుంచి వచ్చిన లాభాలను మంగళవారం మదుపర్లు వెనక్కు తీసుకున్నారు. ప్రత్యేకించి టీసీఎస్, ఇన్ఫోసిస్‌ల నుంచి వచ్చే వారం రోజుల తర్వాత పెట్టుబడులు వెనక్కు తీసుకునే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి విలువ గణనీయంగా తగ్గడం (డాలర్‌తో రూ.70కు) ఇందుకు దోహదం చేయవచ్చని అంటున్నారు. 2018-19 జాతీయ ఆదాయంపై కేంద్ర గణాంకాల కార్యాలయం ముందస్తు అంచనాలు మాత్రం సానుకూలంగా ఉన్నాయి. దేశీయ ఆర్థిక వృద్ధి 7.2 శాతం ఉంటుందని ఆ గణాంకాలు పేర్కొంటున్నాయి. వ్యవసాయం, తయారీ రంగాల్లో జరిగిన ప్రగతి కారణంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 6.7 శాతం ఆర్థికాభివృద్ధి జరిగిందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) వెల్లడించింది.

అధిక లాభాల్లో సన్‌ఫార్మా

కాగా మంగళవారం సెన్సెక్స్‌లో అధిక లాభాలు సంతరించుకున్న సంస్థగా సన్ ఫార్మా నిలిచింది. మొత్తం 3.98 శాతం లాభాలను ఈ సంస్థ ఆర్జించింది. తర్వాతి స్థానంలో 3.46 శాతం లాభాలతోప్రైవేటు బ్యాంకు ఐసీఐసీఐ నిలిచింది. కాగా జెఎల్ఆర్ ఇంగ్లాండ్ అమ్మకాలు గణనీయంగా జరగాయన్న వార్తల నేపథ్యంలో టాటా మోటార్స్ షేర్లు సైతం 2.34శాతం లాభాలను సంతరించుకున్నాయి. అలాగే ఎస్‌బీఐ, యెస్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, బజాజ్ ఆటో, ఇండస్ ఇండ్ బ్యాంకు సైతం 3.18 శాతం లాభాలను కూడగట్టాయి. ఇక కోటక్ బ్యాంకు, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీల షేర్లు మాత్రం 1.41 శాతం నష్టాలను చవిచూశాయి. కాగా విలీన ప్రతిపాదనల నేపథ్యంలో గృహ ఫైనాన్స్, బంధన్ బ్యాంకు షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇప్పటికే నష్టాలను మూటగట్టుకున్న ఈ సంస్థలు తాజాగా 16.39 శాతం నష్టాలు చవిచూశాయి.

రూ.736.18 కోట్ల విదేశీ పెట్టుబడులు

కాగా దేశీయ మదుపర్లు 141.97 కోట్ల రూపాయల విలువైన షేర్లను మంగళవారం విక్రయించినప్పటికీ విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మాత్రం 736.18 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు.

వాణిజ్యభూమి

బ్యాంకుల లావాదేవీలకు ఆటంకం

- సార్వత్రిక సమ్మె ప్రభావం



న్యూఢిల్లీ, జనవరి 8: పది కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జరిగిన సార్వత్రిక సమ్మె కారణంగా బ్యాంకుల లావాదేవీలకు పాక్షికంగా ఆటంకం ఏర్పడింది. రెండు రోజుల సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్ఐ) మద్దతు ప్రకటించాయి. బ్యాంకుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ సంఘాల ప్రభావం రోజువారీ విధులపై పడింది. ఐతే మిగతా సంఘాలు ఈ సమ్మెలో పాల్గొనకపోవడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తోబాటు ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం యథావిధిగా పనిచేశాయి. కాగా సార్వత్రిక సమ్మె కారణంగా బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, విత్‌డ్రా, చెక్ క్లియరెన్స్ వంటి కౌంటర్ లావాదేవీలకు అనేక బ్యాంకుల్లో ఆటంకం కలిగింది. ఐతే అధికారులు మాత్రం అన్ని బ్యాంకుల్లో విధుల్లో పాల్గొన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడాతో విజయా, దేనా బ్యాంకులను విలీనం చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత డిసెంబర్ 26న తొమ్మిది బ్యాంకు ఉద్యోగ సంఘాల నేతృత్వంలో ఒక రోజు సమ్మె జరిగిన సంగతి తెలిసిందే.

అలాగే అఖిల భాతర బ్యాంకు అధికారుల కాన్ఫిడరేషన్ (ఏఐబీఓసీ) సైతం డిసెంబర్ 21న ఒక రోజు సమ్మె చేపట్టడం జరిగింది. ఇలావుండగా ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇందువల్ల ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు ఉపాధి కోల్పోవడంతోబాటు, భవిష్యత్తులో కూడా ఉద్యోగావశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐడీబీఐ వంటి వాటిని ప్రైవేటీకరించాలన్న ఆలోచన సరైందికాదని అన్నారు. కాగా బుధవారం కూడా సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో జరిగే అసౌకర్యంపై ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ తమ ఖాతాదారులకు ఇప్పటికే అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఎరువులు, పెట్రోకెమికల్స్ పరిశ్రమల్లో
భారత్ పెట్టుబడులకు ఇరాన్ ఆహ్వానం

న్యూఢిల్లీ, జనవరి 8: భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా యూరియా, పెట్రోకెమికల్స్ పరిశ్రమల్లో పెట్టుబడులను ఇరాన్ ఆహ్వానించింది. ఎరువులను తమ దేశ ప్రజలకు న్యాయమైన ధరలకు అందించేందుకు ఇరాన్ కృషి చేస్తోందని, ఇందులో భాగంగా భారతీయ పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆ దేశం ఆహ్వానించిందని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి మొహమ్మద్ జావేద్ జారిఫ్ తెలిపారు. మంగళవారం నాడిక్కడ ఆయన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై చర్చలు జరిపిన అరంతరం విలేఖరులతో మాట్లాడారు. తమ దేశంలోని చాబహార్ ప్రాంతంలో ఎరువులు, పెట్రోకెమికల్స్ పరిశ్రమల్లో పెట్టుబడులకు భారత్ పెట్టవచ్చని జారిఫ్ తెలిపారు. దీర్ఘకాలంగా భారత్ ఇరానియన్ యూరియా ఎరువులకు వినియోగదారుగా ఉంటున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అమెరికా అనుచిత ఆంక్షల కారణంగా భారత వినియూగదారులు, రైతులు 38 శాతం అదనంగా ధరలు పెట్టి ఎరువులు కొనుగోలు చేయాల్సివస్తోందని, ఈ సమస్యను అధిగమించి న్యాయమైన ధరలకు భారతీయ రైతులకు ఎరువులు అందించాలని భావిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి తెలిపారు. యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య కార్యక్రమాలు నెమ్మదించాయని, ఈ క్రమంలోనే భారత్, చైనా, రష్యాలాంటి సాంస్కృతిక భాగస్వాములతో బంధం బలోపేతం చేసుకునేందుకు ఇరాన్ కృషి చేస్తోందని ఆయన చెప్పారు. ఇందులో తమదేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. టెహ్రాన్‌కు మంజూర్ల విషయంలో అమెరికా ఆంక్షలు కొనసాగుతున్న క్రమంలో యూరోపియన్‌తో బంధాల విషయంలో వేచిచూడ కూడదని నిర్ణయించామన్నారు. 2015లో టెహ్రాన్‌తో జరిగిన అణు చర్చల నేపథ్యంలో అమెరికా యూరోపియన్ దేశాలపై ఆంక్షలు విధించిన విషయాన్ని జారిఫ్ గుర్తు చేస్తూ ప్రస్తుతం తిరిగి తమ దేశంతో వాణిజ్య సంబంధాలపై యూరోపియన్ దేశాలు చెల్లింపుల విషయంలో సరికొత్త ప్రణాళికలు రూపొందించుకునే విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయని ఆయన చెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీల్లో ఇరాన్ బ్యాంకులకు కోత విధించాలని, చమురు ఎగుమతులు తగ్గించివేయాలని అమెరికా భావిస్తోందని ఆయన చెప్పారు. కాగా భారత్-ఇరాన్ దేశాలు అవసరాల అనుగుణంగా పరస్పర సహకారం కొనసాగిస్తాయని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,128.00	1 గ్రాము:	రూ. 3,037.00
8 గ్రాములు:	రూ.25,024.00	8 గ్రాములు:	రూ. 24,296.00
10 గ్రాములు:	రూ. 31,280.00	10 గ్రాములు:	రూ. 30,370.00
100 గ్రాములు:	రూ.3,12,800.00	100 గ్రాములు:	రూ. 3,03,700.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,345.455	1 గ్రాము:	రూ. 3,248.128
8 గ్రాములు:	రూ. 26,763.64	8 గ్రాములు:	రూ. 25,985.024
10 గ్రాములు:	రూ. 33,454.55	10 గ్రాములు:	రూ. 32,481.28
100 గ్రాములు:	రూ. 3,34,545.5	100 గ్రాములు:	రూ. 3,24,812.8
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.60	8 గ్రాములు:	రూ. 331.60
10 గ్రాములు:	రూ. 414.50	10 గ్రాములు:	రూ. 414.50
100 గ్రాములు:	రూ. 4,145.00	100 గ్రాములు:	రూ. 4,145.00
ఒక కిలో:	రూ. 41,450.00	ఒక కిలో:	రూ. 41,450.00

ఐఎంఎఫ్ చీఫ్ ఎకానమిస్ట్‌గా గీతాగోపీనాథ్

- ఈ పదవి చేపట్టిన తొలి మహిళ



వాషిగ్టన్, జనవరి 8: అంతర్జాతీయ మానిటరీ ఫండ్ చీఫ్ ఎకానమిస్ట్‌గా ప్రఖ్యాత భారత-అమెరికన్ ఆర్థిక శాస్త్రవేత్త గీతా గోపీనాథ్ బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రతిష్టాత్మక ఆర్థిక సంస్థలో ఈ అత్యున్నత స్థానాన్ని చేపట్టిన తొలి మహిళ ఈమే కావడం గమనార్హం. ఈ నలభై ఏడేళ్ల ఇండో అమెరికన్ గత వారం బాధ్యతలు స్వీకరించారు. ప్రపంచీకరణ వల్ల తలెత్తిన సమస్యలను పరిష్కరించే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె భావిస్తున్నారు. బహుళార్థ సాధక సంస్థలకు ప్రపంచీకరణ కారణంగా కొన్ని సవాళ్లు ఎదురయ్యాయని ఆమె భావిస్తున్నారు. హార్వర్డ్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్, అమెరికా పౌరుడు జాన్ జ్వాన్‌స్ట్రా గతంలో ఈ పదవిలో ఉండి గత డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. కాగా ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టినె లాగ్రేడ్ మంగళవారం గీతా గోపీనాథ్ నియామకాన్ని ప్రకటిస్తూ అత్యున్నత విద్యార్హతలతోబాటు, విశిష్ట ఆర్థిక శాస్త్ర నిపుణత కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. కాగా ఐఎంఎఫ్ 11వ చీఫ్ ఎకానమిస్ట్‌గా గీతా గోపీనాథ్ బాధ్యతలు చేపట్టారు. ఆమె కర్నాటక రాష్ట్ర మైసూరులో జన్మించారు. ఆమె నియామకం ఓ అద్భుతమని హార్వర్డ్ విశ్వవిద్యాలయ గెజిట్ ప్రశంసల వర్షం కురిపించింది.



నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

అయ్యప్ప స్వాములకు కన్నీటి వీడ్కోలు

❄ జనసంద్రమైన నర్సాపూర్

నర్సాపూర్, జనవరి 8: తమిళనాడు రాష్ట్రం పుదుకొట్టై సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ అయ్యప్పస్వాముల అంతిమయాత్ర అద్యంతం శోకాతప్త హృదయాలతో నర్సాపూర్‌లో కొనసాగింది. అయ్యప్ప సామి దర్శనార్థం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన స్వాములు ఈనెల 3న బయ ల్దేరి మాలధారులై వెళ్లిన సంగతి తెలిసిందే.. అయితే, తిరుగు ప్రయాణంలో ఈనెల 6న మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో మత్యువు రూపంలో వచ్చిన కంటైనర్ ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. మూడు రోజులుగా శవాల కోసం నిద్రాహారాలు విడిచి కళ్లు కాయలు కాచే విధంగా వేచి ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చనివారంటూ లేరు. మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రజలు వేయి కళ్లతో ఎప్పుడు వారిని చూస్తామో అంటూ మృతుల ఇళ్ల వద్దనే ఉంటున్నారు. మంగళవారం ఎట్టకేలకు తమ పిల్లల మృతదేహాలు వస్తాయని తెలుసుకొని ఉదయం నుంచి మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు నర్సాపూర్‌లోని ప్రధాన వీధుల్లో వేచి ఉన్నారు. సాయంత్రం 5.30లకు నర్సాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు అంబులెన్స్ వాహనాలు చేరుకోవడంతో ఒక్కసారిగా మృతుల కుటుంబాలు, బంధువులు, స్నేహితులను అపడం ఎవరితరం కాలేదు. మృతులకు పెద్ద ఎత్తున నివాళులర్పిస్తూ అమర్ హై అంటూ నినాదాలు చేస్తూ అంబులెన్స్‌లపైకి పూలదండలు విసిరారు. కాజీపేటకు చెందిన గురుస్వామి కర్రె నాగరాజుగౌడ్, జుర్రు మహేశ్, బోయిని కుమార్‌లకు సంబంధించిన అంబులెన్స్‌లను తరలించగా, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క ఆంజనేయులు, అంబర్‌పేట కృష్ణగౌడ్, మంతూర్ గ్రామానికి చెందిన అయ్యన్నగారి శ్యాం, శివప్రసాద్, చిన్నచింతకుంట గ్రామానికి చెందిన జనుముల సురేష్ మృతదేహాలతో ఉన్న అంబులెన్స్ వాహనాలు తరలివెళ్లగా, మెదక్ మండలానికి చెందిన ప్రవీన్‌గౌడ్ మృతదేహంతో ఉన్న వాహనం మెదక్‌కు తరలించారు. డ్రైవర్ సురేష్ మృతదేహంతో ఉన్న అంబులెన్స్ వాహనం హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు.

అంతిమయాత్రలో ప్రముఖులు

నర్సాపూర్‌లో జరిగిన అయ్యప్పస్వాముల అంతిమయాత్రలో మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రాజమణి, మాజీ మంత్రి వాకిటి సునీతారెడ్డి, జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ నరేష్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు మురళీయాదవ్ పాల్గొన్నారు.



తిరుమల అన్నమయ్య భవన్‌లో మంగళవారం బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేఖరులకు వివరిస్తున్న టీటీడీ ఇఓ సింఘాల్, చైర్మన్ సుధాకర్ యాదవ్ తదితరులు

భక్తుల సౌకర్యాలు, భద్రతపై దృష్టి

❄ అలిపిరి వద్ద రూ. 67.29 కోట్లతో వసతి నిర్మాణానికి టెండర్లు ఖరారు

❄ రూ. 15.79 కోట్లతో 1050 సీసీ కెమెరాల ఏర్పాటు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 8: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి సౌకర్యాలు, భద్రతకు సంబంధించి ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని, ఇందులో భాగంగా తిరుపతి అలిపిరి వద్ద టీటీడీ నిర్మించనున్న వసతి సముదాయంలో మొదటి బ్లాక్‌లో రూ. 67.29 కోట్లతో నిర్మించనున్న 384 గదుల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశామని, రూ. 15.79కోట్లతో తిరుమలలో 1050 సీసీ కెమేరాలను 2వ దశలో ఏర్పాటుచేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ వెల్లడించారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో పుట్టా సుధాకర్‌యాదవ్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యనిర్ణయాలను చైర్మన్ విలేఖరులకు వివరించారు. అమరావతిలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాలమండపం, వాహనమండపం, రథమండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణిని నిర్మించేందుకు రూ.27.29 కోట్ల నిధులు మంజూరుచేశామని, ఇందుకు సంబంధించి టెండర్లు కూడా ఖరారుచేశామన్నారు. ఈనెల 31న ఆలయ నిర్మాణానికి భూకర్షణ జరుగుతుందన్నారు. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంవద్ద రూ.2.27 కోట్లతో కల్యాణమండపాన్ని నిర్మించనున్నామని, అలాగే పలమనేరులో దేశవాళీగో సంపదను వృద్ధిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంలో గదులకు సంబందించి అద్దెను బోర్డు మీటింగ్‌లో ఖరారు చేశామన్నారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.2.90 కోట్లతోనూ, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో రూ.2.86కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో రూ.2.99కోట్లతో ఆలయాల నిర్మాణానికి టెండర్లను ఖరారు చేశామన్నారు.

ఆగమ సలహాదారుడిగా ఎ.అనంతశయన దీక్షితులు

శ్రీవారి ఆలయ ఆగమసలహాదారుగా పనిచేస్తున్న వేదాంతం దేశికాచార్యుల స్థానంలో ఎ.అనంతశయన దీక్షితులను నియమిస్తూ ధర్మకర్తల మండలి సమావేశం నిర్ణయం తీసుకుందని చైర్మన్ పుట్టాసుధాకర్‌యాదవ్ రెండేళ్లకాలంపాటు అనంతశయనం ఆగమసలహాదారుగా తన సేవలు అందించనున్నారని తెలిపారు.

31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూకర్షణ

టీటీడీ ఇఓ సింఘాల్ మాట్లాడుతూ అమరావతిలో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయానికి ఈనెల 31వ తేదీన ఉదయం 9.10 నుంచి 9.40 గంటల మధ్య ఆగమోక్తంగా భూకర్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ ఈ ఓ ఏకే సింఘాల్ తెలిపారు. అమరావతిలో ఆలయానికి జరుగనున్న భూకర్షణ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడువిచ్చేస్తారన్నారు.

Printed and Published by **T. Venkateswarlu** on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor **T.V.Ravi Reddy,** PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

ఎన్‌టీఆర్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా రావాలి

❄ ఆయన తండ్రే కాదు.. గురువు, దైవం కూడా ❄ ఆ పాత్ర ద్వారా నాన్న రుణం తీర్చుకున్నా ❄ బాలకృష్ణ

ఆంధ్రభూమిబ్యూరో

తిరుపతి, జనవరి 8: ఎన్‌టీఆర్ జీవిత చరిత్ర భావితరాలకు తెలిపే విధంగా పాఠ్యాంశాలుగా తీసుకురావాలని, ఎన్‌టీఆర్ తనకు తండ్రే కాదని... గురువు... దైవమని, ఎన్‌టీఆర్ పాత్రను పోషించడం ద్వారా నాన్న రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని ఎన్‌టీఆర్ జీవిత చరిత్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. 'ఎన్‌టీఆర్ కథానాయకుడు' చిత్రం బుధవారం విడుదల కానున్న నేపథ్యంలో ఆ చిత్రంలో ఎన్‌టీఆర్ పాత్రను పోషించిన బాలకృష్ణతో పాటు కథానాయకి విద్యాబాలన్, సహనటులు సుమంత్, కళ్యాణ్‌రామ్‌లతో కూడుకున్న బృందం మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని విరామ సమయంలో దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 10గంటల సమయంలో తిరుపతి పీ జీ ఆర్ థియేటర్‌లో చిత్రం టీజర్‌ను ఆ బృందం వీక్షించింది. ఈ సందర్భంగా బాలయ్య అభిమానులు పెద్ద ఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. ముందుగా తిరుమల, తిరుపతిలో బాలకృష్ణ విలేఖరులతో మాట్లాడారు. ఎన్‌టీఆర్ బయోపిక్‌లో నటించే అవకాశం వచ్చినందుకు వెంకన్నకు కృతజ్ఞతలు తెలియజేశానన్నారు. ఆ చిత్రాన్ని విజయవంతం చేయాలని, తెలుగు ప్రజలు ఎక్కడున్నా సుఖసంతోషాలతో విరాజిల్లాలని దేవుడ్ని ప్రార్థించానన్నారు. ఎన్‌టీఆర్ నటించిన పౌరాణిక, సాంఘిక, చారిత్రాత్మక, జానపద చిత్రాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటిల్లో కొన్నింటిలో తాను నటించానని, ప్రజలు కూడా ఆదరిస్తున్నారన్నారు. అయితే ఎన్ టీ ఆర్ పాత్రను పోషిస్తానని తాను అనుకోలేదన్నారు. ఆ అవకాశం రావడం ఒక మహద్భాగ్యం అన్నారు. ఎన్ టీ ఆర్ జీవితచరిత్రను కథానాయకుడు, మహానాయకుడుగా రెండు భాగాలుగా తీస్తున్నామన్నారు. మొదటి భాగం ఎన్‌టీఆర్, ఆయన సతీమణి, తన తల్లి బసవతారకం మధ్య జరిగే చక్కటి జీవన వైవిధ్యాన్ని వెండితెరపై చూపిస్తామన్నారు. తెలుగు అనే పదాన్ని వింటే ఎంత ఒళ్లు పులకరిస్తుందో, ఎన్ టీ ఆర్ అనే మూడు అక్షరాల మాట వింటే తెలుగు ప్రజలు అలా పులకరిస్తారన్నారు. ఎన్ టీ ఆర్ ఒక మహానటుడన్నారు. ఆయన జీవితచరిత్రను భావితరాలకు అందించే విధంగా పాఠ్యాంశాలు రావాలన్నారు. ఎన్ టీ ఆర్ జీవితచరిత్రను ఐదు భాగాలుగా తీసినా సరిపోదన్నారు. అయితే ఎన్ టీ ఆర్ జీవిత చరిత్ర ఏమేరకు ప్రజలకు అవసరమో అంతవరకే చిత్రం రూపొందించామన్నారు. ఇందుకు సంబంధించి రెండవ భాగం మహానాయకుడు పేరుతో తీస్తామన్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో దసరా సమయంలోనే విడుదల చేసి రెండవభాగాన్ని తరువాత తీద్దామని అనుకున్నామన్నారు. అయితే ఎన్ టీ ఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసింది జనవరి 9 కావడంతో అదే రోజున విడుదల కావాలని అందరు కోరడంతో ఆ చిత్రాన్ని ఇప్పుడు విడుదల చేయిస్తున్నామన్నారు. ఎన్‌టీఆర్ సినీరంగ ప్రవేశం చేసి సమాజానికి సంబంధించిన ఎన్నో పాత్రలను పోషించారని, అంతకుమించి పౌరాణికంలో దేవుడి వేషధారణల నుండి పురాణ కథలకు సంబంధించిన అనేక పాత్రలను ఆయన పోషించారన్నారు. దీంతో ఎన్ టీ ఆర్ ప్రజల్లో కారణజన్ముడుగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన జీవితం నవరసాలతో కూడుకున్న ప్రయాణమన్నారు. తల్లి రుణం తీర్చుకునే విధంగా రాష్ట్రంలో బసవతారక కాన్సర్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి తాను చైర్మన్‌గా ఎంతో మంది పేదలకు సేవలందిస్తున్నామన్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రాన్ని తీసి తల్లి రుణం కొంతవరకు తీర్చుకున్నానన్నారు. అయితే తండ్రి రుణం తీర్చుకునే అవకాశం ఎన్ టీ ఆర్ బయోపిక్ ద్వారా తనకు లభించడం మహద్భాగ్యం అన్నారు. ప్రపంచంలో ఏ కొడుక్కు కూడా తన తండ్రి పాత్రను పోషించే అవకాశం వచ్చి ఉండదేమోనని, అది తనకు లభించిందన్నారు. దానవీరశూరకర్ణలో ఎన్ టీ ఆర్ దుర్యోధనుడు, అర్జునుడు, కర్ణుడు పాత్రలను పోషించాడని, 4.15గంటల నిడివి కలిగిన ఈ చిత్రంలో ఆద్యంతం ఎన్ టీ ఆర్ కనపడుతాడన్నారు. ఎన్ టీ ఆర్ బయోపిక్ 2.50గంటల నిడివితో రూపొందించామన్నారు. ఎన్ టీ ఆర్ సతీమణి, తన తల్లి పాత్రను విద్యాబాలన్ ఎంతో చక్కగా నటించిందన్నారు. ఎన్ టీ ఆర్‌కు వారసుడుగానే కాకుండా ఆయనలోని క్రమశిక్షణ, ఆవేశం, ఆలోచనలను కూడా ఎంతో కొంత తాను పొందగలగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్ టీ ఆర్ సమకాలీన నటుడు ఏ ఎన్ ఆర్ పాత్రను సుమంత్ ఎంతో చక్కగా పోషించారన్నారు. సంగీత దర్శకులు కీరవాణి కూడా అద్భుతమైన సంగీతాన్ని అందించారన్నారు. ఈ సినిమాలో బాలకృష్ణ పాత్ర ఎవరు పోషించారో సస్పెన్స్ అని అన్నారు. ఎన్టీఆర్ బయోపిక్ రెండవభాగం కూడా దాదాపు పూర్తి కావచ్చిందని పదిరోజులు షూటింగ్ మిగిలి ఉందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏది ఏమైనా ఎన్ టీ ఆర్ బయోపిక్ ఒక చరిత్ర సృష్టిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కథానాయకి విద్యాబాలన్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌గా బాలకృష్ణ నటన అద్భుతంగా ఉందని, ఈ చిత్రం తప్పకుండా గొప్ప విజయం సాధిస్తుందన్నారు. నటులు సుమంత్, కళ్యాణ్‌రామ్ ఈ చిత్రంలో తమకు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు.



తిరుపతి పీ జీ ఆర్ థియేటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బాలకృష్ణ, కళ్యాణ్ రామ్, నటి విద్యాబాలన్ తదితరులు

ముఖాకృతిని బట్టి కనుబొమ్మలు



ముఖానికి అందం కళ్లు. అందం అంతా కళ్లలోనే ఉంటుంది. ముఖానికి ఒక తీరైన అందాన్ని ఇచ్చేవి కనుబొమ్మలు. అందానికి చాలా ప్రాధాన్యతనిచ్చే మహిళలు కనుబొమ్మల విషయంలో అంతగా పట్టించుకోరు. ఏదో ఒక షేప్ చేయించుకుంటుంటారు. కానీ ఎలా చేస్తే తమ ముఖానికి నప్పుతాయో ఆలోచించరు. ముఖాకృతి తీరు కనుబొమ్మలను ఏ షేప్ చేయించుకుంటే బావుంటుందో చూద్దాం. నుదురు చిన్నగా ఉన్నవారు కనుబొమ్మలు కొంచెం వంపు తిరిగి ఉంటే బాగుంటుంది. నుదురు విశాలంగా ఉన్నవారికి కనుబొమ్మలు బాగా వంపు తిరిగి ఉండాలి. గుండ్రటి ముఖం ఉన్నవారికి కొద్దిపాటి కోణంతో వంపు తిరిగిన కనుబొమ్మలు నప్పుతాయి. చతురస్రాకారపు ముఖం కలవారు మాంగ్యులర్ ఐబ్రోస్ ఉంటే బాగుంటుంది. కోలముఖం ఉంటే కనుబొమ్మలు స్ట్రెయిట్‌గా ఉండాలి. త్రికోణాకారపు ముఖానికి కనుబొమ్మలు వంపు తిరిగి ఉంటే బాగుంటుంది.

శారీరక బలానికి యోగ

దైనందిన జీవితంలో శారీరక బలాన్ని ఉపయోగించాల్సి రావడం, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి రావడం సర్వ సాధారణం. యోగా శారీరక బలాన్ని పెంచడానికి, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుంది. ఆత్మస్థైర్యానికి శరీరాకృతి, అంతర్గత శక్తి చేసే సహాయం అంతా ఇంతా కాదు. ఈ రెండు విషయాలు దైనందిక జీవనంలో ప్రతి అంశంపై సానుకూల, ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటాయి. శారీరక బలం లేని వ్యక్తి అనేక ఆరోగ్య, మానసిక సమస్యలను ఎదుర్కోక తప్పదు. ముఖ్యంగా నరాల అస్థిరత, నరాల బలహీనత, బలహీన రోగనిరోధక వ్యవస్థ, డీ హైడ్రేషన్, రక్తపోటు వంటి వాటితో పాటు హార్మోనుల అసమతుల్యం వంటి దారుణమైన పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి ఎటువంటి శారీరక అసాధారణ స్థితులను, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఎదురవుతున్నాయని అనిపించినప్పుడు జీవనశైలిలో మార్పులు తీసుకురావాలి. ముఖ్యంగా ఆహార ప్రణాళిక, వ్యాయామం తప్పనిసరి. బలహీనతను నివారించడానికి, మానసికంగా, శారీరికంగా నూతనోత్తేజం పెంచుకోవడానికి యోగాభ్యాసం సహజమైన, ఆచరణాత్మకమైన మార్గంగా ఉంటుంది. ఇది శరీరంలోని భౌతిక, మానసిక స్థితిగతులను క్రమబద్ధీకరించడానికి అద్భుతంగా పనిచేస్తుంది. రోజులో కనీసం అరగంట నుండి గంట సమయం యోగాసనాలకు కేటాయించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను పొందగలరని నిపుణుల అభిప్రాయం. యోగాలో కొన్ని ఆధ్యాత్మిక ధోరణి కలిగినవి కూడా ఉన్నాయి. ఇది క్రమంగా శరీరంలోని విస్తృత శ్రేణి కండరాలను, కీళ్ళను బలపరచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మానసిక స్థితిగతులను చక్కదిద్దేక్రమంలో యోగా ఎంతగానో సహాయపడుతుంది. శారీరక, మానసిక బలానికి అత్యంత దోహదం చేసే ఉత్తమమైన ఆసనాలు ఉన్నాయి. ఇవి దృఢమైన శరీరాకృతిని అందించడమే కాదు, మానసిక బలాన్ని కూడా అందిస్తాయి. మరి ఆ యోగాసనాలేంటో చూద్దామా..!

పాదహస్తాసన

ఈ యోగాసనం శరీర, ఉదర కండరాలను బలపరుస్తుంది. అంతేకాదు కడుపు చుట్టూ ఉన్న కొవ్వును అంటే బెల్లీ ఫాట్‌ను కూడా తగ్గిస్తుంది. ఈ వ్యాయామం చేసే ముందు నిటారుగా నిలబడాలి. తరువాత ఊపిరి పీలుస్తూ చేతుల్ని నెమ్మదిగా పైకి ఎత్తాలి. తరువాత కిందికి వంగుతూ ఊపిరి వదలాలి. ఈ క్రమంలో నుదురును మోకాలలి వద్దకు తీసుకురావడానికి ప్రయత్నించాలి. అలాగే చేతులు నేలను తాకేలా లేదా కనీసం కాలి బొటనువేలును తాకడానికైనా ప్రయత్నించాలి. లేదా చీలమండను పట్టుకోవడానికైనా ప్రయత్నించవచ్చు. ఇలా కొన్ని సెకండ్ల పాటు ఉండి తిరిగి యథాస్థితికి చేరుకోవాలి.

భుజంగాసనం

వెన్నునొప్పి నుండి ఉపశమనం కలిగించడానికి, వెన్నెముక దృఢంగా మారడానికి ఈ ఆసనం బాగా ఉపయోగపడుతుంది. ఈ ఆసనం వేయాలనుకుంటే ముందుగా బోర్లా పడుకుని పొత్తికడుపును, గడ్డాన్ని నేలకు ఆనించాలి. తరువాత అరచేతులను నేలపై ఉంచి నెమ్మదిగా పైకి లేవాలి. అంటే బరువంతా పొట్టపై ఉంచి తలను చేతుల ఆధారంగా పైకి లేపాలి. ఈ సమయంలో కాలి బొటనవేళ్ళు నేలకు ఆని ఉండాలి. మొదట ముప్ఫై సెకన్లు ఇలా ఉండాలి. తరువాత నెమ్మదిగా అంటే రోజుకు పది సెకన్ల సమయాన్ని పెంచుకుంటూ మూడు నిముషాల పాటు ఇదే స్థానంలో ఉండి యథాస్థితికి రావలసి ఉంటుంది. ఇలా పలుమార్లు చేయడం ద్వారా ఉత్తమమైన ఫలితాలు ఉంటాయి.

శలభాసన

ఈ ఆసనం వేయడానికి ముందుగా బోర్లా పడుకోవాలి. ఉదరాన్ని, గడ్డాన్ని నేలకు ఆనించాలి. తరువాత చేతులను, భుజాలకు సమాంతరంగా ఉంచాలి. తర్వాత నెమ్మదిగా రెండు కాళ్ళను పిరుదుల మీదుగా పైకి లేపాలి. కాళ్ళు లేపిన తర్వాత నెమ్మదిగా ఊపిరి పీల్చి వదులుతూ ఉండాలి. వీలైతే తలను కూడా లేపి కేవలం ఉదరం నేలకు ఆనించి తల, కాళ్ళు లేపగలగాలి. ఫలితంగా పిరుదుల్లోని కొవ్వు తగ్గిపోయి కటిప్రాంతం ఉత్తమంగా బలపడుతుంది.

గజాసనం


కటి కండరాలు, వెన్నెముక, ఉదర కండరాలను బలపరచడానికి గజాసనాన్ని మించింది లేదు. ఈ ఆసనంలో ముందుగా నిటారుగా నిలబడాలి. తరువాత అరచేతులను జోడించాలి. జోడించిన అరచేతులను పైకెత్తాలి. ఈ సమయంలో ఊపిరిని తీసుకోవాలి. తరువాత జోడించిన అరచేతులను నెమ్మదిగా వంగి మోకాళ్ల మధ్యకు తీసుకురావాలి. ఈ క్రమంలో ఊపిరిని వదలాలి. ఈ యోగాభ్యాసాన్ని ఐదుసార్లనుంచి మొదలుపెట్టి క్రమంగా పెంచుకుంటూ రోజుకు ఇరవైసార్లు చేయడం ద్వారా మంచి ఫలితాలను పొందవచ్చు.

డాల్ఫిన్ ఆసనం

చేతులను బలపరచడానికి ఈ ఆసనం ఉత్తమంగా పనిచేస్తుంది. ముందుగా నిటారుగా నిలబడాలి. తరువాత కాళ్ళను కొద్దిగా ఎడం చేసి నెమ్మదిగా ముందుకు వంగాలి. రెండు మోచేతులను నేలకు ఆనించాలి. ఇది చూడటానికి తిరగబడిన 'వి'లా కనిపిస్తుంది. ఆసనం ప్రారంభించేముందు ఊపిరిని పీల్చుకుని తిరిగి యథాస్థానానికి వచ్చే క్రమంలో నెమ్మదిగా ఊపిరిని వదలాల్సి ఉంటుంది. ఈ ఆసనంలో తల నేలకు దగ్గరగా వస్తుంది కానీ తలను నేలకు తాకించకూడదు. మరో విషయం ఏమిటంటే విలోమ 'వి' భంగిమకు తిరిగి వెళ్లే క్రమంలో ఊపిరిని తీసుకుంటూ ఉండాలి. ఈ ప్రక్రియను మొదట ఐదుసార్లుగా మొదలుపెట్టి.. క్రమంగా పెంచుకుంటూ.. సుమారు పదిహేను సార్ల వరకు చేయడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు.

★














ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా తొలి మహిళ




అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనమిస్ట్‌గా తొలి మహిళ నియమితులయ్యారు. అదీ ఒక భారతీయ మహిళ.. భారతదేశంలోని కర్ణాటకకు చెందిన గీతా గోపీనాథ్‌కు ఆ పదవి దక్కింది. ఐఎంఎఫ్‌లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా గీత ఘనత సాధించారు. గీత కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో డిసెంబర్ 8, 1971లో పుట్టారు. ఆమె తల్లిదండ్రులు టి.వి. గోపీనాథ్, విజయలక్ష్మి. వారిది కేరళ రాష్ట్రం. గీతా గోపీనాథ్ భర్త ఇక్బాల్ సింగ్ దలివాల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్స్‌కు చెందిన సంస్థలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమెకు ఒక కొడుకు.. పేరు రోహిల్. గీత స్కూలు విద్య మైసూరులోని నిర్మలా కాన్వెంట్‌లో చదివారు. యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీలో డిగ్రీ, యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో ఎంఏ చదివాక ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. గీత హార్వర్డ్ యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఐఎంఎఫ్ పరిశోధన విభాగంలో డైరెక్టర్‌గా పనిచేసిన మౌరీ ఆబ్స్టెఫెల్డ్ గత నెల 31న పదవీ విరమణ చేశాక గీతకు చీఫ్ ఎకనమిస్ట్ పదవి దక్కింది. గత ఏడాది అక్టోబర్ ఒకటో తేదీనే గీతా గోపీనాథ్‌ను ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించుకుంటున్నట్లు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే వెల్లడించారు. ఆమె ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఒకరని ఆయన ప్రశంసించారు. గీతాగోపీనాథ్ ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా గీత ఆనందిస్తున్నారు. అలాగే ప్రస్తుత ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంపు వంటివి నేడు పెద్ద సవాళ్లుగా మారాయని, ఫలితంగా బహుళ జాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయని గీత వెల్లడించారు.

రంగవల్లి



చుండూరు తన్మయి
ఎ.ఎస్. రావునగర్,
హైదరాబాద్

16 చుక్కలు, ఎనిమిది వరుసలు
ఎనిమిది వరకు నిలుపు..





రేవతి,
హైదరాబాద్

21 చుక్కలు, ఐదు వరుసలు
ఐదు వరకు నిలుపు..
పిట్టలకు విడిగా ఐదు చుక్కలు
నాలుగు వరుసలు

శ్రీనరసింహ శతకము

సీ. ఇభరాజ వరద ! నిన్నెంత పిల్చినఁగాని
మారుపల్కవదేమి- మౌనితనము
మునిజనార్చిత! నిన్ను మ్రొక్కి వేడినఁ గాని
కనులఁబడవదేమి గడుసుఁ దనము?
చాల దైన్యము నొంది చాటు చొచ్చిన ఁగాని
భాగ్యమియ్యవదేమి ప్రౌఢితనము
స్థిరముగా నీ పాద సేవఁ జేసెదనన్న
దొరకఁ జాలవదేమి -ధూర్తతనము

తే: మోక్షదాయక! ఇటువంటి మూర్ఖజనుని
కష్టపెట్టిన నీకేమి కడుపు నిండు
భూషణ వికాస!శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: గజేంద్రుని రక్షించిన ఓ స్వామీ, నోరారా నిన్ను పిల్చినా మారు పల్కకున్నావు నీకెన్ని దండాలు పెట్టినా కండ్లకగుపించవు ఏమా గడసుదనము? ఎంతో దైన్యంతో నీ మరువు జొచ్చినా భోగభాగ్యాలొసంగవు - ఏమా గొప్పదనము? తెగబడి నీ పాదసేవ చేస్తానన్నా దొరకవు. ఏమా దుర్మార్గం. మోక్షదాతవైన ఓ నరసింహా నావంటి అమాయకున్ని కష్టపడితే నీకు కడుపు నిండుతుందా?



అనంతం

31 -గోపరాజు నాగేశ్వరరావు

వాళ్ళంతా స్థాణువుల్లా నిల్చుండిపోయారు.

''బుస్ బుస్''మంటోన్న శబ్దం లీలగా వినిపించింది.

అపుడు గమనించారు వాళ్ళు-

ప్రక్కనేవున్న గుబురు పొద వెనుక రెండు పెనుబాములు కలుస్తూ, విడిపోతూ- మళ్లీ మళ్లీ కలిసి విడిపోతూ, తోకమీద లేచి క్రింద పడుతూ, మళ్లీ లేస్తూ తుళ్ళింతలు పడుతూ ఆడుకొంటున్నాయి!

రాగ్యా దారి చూపిస్తే, వాళ్ళు పాములకు దూరంగా వెళ్ళారు. హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

గురుడాచలం గుండెవేగంగా కొట్టుకుంటున్నది!

భయంనుంచి తేరుకొందుకు జేబులో నుంచి ఓ విస్కీ బాటిల్ బైటికి తీశాడు. గటగటాకొంత తాగి, రాగ్యాకిచ్చాడు.

రాగ్యా కూడా తాగాడు. కొంచెం మత్తుగా వుంది.

ఆ మత్తులో రాగ్యాగి పెనుబాములతో పాటు చాంద్‌నీ గుర్తొచ్చింది!

గరుడాచలం పరిస్థితి కూడా అలాగే వుంది! అతని మనసు తెరమీద చాంద్‌నీ రూపం కనిపించింది!

ఎంత అందగత్తె చాంద్‌నీ!

దాన్ని అనుభవించందే జీవితం వృథా!

కామకేళిలో నిమగ్నమై స్వేచ్ఛగా ఆనందాలు జుర్రుకున్న ఆ పెనుబాముల్ని వరించిన అదృష్టం తననూ వరిస్తే ఎంత బాగుంటుంది! తనూ చాంద్‌నీ ఆ పెనుబాములకు మల్లేనే పెనవేసుకుపోతే ఎంత హాయిగా వుంటుంది!

అడవి సుమ సౌరభాల్ని మోసుకొచ్చే గాలి తరంగాల్లో, అడవి వెన్నెల్లో, పచ్చిక బయళ్ళ మీద కోర్కెల పరాకాష్టలో తుళ్ళింతలు పడుతూ, అలసిపోయేదాకా, అమర సుఖాలు జుర్రుకుంటే ఎంత ఆనందగా ఉంటుందో!

''యల్దావా సారూ'' అన్నాడు రాగ్యా.

ఆలోచనలకు అంతరాయం కలిగింది.

మనసు తెరమీద నుంచి చాంద్‌నీ చిత్రం చెరిగిపోయింది.

''వెళ్దాం'' అన్నాడు గరుడాచలం.

అంతలో-

వింత పక్షి అరుపు దూరం నుంచి వినిపించింది!

''అదే కలివికోడి' అని పెద్దగా అరిచాడు గరుడాచలం.

అందరూ అటువైపు చూశారు.

''అదేనా'' అనుమానంగా చూస్తూ రాగ్యా అన్నాడు.

''అదే! సందేహం లేదు'' అన్నాడు గరుడాచలం.

''యట్టా సెప్తుంటారు''

''గతంలోనే దాని అరుపులు రికార్డ య్యాయి. చాలాసార్లువిన్నాను''

వాళ్ళు అతన్ని అనుసరించి వెళ్తున్నారు.

గరుడాచలం ఒకచోట ఆగాడు.

నేలమీద కొంత పరిధిలో గుండ్రంగా తిరుగుతూ అణువణువూ పరీక్షగా చూశాడు.

''కలివికోడి జాడలు దొరికాయ్'' అని



''అదేనంటారా సారూ''

''అనుమానం లేదు'' అన్నాడు గరుడాచలం.

''ఇప్పుడేవి సెయ్యాలి''

''నా వెంట నడవండి! నేలమీద జాడలు చూస్తూ ముందుకు వెళ్దాం'' అని గరుడాచలం పరీక్షగా నేలవైపు చూస్తూ నడువసాగాడు.

పెద్దగా అరిచాడు.

రాగ్యా, సెక్యూరిటీ సిబ్బంది ఆసక్తి అణచుకోలేక, వాళ్ళూ ముందుకు వంగి నేలను చూసారు.

నిజమే!

అన్నిపక్షుల పాదముద్రలకు భిన్నంగా అక్కడి నేలమీద పాద ముద్రలు కనిపించాయి.

గరుడాచలం చెప్పింది నిజమన్న నిర్ధారణకొచ్చారు.

⁂

కలివికోడి అడుగుజాడల్ని బట్టి, అవ్వి సంచరిస్తున్న ప్రాంతాల్ని గుర్తించాడు. ఏఏ ప్రాంతాల్ని కలుపుతూ ముళ్ళ కంచె వేసి రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలో నిర్ణయమైంది.

ప్రాజెక్టు రిపోర్టు జిల్లా కలెక్టరుకు అందించటానికి ప్రొద్దున్నే ఎమ్మెల్యే వెళ్లాడు.

గుడారాల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది!

గరుడాచలం ఆనందం అంతా యింతా కాదు..

రెండు చేతులతో రాగ్యా భుజాలు పట్టుకొని కదుపుతూ ''రాగ్యా! నీ సహకారంతోనే సాధించగల్గాను! రాబోయే కీర్తిప్రతిష్ఠలకు కారణం నువ్వే! ఏం చేసి నీ రుణం తీర్చుకోగలనూ'' అని అని అభినందిస్తూ ఆనందాతిరేకంతో పొంగిపోయాడు గరుడాచలం!

రాగ్యా ఆనందం కూడా వర్ణనాతీతంగా వుంది!

''సారూ! కోడి యవ్వారవ్ తెగింది! ఇంక నా యిసయవ్ ఆలోసిచ్చండి'' అని అడిగాడు రాగ్యా.

గరుడాచలంఏదో మాట్లాడబోయాడు.. ఆగాడు.

అంతలో కొంతమంది ప్రభుత్వ అధికారులు అభినందించేందుకు వచ్చారు. బొకేలిచ్చారు. దండలు వేశారు. కరతాళ ధ్వనులు చేశారు.

అభినందనల జల్లులు కురిసాక అందరూ సుఖాసీనులయ్యారు.

విందు ఏర్పాట్లు జరిగాయి!

నెమలి మాంసం ఆ రోజు కూడా స్పెషల్!

గ్లాసుల గలగలలతోపాటు విడతలవారి అభినందనలు, జోకులు, నవ్వులూ, సిగరెట్ల దహనాలు, మాంసం తిని ఎముకలు విసరటాలు, నంగిమాటలు, అరమోడ్పు కళ్లూ..

షరా మామూలే!

''కలివికోడి గురించి వివరిస్తారా'' ఎవ్వరో గరుడాచలాన్ని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిలా అభినయిస్తూ అడిగాడు.

''కలివికోళ్ళతో భారతదేశం సుసంపన్న మౌతుంది''

''విదేశాల వైఖరి ఎలా ఉంటుందంటారూ''

''అసూయతో రగిలిపోతారు'' అన్నాడు గరుడాచలం.

(ఇంకా ఉంది)

ప్రజల మనిషి

-వట్టికోట ఆళ్వారుస్వామి

వినమరుగైన..

-సి.రాఘవాచారి

ఇక్కడ విచిత్రమేమంటే సిద్ధాంతం లాగా ప్రతి పాత్రలో కూడా అనేక అంశాలు వున్న విషయాన్ని వారు ప్రస్తావిస్తారు.

ఉదాహరణకు రాంభూపాలరావు తాను నిజాం పాలనకి సాను కూలుడైనప్పటికీ, హైదరాలీ వైపున జరిగినటువంటి మతాంతీకరణను వ్యతిరేకిస్తాడు. తనకు కుడిభుజంగా వున్నహైదరాలీ రైతుల్ని మోసగించటంలోనూ, అలాగేతనకి ఎంతో పట్టుగా వున్నప్పటికీ ఈ విషయంలో రాంభూపాలరావుకి నచ్చనివిషయాలున్నాయి.

పైగా అందుకు ప్రతిగా తను హైదరాబాద్ వెళ్లి ఆర్య సమాజీయుడైనటువంటి విజయదేవుని తీసుకురావటం ఆ విజయదేవుడు ఇస్లాం మతాంతీకరణకు ప్రతిగా హిందూ మతంలోకి మళ్లీ తిరిగి వారిని తీసుకురావటానికి ప్రయత్నించటం, ఇవన్నీ కూడా ఒక పార్శ్వం.

అలాగే ఇంకొక విషయమేమిటంటే, ఇందులో కొన్ని పాత్రలు సజీవంగా మనకు కనబడేటటువంటి అంశంగా ఉంది. ఉదాహరణకిఆండాళమ్మ వెంకటాచార్యుల ధోరణిని, కంఠీరవం ధోరణిని సమన్వయ పరచుకోలేక సతమతమవుతుంటుంది. అన్నిటికీ తనకర్మ ప్రారబ్ధమనుకుంటుంది. అలాగేకంఠీరవాన్ని ప్రజా జీవనంవైపు ఆర్పించినటువంటి కొమరయ్య అమ్మ అన్నమ్మ. ఆమెదొక విశిష్టమైనటువంటి పాత్ర.

కంఠీరవం పట్లసానుభూతి చూపుతూనే ఆయన సనాతన ధర్మపథం నుండి విడివడ్డందుకు బాధపడుతుంటుంది. ఇలా ఎన్నెన్నో పాత్రలు మనకి క్రమంగా వికాసం చెందుతూ అందులో కనిపిస్తాయి.

ఉదాహరణకిచివరిలో చాలా కీలకమైన పాత్ర నిర్వహించినటువంటి పురుషోత్తమాచార్లు, వెంకటేశ్వరరావు- వీళ్లిద్దరూ కూడా వకీళ్లు. వారు నిజాం పాలనలో ఆ విద్యావిధానం నండి వచ్చిన ఆ పాలన యొక్క లోతుపాతులు తెలిసినవారు. వారు చివరికి శ్రమజీవుల ఉద్యమంతో మమేకమై వారితో కలిసి ప్రయాణించటానికి నిర్ణయించుకోవటంతో ఈ నవల పరాకాష్టకు చేరుకుంటుంది.

ముఖ్యంగా ఆళ్వారుస్వామిగారిందులో ప్రయత్నించినటువంటి శిల్పమేమిటంటే? ఏ ఉద్యమమైనా ప్రారంభదశలో అది మనం ఆదర్శంగా చెబుతున్నట్టుగా వుండదు. అది క్రమంగా అనుభవం ద్వారా వివిధ వ్యక్తుల సమాహారమైనటువంటి ఆ కలయిక ద్వారా, సంఘర్షణ ద్వారా ఎలా ఆ ఇతివృత్తం రూపుదిద్దుకుంటుంది-ఆళ్వారుస్వామి గారు ఇందులో చక్కగా చూపించారు.

ముఖ్యంగా ఇందులో భూసమస్యకు కేంద్రంగా దానిని ఆలంబనచేసుకుని అనేక విషయాలొస్తాయి. ఉదాహరణకి ఎన్నడో వూరు విడిచి వెళ్లిపోయినటువంటి ఒక బ్రాహ్మణ కుటుంబ భూమిని తన భూమిగా చెప్పుకుని రాంభూపాలరావు కొన్ని ఏళ్లు దాన్ననుభవిస్తూ వచ్చాడు.

దానిని కౌలుకు చేస్తున్నటువంటి కొమరయ్యను బేదఖల్ చేసి ఆయనపైన దొంగ సాక్ష్యాలు సృష్టించి, ఆ దొంగ సాక్ష్యం వెంకటచారితోను చెప్పించి తాను మేజిస్ట్రేట్ కోర్టులో తన పట్టా పొందుతాడు. ఈ విషయాన్ని చివరకువకీలు వెంకటేశ్వరరావుగారి ద్వారా అలాగే గ్రంథాలయోద్యమంతోపాటు ఆంధ్ర మహాసభ కార్యకర్త అయినటువంటి పరంధామయ్య, అలాగే రాంభూపాలరావు యొక్క ఈ భూస్వామ్య అనుకూల, నిజాం అనుకూల వ్యతిరేకత నచ్చని విజయదేవ్ కూడా మారి వీరందరూ చివరికి అతని మోసాన్ని బయట పెట్టడం జరుగుతుంది.

ఆఖరికి రాంభూపాలరావు ఎక్కడైతే, ఏ వూళ్లో అయితే మకుటం లేని మహారాజుగా ఎదిడో అక్కడే అతనిని జైలుకు పంపించేటువంటి కార్యక్రమం ఒకటి ఉంటుంది.

కోర్టులో అబద్ధపు సాక్ష్యం చెప్పించినందుకు, ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించినందుకు రాంభూపాలరావుని, వెంకటాచారిని పోలీసులు తీసుకెళుతున్నదశలో ఈ నవల ముగుస్తుంది.


ఒక విధంగా చెప్పాలంటే తెలంగాణ రైతాంగ పోరాటం తరువాత ఉధృతరూపం దాల్చటానికి ముందు ఒక గ్రామాన్ని కేంద్రంగా తీసుకుని అందులో వివిధ శక్తుల సమ్మేళనం ఎలా జరిగింది-

-సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన -
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ 1841



అడ్డం **ఆధారాలు** నిలువు

అడ్డం	నిలువు
1. చీఫ్ గెస్ట్	2. అవసరము
5. అడవి, కనుక	3. మరియున్నూ , ఇండికామధ్యలేదు
7. మన్మథ పత్ని	4. కాంతి
8. ఏడురోజుల కాలం	6. మంచు నేసే తాడు లేక పట్టా వంటిది
9.ఊపిరి	10. లక్ష్మణుని భార్య
10. గ్రామము	11. ఒకప్పటి సోవియట్ బుక్స్ ప్రచురణాలయం
12. ఆలోచన	13. శివుడు
14. కుజుడు, ఒక గ్రహము	

మాటాట-1840 సమాధానాలు

అడ్డం		నిలువు	
1. పెద్దవారు	9. లిప్త	1. పెరుగు	7.తాలిమి
4. వగరు	10. డొంక	2. వార్ధి	8. ఆకలి
5. గుడి	12. కలిమి	3.తరుణ్	11. కహాని
6. తేలు	14. హిందుస్తానీ	4. వలువ	13. జోదు

ఎరుకతోసుఖదుఃఖాలు దూరం

ఎనభై నాలుగులక్షల జీవరాశుల్లో పూర్తిగా జన్మ పరంపరల గూర్చి ఎవరికీ తెలియదు. గత జన్మలో తనది ఏ జన్మో, ఇంకా రాబోయేది ఏ జన్మ అనేది కూడా అసలు తెలియదు.

ఇంకా చెప్పాలంటే ఒక్క మనిషి అనేకానేక ఊహాగానాలతో, అనుకుంటారే తప్ప, ఇతర జీవులకు, తమ జన్మ ఇదని, పుట్టుక, మరణం, గూర్చి ఏమితెలియదు. అందుకే జీవులన్నిటిలో ఉత్కృష్టమైన జన్మ మనిషి జన్మగా పేర్కొనడం జరిగింది అది యదార్థము.

ఏదో గత జన్మల మంచి ఫలమనో, పుణ్యఫలమనే కారణంగా మనుష్య జన్మ దొరుకుతుంది. మనిషి జన్మలో గొప్ప సువర్ణావకాశం కూడా ఉంది. జన్మ రాబోయేది మంచిగా దొరికే అవకాశం కూడా మనిషి జన్మలోనే సాధ్యం.

''మనుష్యులు అనేకనేక స్థితిగతులతో జీవించడం కూడా ఆ ఫలమే. అందుకే పరమాత్మ గీతలో ఎన్నో సుద్దులు, బుద్ధులు చెప్పారు. ఉత్తమగతులు పొందడంకోసమే. ''మనిషికి మనస్సు, దేహం, ఇతర జీవుల ద్వారా దైనికముగా ఎన్నో కష్టాలలో ఎక్కువ భాగం. తన మనసు ద్వారా ఎక్కువగా బాధల్ని తెచ్చుకోవడం జరుగుతుంది.

''భగవద్గీతలో 15వ అధ్యాయంలో 8వ శ్లోకంలో శ్రీకృష్ణపరమాత్మ ఈ విధంగా చెప్పారు.

శ్లో॥ శరీరం యద వా ప్నోతి.... వాశయాత్!

గాలి వాసనలను ఒకచోటనుండి మరొకచోటుకి తీసుకుని పోయినట్లుగా శరీరంలో జీవాత్మ ఒక శరీరం విడిచిపెట్టేటప్పుడు ఆ శరీరంనుండి మనసు ఇంద్రియాలను - అనుగ్రహించి వాటితోగూడా మరొక శరీరమును పొందుతుంది.

శ్లో॥ మనః ఏమనుష్యాణాం కారణం

బంధ మోక్షయాః! ఈ జీవాత్మ అలాగే పంచేంద్రియాలతో మనసును ఆశ్రయించి ఆ ఇంద్రియాలవలన వచ్చే విషయాలను అనుభవిస్తుంది. శరీరంలో ఇంద్రియాలు బలీయము, శ్రేష్టము, సూక్ష్మము అని అనిపిస్తుంది. ''ఇంద్రియాలకంటె మనస్సు బలమైనది. మనసుకంటె బుద్ధి శ్రేష్టమైనది, ఆ బుద్ధికంటె, అత్యంత శ్రేష్టమైనది, సూక్ష్మమైనది ఆత్మ అనికూడా చెప్పడం జరిగింది.

''మనసు బుద్ధి మాట వినకుండా, అంతెందుకు మనసుకు, బుద్ధికి కూడా అనేకానేక ఆకర్షణ పరిస్థితులను మాయచే ఆవరించబడి ఉంటాయి. సూక్ష్మమైన ఆత్మను పట్టకోవడం సామాన్యులకు అందని విషయం.

''సాధారణంగా పరమాత్మ అంశగా, ఆత్మ తనలో ఉందని విషయం సాధారంగా అవగాహన పడడం జరగదు. పరమాత్మను విడిచి తన మనసును ఆవరించి ఉన్న రాగద్వేషాలకు లోబడి తాము ఉన్న విషయం ఏంటని తెలుసుకోలేకపోవడమే. ''మనిషి శరీరాన్ని అంటిపెట్టుకునే అంతర్ధార్థంగా ఉన్న ఆత్మ వేరు శరీరం వేరనేది వ్యవహారంలో మనిషి గ్రహించలేని విషయం. ఎంతసేపు మాయాజనితములైన రాగద్వేషాలను మనసు వశమవడం, ఎలాగంటే అలా తమ మనసువశమైన విషయం కూడా గ్రహించలేనంతగా, మమేకమవడం.

''మనసు ఎంతసేపూ తనను అందరూ గుర్తించాలని తన మాట జరగాలని, ఇంటాబయటా వ్యవహారాలన్నీ జరగాలని ఎంతగా కోరుకుంటుందంటే ఏమాత్రం దీనికి భిన్నంగా ఎక్కడ జరిగినా విపరీతంగా బాధపడటం ఇంకా పట్టింపులు-పంతాలు పర్యవసానం, ద్వేషాగ్నిలో తాను కాలుతూ ఇతరులను కాల్చడం.

''మనిషి తన మనసును అదుపుచేయగలిగితే అంతా తనకు సానుకూలమే. వ్యతిరేకత ఎక్కడా కనపడదు. విషయం, పరిస్థితి అర్థంచేసుకోవడం జరుగుతుంది. అవగాహనా రాహిత్యం ఏదో ఒకటి మాట్లాడడం, తద్వారా మనసు గాయపడడం అనుకోవడం.

''ఏదైనా పరిస్థితి సామ, దాన, బేధ, దండోపాయంతో చక్కపరచాలంటారు కదా! అలాగే మనసును కూడా, అలాగే అదుపు చేసుకోవాలి. రాగద్వేషాల మాయాజాలం, అరిషడ్వర్గాల ఉచ్చులో నుండి మనసు బయటపడ కలుగుతుంది.

''మనసు నిర్మోహంగా మారితే బుద్ధివికాసానికి తద్వారా ఆత్మ జాగృతమునకు అవకాశం. ఇవి జరిగిననాడు పరమాత్మకు చేరువ కావడానికి మార్గం సుగమం అవుతుంది. మాయాజాలంనుండి బయటపడిన మనసు 'నకారాత్మకత'అంటే 'నేను'నాది 'నా మాట'వీటన్నిటిని పట్టించుకోవడం తగ్గుతుంది. క్రమేణా అహంకారం, మమకారాలు ప్రాధాన్యత తగ్గుతుంది.


''రాగద్వేషాల ఉచ్చులోపడి చరిత్ర హీనులుగా మారిపోయిన వారెందరో చరిత్రలో కలరు. కామానికి కీచకుడు క్రోధానికి 'హిరణ్యకశిపుడు' లోభానికి 'దుర్యోధనుడు', మోహానికి 'ధృతరాష్ట్రుడు'రావణాసురుడు', మాత్సర్యానికి 'విశ్వామిత్రుడు'గా చెప్తూంటారు. 'మాత్సర్యపడినా తన తప్పు తెలుసుకుని ''రాజర్షి''గా మారారు. తన పేరు 'విశ్వామిత్రుడు' అనేది నిలుపుకున్నారు.

'పురాణాలు చరిత్ర చెప్పుకోవడం ఎందుకంటే ఆ అరిషడ్వార్గాలతోనే రాగద్వేషాలు పుట్టేది, మనసును అతలాకుతలం చేస్తాయి. దానివలన మనిషి అసుర ప్రవృత్తికిలోనవడం, పతనమవడం జరుగుతుంది.

''భగవంతుడు'' జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య తేజో, మహితమైన ఆరువిధములైన అంశలతో ప్రకాశించే శక్తి ఎవరిలోనైనా ఈ ఆరు సంపదలు భగవంతుని దయా, ప్రసాదములే అగును. ''ఆ షడ్గుణైశ్వర్య సంపన్న రూపంగల భగవంతుని గాంచాలన్న షడ్గుణ, దుర్గుణాలు లేకుండా మనసును ప్రక్షాళనము చేసుకోవాలి.

- శ్రీమతి గంటి కృష్ణకుమారి

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు.ధనవ్యయం తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది. కొన్ని ఇబ్బందులు వస్తాయి.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి వుంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
పిల్లలపట్ల పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండాలి. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు. వినోదాల్లో పాల్గొనే అవకాశం ఉంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. రహస్య శత్రువులపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఆకస్మిక ధనలాభముంది. అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి వుంటుంది.

హితవాక్యం


ప్రాణహాని వచ్చు పట్టున సర్వథ
నాపహార వేళయందు నడపు
సత్యమనృతమండ్రసత్యంబు సూనృత
మని పరిగ్రహింతు రార్యజనులు
అది దీయందనాల తిక్కన భారతి

కురుక్షేత్ర మహాసంగ్రామంలో ఒకరోజు ధర్మరాజు కర్ణునిచేతిలో పరాభూతుడయ్యాడు. అవమానభారంతో కుమిలిపోతున్నాడు. కర్ణుని విజృంభణాన్ని చూసి జంకి రాజు మరింత వ్యథతో ముందు వెనుకలాలోచించక ''తమ్ముడా!భయపడి పారివచ్చావా?నీ గాండీవాన్ని కృష్ణునికి ఎరువుగా ఇచ్చినా బాగుండేది! అతనే శత్రువుల్ని తుదముట్టించేవాడు. ''అని పరుషంగా పలికాడు. పార్థుడు తోకపై తొక్కిన తాచులా ఉగ్రుడై అన్నపైకి కత్తిదూయబోతుండగా కృష్ణుడతన్ని నివారించాడు. కానీ అర్జునుడు తన ధనస్సును పరులకిమ్మనే వాని శిరస్సును ఛేదిస్తానని ప్రతిజ్ఞచేశానని, అది నెరవేర్చక పోతే అసత్యదోషం వచ్చిపడుతుందని చెప్పి దాన్ని పరిష్కరించుమని వేడుకున్నాడు. అప్పుడు జగత్కృత్యసాకల్యవేది శ్రీకృష్ణుడిలా ఉపదేశించాడు.

''ఓయీ!పార్థా! ధర్మము యొక్క సూక్ష్మస్వరూపం చాలాచిత్రమైంది. ప్రా ణాలకే హాని సంభవించే సమయంలో సమస్త సంపదలు అపహరించబడే తరుణంలో అసత్యం పలికినా అది సత్యమే ఔతుం.ది అట్టివేళలలో సత్యం పలికినా అది అబద్ధం గానే పరిగణింపబడింది. కనుక ధర్మరక్షణకోసం ఏ మార్గాన్ని అనుసరించినా అది ఆమోదించదగిందిదే. ధర్మం తప్పకుండా, నీతి తప్పకుండా ఉంటే మేలు కానీ కావాలని పరులను హింసించడానికి అబద్ధం చెప్పినా, పరహింస చేసినా అది తప్పు అవుతుంది.

-వ్యాఖ్యాత:డి.ఎన్.దీక్షిత్

సుందరకాండ



ఇంద్రియాణీంద్రియార్థైస్తు పంచపంచభిరుత్తమైః
తర్పయామాస మాతేవ తదా రావణ పాలితా
స్వర్గో యం దేవలో కోయం ఇంద్రస్యేయం పురీభవేత్
సిద్ధి ర్వేయం వరాహిస్యాదిత్య మన్యత మారుతిః

అన్ని ఇంద్రియాలు ఇంద్రియార్థములన్నిటిచేత ఏక కాలంలో తృప్తిని పొందుతున్నాయట. తల్లి తన సంతానమునకు తృప్తిని కలిగించినట్లు తృప్తిని కలిగిస్తున్నదట.

ఇదీ అనుభవంలో స్వామికి రావణునికి ఉన్న భేదం.

రావణుడనుభవించే తృప్తి ప్రియురాలి వలన లభించినది.

ఆంజనేయస్వామి తృప్తి తల్లివలన లభించినది.

అందుకనే- స్వామి అంతటి వానికి-

ఇది స్వర్గమా! దేవలోకమా! అమరావతా!

ఇది భోగానుభవ సిద్ధికి పరాకాష్టగా ఉంది.- అని అనిపించింది.

ఇలా అనిపించిన దాని బాహ్య సౌందర్యంతోబాటు మరి కొంచెం ముందుకు వెడితే దాని అంతర సౌందర్యమూ కనబడతాయి.

ఇక్కడ బాహ్య అంతర ప్రకృతులు భిన్నం కావు.

నిద్రావలైన అంతఃపుర స్త్రీలు

వారినోటినుండి వెలువడుతూన్న భోగ ద్రవ్య వాసనలూ మాటి మాటికి ఎగురుతూన్న ముంగురులనే తుమ్మెదలచేత ప్రార్థింపబడుతూన్న ముఖ పద్మాలు. అలాగే-

గాఢ నిద్రలో ఉండి- సపత్నీ ముఖాన్ని రావణ ముఖమే అనుకొని ముద్దు పెట్టుకొంటూన్న స్త్రీ

ముద్దు పెట్టుకుంటూన్నది రావణుడే అనుకొని తత్కాలంలో సపత్నీ వైరాన్ని మరచిపోయిన స్త్రీ కాలు తొడ పిక్క పాదం పెనవేసికొని ఒకరినొకరు అల్లుకుపోయి నిద్రపోతూన్న స్త్రీలు-

ఇంకావుంది...

స్వాధ్యాయ సందోహం


హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా ఆచరించినవాడే సుప్రావియై పరమాత్మకు ప్రీతిపాత్రుడు కాగలడు.

సోమీః- తాను శాంతుడై తన తోడివారిని ప్రశాంతులుగాచేసే సచ్ఛీలియే సోమి. వెనుక చెప్పబడిన సుకృత్తు, మనాయు, సుప్రావి అయినవాడే సోమి కాగలడు. తాను ప్రశాంతంగా ఉండి ఇతరులను ప్రశాంతంగా ఉంచాలంటే ముందుగా ఇతరుల ఎడల సహజంగా కలిగే వైరభావాన్ని తొలగించుకోవాలి. ఈ భావాన్ని అలవరచుకొనేందుకు 'ఆత్మనః ప్రతికూలాని పరేషాం న సమాచరేత్' ''ఇతరులు తన ఎడల ఏ పనులుచేస్తే తనకు అప్రియంగా ఉంటుందో ఆ పనులను తాను స్వయంగా ఇతరుల ఎడల ఆచరించరాదు''అని మహాభారతం ఒక చిన్న ఉపాయాన్ని చెప్పింది. ఇది చిన్నదే అయినా సులభోపాయం మాత్రం కాదు. కాని ప్రయత్న పూర్వకంగా ఆచరిస్తే ఆతడు తప్పక వేదం చెప్పిన సోమి అయి భగవత్ప్రీతి పాత్రుడవుతాడు.

విశ్వాత్ముడికి ఆత్మీయుడై ప్రీతిపాత్రుడు కావడానికి ఎన్నెన్నో లక్షణాలున్నాయి. కాని వేదం వానిలో ఎంచి ఎంచి ప్రధానమైన వాటిని నాల్గింటిని ఈ మంత్రంలో పేర్కొంది. కనీస మా నాల్గు లక్షణాలున్నా ఉర్వస్మా అదితిః శర్మ యంసత్ ''జగన్మాత (అదితి)వారికి ఇహలోకంలో సుదీర్ఘమైన సుఖజీవనం తోడి దీర్ఘాయువు నిస్తుంది''అని ఋగ్వేదం మానవ సమాజానికి సందేశమిస్తూంది.

⁂



దేవా! నీకు దూరంగానే ఉండి మొరపెడుతున్నాం.

ఉత త్వా బధిరం వయం శ్రుత్కర్ణం సంతమూతయే।

దూరాదిహ హవామహే॥ ఋ.8-45-17॥

భావం:- మేము మా రక్షణకోసం బాగా వినగల శక్తివంతమైన చెవులుగల నిన్ను దూరంగా ఉన్న మేము మొరపెడుతూ పిలుస్తున్నాం.

వివరణ:- సర్వభూతాంతరాత్మా! నేను దుఃఖార్తుడను. ఎందరికో నా ఆర్తిని విన్నవించుకొన్నా. ఇతరులకు మనసులోని దుఃఖాన్ని చెప్పుకొంటే ఆ భారం తగ్గుతుందని విన్నాను. కాని దానికి భిన్నంగా విపరీతమైన అనుభవమేర్పడింది. నా దుఃఖం తరుగలేదు సరికదా మరింతగా పెరిగింది. బహుశా నా దీనగాథ ఎవరూ వినలేదేమోననిపిస్తూంది. లేదా విన్నవారికి చెవులేవేవో! ఉన్నా అవి చెవిటి చెవులో ఏమో. లేకపోతే వారు నా దీనగాథకు ఎందుకు స్పందించలేదు?

సర్వ దుఃఖ భంజనా! నీవు చెవిటివాడవు కాదని, నీకు చెవులు బాగా వినబడతాయని చాలా మంది చెప్పగా విన్నాను. నేను నీకు చాలా దూరంలో ఉన్నాను. 'వి మే పురుత్రా పతయంతి కామాః' (ఋ.3-55-3) నా కోరికలన్నీ ఎన్నో విషయాల మీద నిక్షిప్తం చేయబడ్డాయి. అలా నన్నవి నీకు దూరం చేసివేసాయి. అందువలన నేను వ్యాకుల చిత్తుడనై ఉన్నాను. రేపు నిన్ను పొంది అనుభవించాలనుకొన్న మధుర ఊహలన్నీ ఆవిరైపోయాయి. సంసార చక్రమనే జ్వాలా చక్రబంధంలో చిక్కుకొని పోయాను. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్య, మోహమనే శత్రువులు నన్ను చుట్టుముట్టి హింసిస్తున్నారు. నాకు వానినుండి విముక్తి కనబడటం లేదు. ఎక్కడికి పోగలను? విముక్తినెలా పొందగలను? అనన్య శరణుడనై నీకు శరణాగతుడ నగుచున్నాను. నీకెంతో దూరంలో ఉన్నాను. 'దూరాదిహ హవామహే' ''దూరంగా ఉన్న ఈ ప్రదేశం నుండియే నిన్ను పిలుస్తున్నాను.''

190

సంసార పీడ నాకొక్కడికే కాదు. ఎందరికో ఉంది. నా వొక్కడి మీదనే అయితే నీవు వినకు. ఇది మా అందరి పీడ. ఓ ప్రభూ! 'ఉత త్వం మఘవన్ శ్రుణు యస్తే వష్టి వవక్షి తత్' (ఋ.8-45-6) ''ఓ విశ్వయోనీ! ఓ పూజ్యధనశాలీ! నిన్నే కోరి నిన్నే మొరపెట్టుకో దలచినవాని పిలుపునైనా విను.'' ఓ సత్య పరాక్రమా! అసలు నిన్నెందుకు పిలుస్తారు? 'ఊతయే' ''రక్షిస్తావని కదా!'' నీకంటె రక్షకుడు, సుఖప్రదాయకుడు ఎవరున్నారు? ఓ దేవా! మేము రక్షణహీనులం. నానావిధ రాక్షస జనమూ మరియు నానా ప్రవృత్తుల చేత చుట్టుముట్టబడిన వారం. నీవో వృత్రాసుర సంహారకుడవు. మోహరాక్షస సంహారకుడవు. అన్నింటిని మించి 'భవేరాపిర్నో అంతమః' (ఋ.8-45-18) ''అంతిమ సర్వోత్కృష్ట బంధుడవు నీవే.'' లోకంలో ఉండే బంధువుల స్వార్థబంధం వంటిది కాదు నీ బంధుత్వం. నీ ప్రేమ, బంధుత నిస్వార్థ పరిపూర్ణం. సర్వభూతాంతరాత్మా! మా మాట నమ్ము. మేమంతా ఉశ్మసి త్వా సధస్థ ఆ (ఋ.8-45-20) ''నీ వొక్కడితో మాత్రమే ఉండేందుకిష్టపడుతున్నాం'' మా మొరను విన్నావా? మమ్ము నీ వెంటే ఉంచుకో. నీదిమాత్రం ఏదీ చెడిపోదు. కాని మేము మాత్రం ధన్యులమవుతాం.

⁂

భగవంతుని రక్షణ

తమిన్నరో వి హ్వయంతే సమీకే రిరిక్వాంస స్తన్వః కృణ్వత త్రామ్।
మిథో యత్త్యాగముభయాసో అగ్మన్నరస్తోకస్య తనయస్య సాతౌ॥
॥ఋ.4-24-3॥

భావం:- మానవులు తమ శరీరేంద్రియ బలీయమైన శక్తులను వశం చేసుకుంటూ జీవన సంగ్రామంలో ఆ దైవాన్ని అత్యంత ఆర్తితో పిలుస్తారు. ఆ భగవంతుని తమ రక్షకునిగా చేసుకొంటారు. వీరూ మరియు పిల్లాపాపలను పొందాలనుకొనేవారు ఈ యిరువురు త్యాగాన్నే ఆశ్రయిస్తున్నారు.

వివరణ:- ప్రపంచంలో మనిషి ఎప్పుడైనా ఎక్కడైనా నిరాశచేత హతాశుడయితే అప్పుడు దీన జన శరణ్యుడు- దుఃఖనివారకుడయిన భగవంతుని స్మరించి ఆయనకు శరణాగతుడవుతాడు. లోకంలో జగడాలు- విరోధాలు లేకుంటే ఎవరూ ఎవరిని సహాయమర్థించరు.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



సరిగా నడుమ, ముల్లుదగ్గర నిలువక త్రాసుదండి ఎప్పుడు ఒరగిపోవును. ఒకవైపున నున్న సిబ్బి రెండవ దానికంట బరువైనప్పుడే కదా? అటులనే కామినీ కాంచనముల భారము తనపై బడినప్పుడు -వానిచే లాగబడినప్పుడు- మనస్సు భగవంతునినుండి తొలగిపోవుచున్నది.

78.అడుగున సూది బెజ్జమంత చిల్లియున్నను కుండలోనున్న నీరంతయు క్రమముగా కారిపోవును. అటులనే సాధకునియందు ఏ మాత్రపు లోలత యున్నను వాని సాధనలన్నియు బూడిదెలో పోసిన పన్నీరగును.

79.కామమును పూర్తిగా వశమొనర్చుకొన యత్నింపుము. ఇందు కృతార్థుడవైన యెడల ఇంతవరకు బీజావస్థలోనున్న మేధానాడి బలపడుటచే శరీరములో నొక విధమైన మార్పు కలుగును. ఈ నాడి శరీరమునందలి క్షుద్రశక్తులను ఉత్తమశక్తులుగా మార్చు స్వభావము కలది. ఈ మేధానాడి బలపడినంతనే ఆత్మజ్ఞానము అలవడును.

80.కామినీ కాంచన వ్యామోహములో మునిగియున్న మనస్సు లేత పోక కాయ వంటిది. పోక పచ్చగా నుండునంతవరకు పై బెరడునకు గట్టిగ నంటిపట్టుకొనియెయుండును. కాని యది పండి యెండినప్పుడు వక్కయు డొల్లయు వేరు పడి కదలించునప్పుడు వక్క లొటలొటలాడును. అటులనే కామినీ కాంచన వ్యామోహము ఇగిరిపోయినప్పుడు ఆత్మ శరీరముకంటె భిన్నమని బాగుగా గోచరించును.

81.మనస్సు భోగములపై ఆశ వీడి, నిర్మలమైనంతనే భగవానునిపై లగ్నము కాగలదు. బద్ధుడు ఈవిధముగా ముక్తుడగుచున్నాడు. భగవంతుని వీడి పెడత్రోవను బోవువాడే బద్ధుడు.

82.కామినీ కాంచన మోహము మనస్సు నుండి నిర్మూలనమైనప్పుడు మిగులున దేమి? కేవలము బ్రహ్మానందము.

కామమును జయించుటెట్లు?

83.పాములకు నిలయమైన ఇంటిలో నివసించువారు వాని వలన ఎప్పుడు ఏ కీడు మూడునో అని జాగ్రత్తగా నుందురు కదా? అటులనే సంసారులగు నరులు కామినీ కాంచనములు తమ్ము లోబరచుకొనకుండా మెలకువ గలిగి మెలగవలయును.

84.పాము కంటబడినప్పుడు ఇటులను నాచారము కలదు. ''తల్లీ! మానసా! నీ తోకను మాత్రము అగపరచుచు, తలను దాచుకొని దూరముగా తొలగిపొమ్ము''. అటులనే కామోద్రేకమును వురికొల్పు విషయ భోగములనుండి దూరముగా తొలగి వర్తించుటయే తెలివిగలపని. పతితులై తెలివి తెచ్చుకొనుటకంటె వాని సంసర్గము పొందకుండుటయే మేలు.

85.ఒక శిష్యుడు భగవద్ధ్యానము చేయుచు కాలము గడుపుచున్నను దుష్ట సంకల్పములు అపుడపుడు మనస్సులో బుట్టుచునే యున్నవని చెప్పి కామమును జయించుటెట్లని శ్రీరామకృష్ణునడిగెను. అందులకు శ్రీగురుదేవుడిట్లు బోధించెను: ''ఒకని యొద్ద నొక కుక్క యుండెడిది. దానినెత్తుకొని ముద్దాడుచు, దానితో ఆటలాడుచు, ఆ కుక్కను అతడు చాలా మక్కువతో బెంచుచుండెడివాడు. అది చూచి యొక జ్ఞాని కుక్కపైనంతటి మక్కువ కూడదని యాతని మందలించెను. ఏలన, కుక్క కేవలము జ్ఞానహీనమగు జంతువు గదా?

ఎపుడైనను ఆతని గరచినను కరవవచ్చును. దాని యజమానుడీబోధల నాలకించి యొడిలోనున్న కుక్కను ఆవలికి త్రోసివేసి, దాని నిక చేరదీయుటగాని, బుజ్జగించుటగాని కూడదని నిశ్చయించుకొనెను. కాని యా కుక్క యజమానునకు తన యందు దృష్టి మారినదని తెలియజాలక ఎప్పటివలెనే ఎత్తుకొని ముద్దులాడునను నాశతో తరచు వానియొద్దకు పరుగెత్తుచుండెడిది. ఎన్నియోసార్లు దెబ్బలు తినిన పిమ్మట తుదకు అది తన్ను లాలింపుమని యజమానునిక బాధించుట మానివేసెను. నీ స్థితియు అటులనే యున్నది. నీయంతరంగమున నీవింతవరకు బుజ్జగించిన కుక్కను నీవు వదలించుకోదలచినను సులభముగా నిన్నది విడువదు. అయినను భయములేదు లెమ్ము. ఆ కుక్క నిక బుజ్జగింపక నీదరి జేరినపుడెల్ల చీకొట్టుచుండుము, కొట్టుచుండుము, నీచే లాలనపొందుటకై నిన్ను పీడించుచున్న యా కుక్క (కామము) కొంతకాలమునకు నిన్ను విడిచి వేయుము.

86.కామినియ కాంచనమును లోకమునందతయు సంసార సాగరమున -పాప పంకిలమున- ముంచివేసినవి సుమీ! స్త్రీని నీవు సాక్షాజ్జగజ్జనని యను భావముతో జూచినయెడల ఆమె వలన నీకెట్టి ప్రమాదమునుండదు.

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

ఇంకావుంది...

జాపకోపాఖ్యానము

95



మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి



అతని మాటలు విన్న రాజు ఇలా తలచాడు. - ''ఈ ఇద్దరి వివాదం ఇప్పుడే వచ్చిపడింది. బ్రాహ్మణుడు కూడా దానం స్వీకరించమని వత్తిడి తెస్తున్నాడు. ఏం చేయాలి?''

రాజు వికృత, విరూపులతో ఇలా అన్నాడు. ''మీ వివాదం తీరిన తర్వాతే వెళ్ళండి. నా రాజధర్మం అబద్ధం కాకూడదు. రాజులు స్వధర్మ పరిపాలన చేయాలని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇప్పుడు ఈ కఠినమైన బ్రాహ్మణ ధర్మం కూడా నన్ను ఆవేశించింది.''

విప్రుడు ఇలా అన్నాడు - ''రాజా! నీవు అడిగినది నేను ఇస్తానని అన్నాను. ఇప్పుడు అది నీవు నా దగ్గర దాచిన వస్తువులాగ ఉంది. వెంటనే తీసుకో!''

రాజు - ''రాజ ధర్మం చాలా క్లిష్టమైనవి. ఇప్పటి వరకు నేనెవరి ముందు చేయి జాచలేదు. ఇప్పుడు నీ ముందు చాపుతున్నాను. నీ దగ్గరున్న నా సొమ్ము నాకు ఇచ్చివేయి''.

అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు - ''సంహితను జపిస్తూ నేను కూడబెట్టిన పుణ్యం మొత్తం స్వీకరించు. ఇది కాక ఇంకేదైనా పుణ్యం నా దగ్గర ఉంటే దాన్ని కూడా తీసుకో''.

అప్పుడు రాజర్షి ఇలా అన్నాడు ''నీ దానాన్ని నేను స్వీకరించాను. నీవు కూడా నా దానాన్ని స్వీకరించు. మొత్తం దాన పుణ్యం చెరి సగం ఇద్దరం అనుభవిద్దాము.''

అప్పుడు విరూపుడు ఇలా అన్నాడు - ''రాజా! మేమిద్దరం కామక్రోధులం. మేమే నీ చేత ఈ పని చేయించాము. తపః, దాన ఫలం చెరిసగం చేసుకొని అనుభవిస్తే ఇద్దరికీ ఒకే లోకం లభిస్తుంది. మేమిద్దరం ఒకరికొకరు ఏ బాకీ పడలేదు. మేమిద్దరమూ కాలుడూ, యముడూ అందరం మిమ్ము పరీక్షిచడానికే వచ్చాము. నీ కర్మఫలంగా నీకు నచ్చిన లోనికి నీవు వెళ్ళవచ్చు.''

బ్రాహ్మణుడు కూడా దీనికి అంగీకరించి వారిని అందరినీ పూజించి రాజుతో ఇలా అన్నాడు.

''రాజర్షీ! ఈ తపఃఫలంతో నీవు ఉత్తమ లోకాలకు వెళ్ళు. నేను మరల తపస్సు చేస్తాను. నాకు జపం మీద శ్రద్ధ ఉంటుందని సావిత్రీదేవి వరమిచ్చింది.''

అపుడు రాజు ఇలా అన్నాడు - ''ద్విజోత్తమా! జప దాన ఫలితం ఇద్దరం కలిసి అనుభవిద్దాము''. దానికి బ్రాహ్మణుడు అంగీకరించాడు. ఎక్కడికి వెళ్ళాలో చెప్పుమన్నాడు.

అప్పుడు దేవేంద్రుడు దిక్పాలకులతో కలిసి అక్కడికి వచ్చాడు. అప్పుడు గొప్ప వాద్యాలు మ్రోగాయి. గంధర్వులు గానం చేశారు. వారిద్దరిపై పుష్పవృష్టి కురిసింది. వారిద్దరూ కలిసి తమ మనసులను విషయాల నుండి ఉపసంహరించుకొన్నారు. తర్వాత పంచ ప్రాణాలను మనస్సులో నిలిపారు. కనుబొమ్మల మధ్య నాసిక మీద దృష్టి నిలిపి, ప్రాణయమాలను సుషుమ్న ద్వారా హృదయస్థానంలో నిలిపి సమాధి స్థితికి చేరుకున్నారు. వారి శరీరాలు నిశ్చలంగా ఉన్నాయి. అప్పుడు ఆ బ్రాహ్మణుని బ్రహ్మరంధ్రం ఛేదించుకొని ఒక తేజోమయమైన జ్యోతి బయటకు వచ్చి స్వర్గం వైపు వెళ్ళింది. ఆ తేజః పుంజం చిన్న పురుషునిగా మారి బ్రహ్మ సన్నిధికి చేరింది. బ్రహ్మ ఆ పురుషునికి స్వాగతం పలికాడు. బ్రహ్మ ఇలా అన్నాడు - 'బ్రాహ్మణా యోగులతో సమానమైన ఫలితాన్ని జాపకులు కూడా పొందుతారు. నీవు నాలోనే నిలిచిపో'. అప్పుడు బ్రాహ్మణుడు బ్రహ్మవదనంలోకి ప్రవేశించాడు.

అక్కడ ఉన్న దేవతలంతా ఇలా అన్నారు - ''జాపకుడు, యోగులతో సమానంగా పొందే స్థానాన్ని చూడడానికీ మేమంతా వచ్చాము.''

అప్పుడు బ్రహ్మ ఇలా అన్నాడు - ''ఒక్కటిగా వచ్చిన ఈ ఇద్దరూ కూడా సమాన ఫలాన్ని పొందారు. ఇద్దరూ అన్ని లోకాలను దాటి వారికిష్టమైన ప్రదేశానికి వెళ్ళవచ్చు''.

అప్పుడు దేవతలు బ్రహ్మ దగ్గర వీడ్కోలు తీసుకొని తమ తమ నివాసాలకు వెళ్ళారు.

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

బుధవారం 9, జనవరి 2019



పొల్లాచికి మహర్షి

మహేష్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మహర్షి. షూటింగ్‌కి కొంత బ్రేక్‌నిచ్చి కొత్త ఏడాది వేడుకల్లో భాగంగా కుటుంబంతో దుబాయ్ వెళ్లిన మహేష్, మళ్లీ షూటింగ్‌కు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. మహర్షి తదుపరి లాంగ్ షెడ్యూల్ కోసం మహర్షి టీం త్వరలో పొల్లాచి వెళ్లనుందట. సినిమాలో మహేష్‌బాబు సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. కామెడీ హీరో అల్లరి నరేష్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాడు. నిర్మాతలు దిల్‌రాజు, అశ్వినీదత్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం శాటిలైట్ హక్కులను జెమినీ టీవీ దక్కించుకుంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాన్న కోసమే చేశా..



ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి కొడుకు రామ్‌చరణ్. ఇప్పుడు -చరణ్ ఫాదర్ చిరంజీవి. ఇంతకుమించి అతనిగురించి ఎక్కువ చెప్పగలిగేదేమీ ఉండకపోవచ్చు. మెగా ఫ్యామిలీ ముద్రతో ఇండస్ట్రీకి వచ్చినా -ఆ బ్రాండ్‌ను భుజస్కందాలపై మోయగల స్టార్‌గా ఎదిగాడు. గత ఏడాది సుకుమార్‌తో చేసిన రంగస్థలం ఇండస్ట్రీ బ్లాక్‌బస్టర్ అయ్యింది. హీరోగా తన రేంజ్ పెంచుతూనే, నిర్మాతగానూ తనదైన స్టయిల్ చూపిస్తున్నాడు చరణ్. 'నాన్నకు నచ్చిన కథల్ని బడ్జెట్ పరిమితులు లేకుండా తెరకెక్కించడానికే నిర్మాత అవతారం ఎత్తాను అందుకే బ్యానర్ రిజిస్ట్రేషన్ చేయించాన'న్నది చరణ్ మాట. తాజాగా మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో క్లాసిక్ టైటిల్ 'వినయ విధేయ రామ'గా వస్తున్న చరణ్ -సంక్రాంతికి నా షేర్ ఎంటర్‌టైన్‌మెంట్ ఖాయం అంటున్నాడు. సీత (కైరా అద్వానీ)ను తీసుకుని 11న థియేటర్లకు వస్తున్న సందర్భంగా **చరణ్**తో చిట్‌చాట్.

- **రంగస్థలం తరువాత..:**

నటుడిగా ఒకదానికే పరిమితం కాకుండా అన్ని జోనర్లూ టచ్ చేయాలన్నదే నా ఉద్దేశం. 80వ దశకంలో నాన్న చేసిందీ అదే. కాకపోతే, ఈసారి జోనర్‌కంటే సెన్సిబుల్ సినిమా గురించి ఆలోచించా. అలా ఒప్పుకున్నదే -వినయ విధేయ రామ.

- **కథలో నచ్చిన అంశం:**

నలుగురు అన్నదమ్ముల కథ. వారి కుటుంబంలో తలెత్తిన సంఘటనలే ఇతివృత్తం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో రామ్ పాత్రలో కనిపిస్తా. కొడుకో, తమ్ముడో, మరిదో.. ఇలా ప్రతి ఇంట్లో ఇలాంటి వాడొకడుండాలి అనిపించే పాత్ర. అయోధ్య రాముడన్న మాట. వినయంగా ఉంటూనే, అవసరమైతే విధ్వంసం సృష్టించే క్యారెక్టరైజేషన్.

- **బోయపాటి అంటేనే లోడెడ్ యాక్షన్..:**

ఈ సినిమాకు అంత టైం దొరకలేదు. మరికొంత టైముంటే బాగుండేది అనిపించింది. రంగస్థలం షూట్ అయిపోయిన 25 రోజుల గ్యాప్‌లో ఈ షూట్ మొదలుపెట్టాం. బోయపాటికి, నాకూ వేరే కమిట్‌మెంట్స్ ఉండటంతో తొందరపడాల్సి వచ్చింది. అయితే దర్శకుడు క్లారిటీగా ఉండటంతో, ఈ పాత్ర నాకు సులువైంది. కొంచెం టైముంటే ఇంకా బావుండేది.

- **రంగస్థలం ఇంపాక్ట్ దీనిపై...:**

రంగస్థలంతో పోల్చడం సరికాదు. ఏ ప్రాజెక్టునైనా మంచి సినిమా కావాలనే ప్రయత్నిస్తాం. అభిమానులు ఎలా రిసీవ్ చేసుకుంటారన్నది చెప్పలేంగా.

- **గ్యాంగ్‌లీడర్‌తో పోలిక:**

అస్సలుండదు. గ్యాంగ్ లీడర్ సినిమా చేయాలన ఆలోచన ఇంతకుముందొకసారి వ్యక్తం చేశా. అందుకే ఈ సినిమాతో పోల్చుకుంటున్నారేమో.

- **రాజమౌళి ప్రాజెక్టులో మీ పాత్ర:**

రాజమౌళి మళ్లీ డీ గ్లామరైజ్డ్ పాత్ర సృష్టించాడు. సాధారణ యువకుడిలానే కనిపిస్తా. కాని ప్రేక్షకులకు బాగా కనెక్టవుతుంది. సినిమా కోసం ఆసక్తిగానే ఎదురుచూస్తున్నా. ఏడాది మొత్తం ఈ సినిమాకే కేటాయించాను.

- **ఎన్టీఆర్‌తో మీ కాంబినేషన్..:**

ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడు. అదీ, చాలాకాలంగా. మా ఇద్దరి కాంబినేషన్ సన్నివేశాలు బాగా వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో కలిసి వర్క్ చేయడం మంచి అనుభూతి.

- **సైరా ఎంతవరకు వచ్చింది..:**

రెండు నెలల్లో షూటింగ్ పూర్తవుతుంది. మంచి డేట్ చూసి సమ్మర్‌లో విడుదలకు ప్లాన్ చేస్తాం.

- **స్టార్ హీరో.. నిర్మాత.. రిస్క్ కాదూ?**

రిస్టేననిపిస్తుంది ఒక్కోసారి. కానీ నచ్చిన పని కదా. ప్లానింగ్‌తో చేసుకుపోతున్నా.

- **మీ బ్యానర్‌లో వేరే హీరోలతో..:**

లేదండి. కేవలం నాన్న సినిమాల కోసమే ఇది. నా సినిమాలు కూడా చేస్తానేమో. బట్, నాకు మంచి నిర్మాతలున్నారు. ప్రస్తుతానికైతే వేరే హీరోలతో ఈ బ్యానర్‌లో సినిమాలు చేసే ఆలోచన లేదు.

- **మెగాస్టార్ చిరంజీవికి బయట పెద్ద బ్యానర్లు ఉన్నాయిగా..:**

కొన్ని నచ్చిన కథలు చేయాలంటే బయటి బ్యానర్లు బడ్జెట్ విషయంలో రిస్క్ చేయకపోవచ్చు. అందుకే మనకునచ్చిన సినిమాలు చేయడానికే ఈ బ్యానర్.

- **చిరుకి రెమ్యునరేషన్ ఇస్తున్నారా:**

తెలుగులో ఏ నిర్మాతా ఇవ్వనంత ఇస్తున్నా. కావాలంటే నాన్ననే అడగండి.

- **హిందీ సినిమా ఎప్పుడు?**

ఇక్కడ బాగానే ఉందిగా. హిందీ ఎందుకు?

- **భారీ బడ్జెట్‌తో వెళ్తున్నారు. రిస్క్ కాదా?**

పెట్టింది వెనక్కి వచ్చేంత వరకూ రిస్క్ కాదు.

- **తరువాతి ప్రాజెక్టు..:**

ప్రస్తుతం రాజమౌళి సినిమా ఉంది. తరువాత కొరటాల శివతో సినిమా ఉంటుంది. అదీ నాన్న- కొరటాల శివ సినిమా అయ్యాక, నేను చేస్తా.

-శ్రీనివాస్

మార్పు కనిపిస్తోంది. టీమ్‌ని బాగా చూస్తున్నారట..:

ఎలాంటి మార్పు. నేనెప్పుడూ ఒకేలా ఉంటా. మార్పు -ఎదుటివ్యక్తి చూసే పరిస్థితిని బట్టి ఉంటుందేమో. నేను సైరా సినిమాకు నిర్మాతను. టీమ్ బాగునే కోరతా. అందుకోసం వారికి ఆర్థికంగా సహాయపడుతుంటా. ఖైదీ నెంబర్ 150 టైంలోనూ అలాగే ఉన్నా. టీంను హ్యాపీగా చూస్తే, సినిమాకు ఉత్సాహంగా పని చేస్తారు. నాతోవుండే పర్సనల్ టీమ్ కూడా ఎప్పుడూ హ్యాపీగానే ఉంటారు.



షోలే.. షోలు




యన్‌టిఆర్ బయోపిక్‌లోని 'కథానాయకుడు' ఈరోజు థియేటర్లకు వచ్చింది. ఆంధ్ర, తెలంగాణ తెలుగు రాష్ట్రాలే అయినా -ఏపీలో సంక్రాంతికంటూ ఓ ప్రత్యేకత ఎప్పుడూ ఉండేదే. ఈ కోణంలో అక్కడ ప్రదర్శితమవుతున్న చిత్రాలకూ ప్రత్యేక 'షో' అనుమతులూ లభించేశాయి. యన్‌టిఆర్ పాత్ర పోషిస్తూ బాలకృష్ణ చేసిన 'కథానాయకుడు' ప్రత్యేక ప్రదర్శనలకు ఏపీ సర్కారు ఇప్పటికే అనుమతించింది. దాదాపుగా 18వ తేదీ వరకూ ఈ చిత్రం రోజుకు ఆరు షోలు చొప్పున ప్రదర్శితం కానుంది. ఇక 11వ తేదీన విడుదలవుతున్న మెగా హీరో రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' చిత్రానికి ఏపీలో ప్రత్యేక అనుమతులు దొరికాయి. ఈ చిత్రం సైతం 18వ తేదీ వరకూ అన్ని థియేటర్లలో రోజుకు ఆరు షోలు చొప్పున ప్రదర్శించనున్నారు. మరుసటి రోజే అంటే పండుగ ముందురోజున వెంకటేష్, వరుణ్ తేజ్‌లు -పండుగ అల్లుళ్లుగా థియేటర్లకు రాబోతున్నారు. మిలియన్ల వ్యూస్ తమ ట్రైలర్లకు దొరికాయంటూ పెద్దగా ప్రచారం చేసుకున్న చిత్రాలు -ఎన్ని ఆడియన్స్‌ని అలరిస్తాయో చూడాలి. తెలుగు స్ట్రెయిట్ మూవీస్ మూడు బరిలో ఉండటంతో, సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన పేట, మన్మోహన్ పాత్రలో అనుపమ్ ఖేర్ నటించిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' చిత్రాలకు థియేటర్ల కొరత తప్పడం లేదు. ఇవి ప్రేక్షకులకు అందుబాటులో లేనట్టేనని చెప్పాలి.

పండుగ వినోదానికి తెరలేచింది. సంప్రదాయ సంక్రాంతిని వేడుక చేసేందుకు మూడు అచ్చ తెలుగు సినిమాలు థియేటర్లను పంచేసుకున్నాయి. ఆడియన్స్‌ని అలరించేందుకు అనువాద చిత్రాలూ వస్తున్నా -వాటికి మాత్రం థియేటర్ల కొరత తప్పడం లేదు. ఎప్పుడూ వుండే వివాదాన్ని ఒకింతసేపు పక్కన పెడితే -సంక్రాంతి సెలవుల్ని ఎంగేజ్ చేయడానికి వస్తున్న సినిమాలన్నీ పెద్ద సినిమాలే కావడం ఇక్కడ విశేషం. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌ల మీద ఫస్ట్ లుక్‌లు, టీజర్లు, ప్రోమోల మీద ప్రోమోలు, ట్రైలర్లు, ప్రమోషన్ టూర్లు పూర్తి చేసుకుని -స్క్రీన్‌కు వచ్చేందుకు సినిమాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. వారంపాటు తెల్లారింది మొదలు చీకటి పడేంత వరకూ సినిమాయే ఎంటర్‌టైన్ చేయబోతోంది. పండుగ సినిమాగా మొదట

మోదీ.. ఇలా..

ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్ గురించి గత కొంతకాలంగా ఆసక్తికర చర్చ సాగుతోంది. ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో ఈ బయోపిక్ తెరకెక్కనుందని వివేక్ ఒబెరాయ్ టైటిల్ పాత్ర పోషిస్తారని ప్రచారమైంది. తాజాగా ఈసినిమాకి సంబంధించిన ఫస్ట్‌లుక్ లాంచ్‌చేశారు. నరేంద్ర మోదీగా ఒబెరాయ్ లుక్ ఎలా వుంటుందో పోస్టర్ ద్వారా రివీల్ చేశారు. తొలి పోస్టర్‌ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ లాంచ్ చేశారు. మొత్తం 23 భాషల్లో ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ వివరాల్ని ప్రఖ్యాత క్రిటిక్ తరణ్ ఆదర్శ్ వెల్లడించారు. ''వివేక్ ఆనంద్ ఒబెరాయ్ (వివేక్ ఒబెరాయ్) నరేంద్ర మోదీ బయోపిక్‌లో నటిస్తున్నారు. టైటిల్ పిఎం నరేంద్ర మోదీ. 23 భాషల్లో ఈ చిత్రం వస్తుంది. అన్ని భాషల్లో పోస్టర్లను సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ లాంచ్ చేశారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని సురేష్ ఒబెరాయ్- సందీప్ సింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు అని తెలిపారు.



పండగంతా వినోదమే



విక్టరీ వెంకటేష్, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం ఎఫ్2, ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ట్యాగ్‌లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతోంది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హీరోయిన్ మెహరీన్ మాట్లాడుతూ దర్శకుడు అనీల్ రావిపూడి నానుండి మంచి నటన రాబట్టారు. పాత్రకోసం హార్డ్‌వర్క్ చేశాను. నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌తో నేను చేస్తోన్న రెండో సినిమా. తెలుగులో తొలిసారి డబ్బింగ్ చెప్పాను. ఇందులో ఫన్ మాత్రమే ఉంటుందన్నారు. తమన్నా మాట్లాడుతూ దిల్ రాజు బ్యానర్‌లో ఎప్పటినుండో ప్రాజెక్టు కోసం వెయిట్ చేస్తున్నా. కొన్ని అవకాశాలు వచ్చినా కుదరలేదు. ఇప్పుడు ఇంత మంచి ప్రాజెక్టులో భాగం చేసినందుకు దిల్‌రాజుకు థాంక్స్. కామెడీ సినిమాల్లో రియల్ లైఫ్ సిచ్యుయేషన్స్ ఆధారంగా కామెడీ ఉంటుంది. వెంకీ చాలా ఏళ్లుగా నన్ను ఇన్‌స్పైర్ చేస్తున్నారు. ఆయనింకా ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనపడుతున్నారనేది ఇప్పటికే పజిలే. వరుణ్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. త్వరగా ఎఫ్3 చేయాలని కోరుకుంటున్నానన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ రాజా ది గ్రేట్ తర్వాత ఏ సినిమా చేద్దామని అనుకున్నప్పుడు అనీల్ ఈ ఐడియా చెప్పాడు. అనీల్‌తో ఇది మూడో సినిమా. వెంకటేష్, వరుణ్, తమన్నా, మెహరీన్ సహ ప్రతి ఒక్క క్యారెక్టర్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ కనపడుతుంది. సంక్రాంతికి ఎఫ్2 అందరికీ ఫన్ ఇస్తూ సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నామన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో కామెడీ కూడా చేయాలనుకున్నా. వెంకీ కామెడీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. కానీ, అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ ముందుగా అనీల్‌కి థాంక్స్. చాలా రోజుల తర్వాత ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ తర్వాత ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ కామెడీ సినిమా చేయలేదు. చాలా గ్యాప్ తర్వాత అలాంటి సినిమా ఎఫ్-2 చేశాను. తప్పకుండా సినిమాను ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ మూవీ అన్నారు.



రజనీతో రాజమౌళి?

సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాలపై ఫోకస్ పెట్టడంతో ఇక రెండు మూడు సినిమాలకంటే ఎక్కువ నటించే అవకాశం లేదని చాలాకాలం క్రితమే కథనాలు వచ్చాయి. 'కబాలి' తర్వాత 'కాలా' ఒప్పుకున్నప్పుడు దాదాపుగా అదే చివరి సినిమాగా ప్రచారం సాగింది. కానీ ఆ సినిమా పూర్తయ్యేలోపు 'పెట్టా' అన్నాడు. 'పెట్టా' విడుదలయ్యేలోపు మురుగదాస్ సినిమాను లైన్లో పెట్టాడు. రజనీ పొలిటికల్ పార్టీ, ఆయన ఆధ్యాత్మిక విషయాల సంగతేమోగానీ కోలీవుడ్‌లో వినిపిస్తున్న కొత్త టాక్ -మురుగదాస్ సినిమా తర్వాత మరోసారి 'పెట్టా' డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్‌తో సినిమా చేస్తాడని. అక్కడితో ఆగడట, ఆ సినిమా పూర్తికాగానే టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్‌ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తాడని కోలీవుడ్ కోడై కూస్తోంది. రజనీ ప్రస్తుత కమ్మిట్‌మెంట్లు పూర్తయ్యేలోపు రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ పూర్తి చేస్తాడని, ఈ క్రేజీ ప్రాజక్ట్ తర్వాత రాజమౌళి నెక్స్ట సినిమా రజనీతోనే ఉంటుందని అంటున్నారు. ఎంతవరకూ వర్కౌటౌతుందో చెప్పలేంగానీ, కాంబో కనుక ఫిక్సయితే ఇండియాలోనే క్రేజీ ప్రాజెక్ట్ అవుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

శివ కందుకూరి సినిమా



ఇటీవల పెళ్లిచూపులు, మెంటల్ మదిలో చిత్రాలని నిర్మించి నేషనల్ అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులని పొందిన రాజ్ కందుకూరి.. ఇపుడు ధర్మపథ క్రియేషన్స్‌పై మరో లేడీ డైరెక్టర్‌ని సినిమా రంగానికి పరిచయం చేస్తున్నారు. అందులో తన కుమారుడు శివ కందుకూరి హీరోగా కనిపించబోతున్నారు. శివ కందుకూరి అమెరికాలో చదువు పూర్తిచేసుకుని ఈమధ్యే ఇండియాకి వచ్చారు. ఇంతకుముందు ప్రముఖ దర్శకులు సుకుమార్ మరియు క్రిష్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శేష సింధురావ్‌ని ఈ చిత్రంతో దర్శకురాలుగా కందుకూరి పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు. తమిళంలో ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 96 చిత్రం ఫేమ్ వర్ష ఇందులో కథానాయికగా పరిచయం అవుతున్నారు. మహానటి చిత్రానికి స్క్రీన్‌ప్లే మరియు మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ ఈ చిత్రానికి దర్శకురాలితో కలిసి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. రవితేజ గిరజాల ఈ చిత్రానికి ఎడిటర్. వేద రామన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్ బాబు మరియు మధుర శ్రీధర్‌లు ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.